సృజన

ఆధునిక సాహిత్యవేదిక

మాసపత్రిక

196-197

ఫిబ్రవరి-మార్చి

1992

సరిహద్దు భద్రత

నిర్వహణ

'సాహితీమిత్రులు'

సృజన

ఆధునిక సాహిత్యవేదిక

196-197 మాసపత్రిక ఫిబ్రవరి-మార్చి **1992**

ఈ సంచికలో

నిర్వహణ

సాహితీమిత్రులు

ఈ సంచిక రు. 5 సంవత్సర చందా రు. 50

Edited, Printed and Published by P. Hemalatha, Flat 3, Floor 2, Lakshmi Apartments, Nalgonda X Roads, Malakpet, Hyderabad-500 036

and Printed at Nagendra Press, Vijayawada-520 002

Working Editor : Vara Vara Rao

సరిహద్దు భద్రత

మూడు నెలలుగా నిత్యం దినపత్రికలు చదువుతున్న మామూలు పాఠకులకు ఒక అనుమానం ఖచ్చితంగా వచ్చే వుంటుంది. ఈ ప్రభుత్వానికి 'నక్సలైటు సమస్య' తప్ప వేరే సమస్యలేమీ కనబడటం లేదా అని. కరువుతో ఆదిలాబాద్ ఎండి పోవడం లేదా, చేనేత కార్మికులు ఆకలికి చావడం లేదా, తిండి గింజల నుండి బస్ చార్జీలదాకా అన్నిటి ధరలు పెరిగిపోవడం లేదా, పరిశ్రమలు మూత బడటం లేదా, కార్మికులు ఇంటిదారి పట్టడం లేదా, స్కూలు నుండి, కాలేజీ నుండి బయటపడ్డ యువకులు దిక్కుతోచక రోడ్డుపట్టడం లేదా, వైద్యం నుండి విద్యదాకా అన్నిటినీ సినిమా టిక్కెట్లలాగా బజార్లోనో, బ్లాకులోనో కొనుక్కోవలసిన దుర్గతి దేశానికి పట్ట లేదా....

ఇన్ని సమస్యలలో ప్రభుత్వానికి తెలంగాణాలోని 'శాంతిభద్రతలు' ఒక్కటే సమస్యగా కనిపించిందంటే విస్తుపోవడానికి ఆ పాఠకులు విప్లవ సానుభూతిపరులు కానవసరం లేదు. సమస్యల పరిష్కారాన్ని 'యుద్ధ ప్రాతిపదికమీద' చేపట్టడం అనే ఆంగ్ల నుడికారం తెలుగులోకి వున్నది వున్నట్టుగా తర్జుమా అయింది. మన పాల కులు తుఫాను సహాయం నుండి అక్షరాస్యతదాకా అన్నిటినీ యుద్ధప్రాతిపదిక మీద చేపడుతున్నామని అంటుంటారు. నిజానికి వాళ్లు ఈ యుద్ధమొక్కటే యుద్ధ ప్రాతి పదిక మీద చేస్తున్నారు. ఇది పరాయి దేశంలో యుద్ధం కాదు, ప్రజలతో యుద్ధం. మిగిలిన సమస్యలన్నీ ప్రజలకు సమస్యలు. ఈ యుద్ధం పాలకుల సమస్య. అందుకే దానిని యుద్ధప్రాతిపదిక మీద నడుపుతున్నారు.

దేశం బాగుపడాలంటే ముందు 'శాంతి భద్రతలు' వుండాలని ఈ మధ్య మంత్రులు, పోలీసు అధికారులు ఉపన్యాసాలు యిస్తున్నారు. దేశం బాగుపడక పోవడం వల్లే 'శాంతి భద్రతలు' లేకుండా పోయాయని వాళ్లు వొప్పుకోరు. నక్స లైట్ల భయం వల్ల తెలంగాణాలో అధికారులు గ్రామాలకు పోలేకపోతున్నారని, ప్రజల సమస్యలు పరిష్కరించలేకపోతున్నారని ఒక బుకాయింపు బయల్దేరింది. ఆ భయంలేని జిల్లాలలో ఏ మాత్రం పరిష్కరిస్తున్నారో ప్రజలనే అడిగి చూడాలి! అయితేనేం 'శాంతి భద్రతల' లేమి ఒక్కటే రాష్ట్ర పురోభివృద్ధికి అటంకమని ఢంకా బజాయించి ప్రకటిస్తున్నారు. శాంతినీ, భద్రతనూ నెలకొల్పడానికి ఉద్యుక్తు లయ్యారు.

ఒక రకంగా ఇదీ నిజమేనేమో! పురోభివృద్ధి అంటే సమతను, సామాజిక న్యాయాన్ని సాధించడం అనుకుంటే ప్రభుత్వానికి చాలా బాధ్యతలు వుంటాయి. కాని పురోభివృద్ధి అంటే డబ్బున్నవాళ్ల మరింత డబ్బు చేసుకోవడం అని అర్థం చేసుకుంటే శాంతిభద్రతల రక్షణ ఒక్కటే ప్రభుత్వానికి మిగులుతుంది. ఆ పని ప్రభుత్వం చేస్తూవుంటే ఎవరి పురోభివృద్ధి వారు అందినకాడికి సాధించుకుంటారు. సాధించుకోలేనివాళ్లు చస్తారు. ఒకప్పుడు పాలక భావజాలం ఈ దృక్పథాన్ని తిరస్కరించినా, సోషలిజం తన ఆదర్శమని ప్రకటించుకున్నా ఇప్పుడు మట్టుకు బహిరంగంగానే దీన్ని ఆమోదిస్తూ వుంది. దీనికి మన్మోహనిజం అని పేరుపెట్టడం అనవసరం. తప్పంతా ఆ దౌర్భాగ్యుడి మీద నెట్టడం అన్యాయం. సోషలిజం అనే బుకాయింపు చాటున నాలుగు దశాబ్దాలపాటు ఈనాటి 'నూతన ఆర్థిక విధానాల'కు పునాది ఏర్పడింది. ఆ పునాది ఏర్పడేదాకా పురోభివృద్ధి అంటే సమసమాజమని, సామాజిక న్యాయమని బుకాయించారు. పని పూర్తయిన తర్వాత యిప్పుడు పురోగమనం అంటే ఎవరికి ఎంత అందితే అంత చేజిక్కించుకోవడమేననీ, దీనికి కావలసిన సామాజిక శాంతినీ భద్రతనూ రక్షించడం మట్టుకే ప్రభుత్వం కర్తవ్యమనీ పాలకులు బహిరంగంగా ప్రకటిస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వం చదువు చెప్పనవసరం లేదు. డబ్బు పెట్టి చదువు కొనుక్కోవాలి. సారాయి కొనుక్కోవడం లేదా, సిగరెట్టు కొనుక్కోవడం లేదా, ఇది మాత్రం ఎందుకు కొనుక్కోలేరు? ప్రజలకు ప్రభుత్వం వైద్య సౌకర్యం కల్పించనవసరం లేదు. అదీ కూడా కొనుక్కోవాలి. డబ్బుంటే కంప్యూటర్ వైద్యుల దగ్గర, లేకపోతే నాటువైద్యుల దగ్గర. నిత్యావసర వస్తువులు చవగ్గా యివ్వనవసరం లేదు. చవగ్గా యిచ్చే కొద్దీ శాశ్వతంగా బలహీనులుగా వుండిపోతున్నారు. అధిక ధరలకు కొనుక్కుని స్వతంత్రులు కావాలి. యువకులందరికీ ఉద్యోగాలు చూపించనవసరం లేదు. పెట్టుబడిదారులకు లాభసాటిగా వున్నంత మేరకు దేశంలో ఉద్యోగాలు దొరుకుతాయి. కృత్రిమంగా ఉద్యోగాలు కల్పిస్తే ఆర్థిక వ్యవస్థ అసమర్థం అవుతుంది. కాబట్టి ప్రభుత్వం ఆ ప్రయత్నం పెట్టుకోకూడదు. సమసమాజం, సమానత్వం తుప్పుపట్టిన ఆశయాలు నాగరిక సమాజ పరిపాలనా లక్ష్యాలు కావు.

మరింక ప్రభుత్వం ఏం చేయాలి? వర్తకానికి, వ్యాపారానికి అవసరమైన శాంతిని సమకూర్చాలి. దేశ సంపదనూ ప్రజల శ్రమనూ దోచుకోవడానికి అవసర

పైన భద్రతను నెలకొల్పాలి. వీటికి అడ్డం వచ్చే ఉద్యమాలను అణచివేయాలి. పోరాటాలను తుడిచిపెట్టేయాలి. రక్తంతో సమాజాన్ని కడిగి ప్రశాంతతను నెలకొల్పాలి.

ఇవ్వాళ పాలక భావజాలంలో బలంగా నెలకొన్న ఈ దృక్పథాన్ని విస్మరిస్తే తెలంగాణాలో అమలవుతున్న రాక్షసరాజ్యం మనకు పూర్తిగా అర్థంకాదు. నిర్బంధం ఈ రాష్ట్రంలో విప్లవకారులకు, వారి వెనుక వున్న ప్రజలకు కొత్త కాదు. అది ఒకప్పుడు ఎక్కువ, ఒకప్పుడు తక్కువ వుండడం కూడా కొత్తకాదు. కాని జనార్థన రెడ్డి పాలన కేవలం మరొక విడత నిర్బంధం మట్టుకే అనుకుంటే పొరపాటవుతుంది. ఉద్యమాలు, పోరాటాలు, సమసమాజ ఆదర్శాలు, ఆకాంక్షలు దేశాన్ని తప్పుదారి పట్టించే వ్యర్థప్రయత్నాలు. దేశం ప్రశాంతంగా వుంటే విదేశీ పెట్టుబడిదారులు యిక్కడ పెట్టుబడి పెడతారు. వాళ్లు పెట్టుబడి పెడితేనే మనం బాగుపడతాం. సామర్థ్యం వున్నవాళ్లు ఆ పెట్టుబడినుండి తామూ అంతో ఇంతో ప్రయోజనం పొందుతారు. పొందలేక విఫలమయ్యేవాళ్లు ఒట్టి అసమర్థులు. వాళ్ళకు బాగుపడే అర్హత లేదు. అంతేతప్ప పోరాటాల ద్వారా ఉద్యమాలద్వారా అందరి బాగూ సాధించాలనుకోవడం వినాశకరమైన ఆలోచన. అది ప్రశాంతతను భగ్నంచేసి, అభివృద్ధిని ఆటంకపరుస్తుంది.

ఈ విషయంలో జనార్థనరెడ్డికి, పి. వి నరసింహారావుకే కాదు చాలామందికి ఏకీభావం వుంది. పైకి చెప్పడానికి అందరూ యిష్టపడకపోవచ్చును కాని నిన్నటిదాకా ప్రజాస్వామ్యాన్ని గురించి, అభ్యుదయాన్ని గురించి మాట్లాడినవారిలో చాలామందికి యివ్వాళ యిదే అభిప్రాయం వుంది. గోర్బచేవ్, ఎలిత్సిన్‌ల మానసపుత్రులు, పుత్రికలు మనచుట్టూ చాలామంది వున్నారు.

విచిత్రమేమిటంటే ఆర్థికరంగంలో ప్రభుత్వ జోక్యం అసమర్థతకు దారితీస్తుందని వాదించేవాళ్ళకు, సామాజిక శాంతిని నెలకొల్పడంలో ప్రభుత్వ సాయుధ బలగాలకు వుండే సామర్థ్యాన్ని గురించి ఎటువంటి సందేహం వున్నట్టు కనబడదు. విద్యుదుత్పత్తి ప్రభుత్వం అసమర్థంగా చేస్తుందని టాటాకు అప్పజెప్పాలని వాదించేవాళ్లు కరీంనగర్‌లో, వరంగల్‌లో సామాజిక శాంతిని నెలకొల్పే బాధ్యతను బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కు అప్పజెప్పడం తప్పనుకోవడంలేదు. పైకి హేతుబద్ధంగా కనబడే వాదనల వెనుక వర్గప్రయోజనం అంతగా వుంటుంది మరి.

నిజంగా హేతుబద్ధంగా ఆలోచిస్తే బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కరీంనగర్ లోనూ, వరంగల్ లోనూ చేయగల పని ఏమిటి ? న్యాయం అవసరం లేదు శాంతి మట్టుకే కావాలనుకున్నా ఆ శాంతినైనా నెలకొల్పగలదా ? భాష తెలియనివాళ్ళు, సామాజిక పరిస్థితులు తెలియనివాళ్లు, శాంతి ఎందుకు లేకుండా పోయిందో తెలియని వాళ్లు ఏం చేయగలరు ? జనాన్ని కొట్టడం, చంపడం మట్టుకే వాళ్ళు చేయగలరు. ప్రభుత్వానికి కావాలసిందీ అదే. విప్లవ పార్టీల వల్ల ప్రయోజనం పొందిన ప్రజలను హింసించాలి. భూములు పొందినవాళ్ళను, ప్రజాన్యాయస్థానాల్లో సమస్యలు పరిష్కరించుకున్నవాళ్ళను, కూలి రేట్లను పెంచుకున్నవాళ్ళను, హక్కులను సాధించుకున్న వాళ్ళను హింసించాలి. కార్యకర్తల తల్లిదండ్రులను, తోబుట్టువులను హింసించాలి. వాళ్ళ సానుభూతిపరులైన గ్రామీణ యువకులను హింసించాలి. ఇన్నేళ్ళుగా వాళ్ళనే హింసిస్తున్నారు. 'టాడా' కేసులలో వాళ్ళనే జైలుకు పంపుతున్నారు. వాళ్ళ యిళ్లే కూలుస్తున్నారు. దాడులలో వాళ్ళనే చావగొడుతున్నారు. ఎన్ కౌంటర్లలో వాళ్ళనే చంపుతున్నారు. పోరాటాల వల్ల తాము పొందిన ప్రయోజనం కన్న ఈ హింస ఎక్కువ అనిపించి వాళ్ళు దూరం కావాలి. అన్నం పెట్టకూడదు, ఆశ్రయం యివ్వకూడదు, సమస్యలు పరిష్కరించుకోకూడదు, సభలకు సమావేశాలకు హాజరు కాకూడదు, ఎటువంటి సహాయం చేయకూడదు, ఎటువంటి సహాయం పొందగూడదు. ప్రజలను ఈ విధంగా హింసించి దూరంచేస్తే పార్టీ కార్యకర్తలను ఆ తరువాత ఏరి వేయవచ్చుననేది అధికార వ్యూహం. ఈ వ్యూహాన్ని అందరికంటె పాశవికంగా అమలు చేస్తున్న వ్యక్తి వరంగల్ జిల్లా ఎస్.పి. డి.టి. నాయక్. లొంగిపోవడానికి తేదీలు ప్రకటించి, లొంగదీసుకోవడానికి విచ్చలవిడిగా ఎన్ కౌంటర్లు జరిపి వేల సంఖ్యలో లొంగుబాట్లు స్వీకరించి పొరుగుజిల్లాల పోలీసు అధికారులకు రాక్షసత్వంలో మార్గదర్శకుడయ్యాడు.

ఈ పద్ధతులు ఎప్పుడూ, ఎక్కడా విజయం పొందలేదనేది వాళ్ళకు తెలియంది కాదు. మన రాష్ట్ర పాలకులకు రెండు దశాబ్దాల అనుభవం వుంది. దేశ పాలకులకు ఈశాన్య భారత సరిహద్దు రాష్ట్రాలలో మూడున్నర దశాబ్దాల అనుభవం వుంది. అయితే వాళ్ళు సంపూర్ణ విజయాన్ని ఆశించడం లేదు. 'సమస్య'ను బలవంతంగా తొక్కిపట్టి తమ వ్యవహారాలు సాగించుకోవాలని చూస్తున్నారు. ఈ వ్యూహానికి ఎందరు బలయినా వాళ్ళకు పట్టదు. ఎంత హింస జరిగినా పట్టదు. హింసకు

ప్రతిస్పందన :

'ఆ పాపం ఎవ్వరిది ?'

రావిశాస్త్రి

పులులు పులుల్ని చంపవు, సింహాల్ని సింహాలు చంపవు. అలాగే, కుక్కలు కుక్కల్నీ, పందులు పందుల్నీ చంపవు. కాని, చేపలు చేపల్ని తింటాయిట, పాముల్ని పాములు లాగే. అది విన్న మాటే గాని, నేను చూసిన సంగతి మాత్రం కాదు. అయితే, ఈదే చేపల్నీ, ఎగిరే పక్షుల్నీ, పాకే పురుగుల్నీ, నడిచే (కొన్ని) జంతువుల్ని తినే మానవులు కొందరు మాత్రం మనిషి మాంసం మటన్ బిరియానీ కింద ఒండుకు తినేస్తారు. శాస్త్రోక్తంగా శాకాహారులుగా మిగిలిపోయినవారు కూడా ముక్కూ నోరూ మూసి మేకల్ని చంపి యజ్ఞసోమయాజులుగా దాన్ని భక్షించగలరు. అటువంటి వారందర్నీ మనం దుష్టులా, దుర్మార్గులా అనవలసి ఉంటుంది. అటువంటి వారు అన్ని మానవ సంఘాల్లో ఉన్నట్టే రాజకీయ నాయకుల్లోనూ ఉంటారు.

గురయ్యే ప్రజల మనస్సులలో వాళ్ళ పట్ల ఎంత ఏహ్యభావం కలిగినా పట్టదు. ఈశాన్య భారత ప్రజలు యిప్పటికే భారత పాలకులను మనసారా ద్వేషిస్తున్నారు (పాలకులనే కాదు ఇండియన్ అనే మాటనే ద్వేషిస్తున్నారు). ఆ ద్వేషం దేశం నలుమూలలకూ పాకినా పాలకులకు అభ్యంతరం లేదు. వాళ్ళ రాజకీయార్థిక వ్యూహంలో ఐదుశాతం పెత్తందారీ వర్గాలకు, మరొక పదిశాతం ధనిక మధ్యతరగతికి తప్ప తక్కిన ప్రజలకు స్థానం లేదు. ఆ ప్రజల అవసరాలతో వాళ్ళ ఆర్థిక వ్యూహానికి నిమిత్తం లేదు. ఆ ప్రజల ఆమోదం వాళ్ళ రాజకీయ పెత్తనానికి అవసరం కాదు.

ఆ ప్రజలు రాజకీయంగా అనైక్యంగా ఉన్నంతకాలమే ఇది సాగుతుంది. వివిధ రూపాలలో వివిధ ప్రాంతాలలో వివిధ కారణాల వల్ల దమనకాండకు గురవుతున్న వాళ్ళంతా ఒకటైననాడు గానీ ఈ అణచివేతకు జవాబు దొరకదు. ఆ ఐక్యత కోసం అన్వేషించడం ఇవాళ ఎప్పటికన్నా ఎక్కువ అవసరం.

27—2—92

రక్షకభటుల్లోనూ ఉంటారు. ఆ వర్గపు వారినే 'దోపిడి దొంగలు' అని మనం పిలుస్తాం.

ఆ రక్షకభటుల్లో కూడా కొన్ని వర్గాలూ, మరికొన్ని ముఠాలు ఉన్నాయి. ఒక ముఖ్యమైన వర్గం ఐ.పి.యస్ వర్గం. దాన్ని ఇండియన్ పోలీస్ సర్వీస్ అంటారు. అందులో ఉత్తములూ ఉదాత్తులూ లేకపోలేదు. కాని, అందులోనే మరొక ముఠా ఉంది. వారిని ఇండియన్ పీపుల్స్ పెర్సెక్యూటింగ్ సర్వీస్ లేదా, ఇందూ ప్రజా ప్రాణ భక్షణ సంఘం అని పిలవాలి. వారు అన్యాయాలు చేస్తారు, చేయిస్తారు. చేయించడానికి వారి వద్ద దళాలు ఉంటాయి. అన్యాయాలు ఎదిరించేవారినీ, వాటిని వెతికి వెలికి తీసి తూర్పారబెట్టేవారినీ వారు కాల్చి చంపగలరు, చంపి కాల్చగలరు, నానా విధాల హింసించి నరకయాతనలు పెట్టగలరు. వారే నరమాంస భక్షకులు, నరరూప ఖాకీ రాక్షసులు: క్షుధాక్షుభిత ప్రజల ప్రబల విరోధులు. నిన్న కాక మొన్న ప్రజా హితుడు డాక్టర్ కందాళ బాలగోపాల్ మీద హత్యాప్రయత్నం చేసింది వారేనని నిస్సంకోచంగా, నిర్భయంగా చెప్పవచ్చును.

అయితే రక్షకభటుల్లో ఒక కట్టు ఒట్టుగా ఉంది. వారిలో ఉదాత్తులు కూడా వారిలో నీచులపై దండెత్తరు; చూసీ చూడనట్టు ఊరుకుంటారు. నిన్న చీమ చిటుక్కున కుట్టి ఏడంతస్తుల మేడలోకి ఏ మూలకి పారిపోయినప్పటికీ దాన్ని చటుక్కున పట్టుకొని శిక్షించగలిగిన నైపుణ్యం గల రక్షకభటులు డాక్టర్ రామనాథాన్ని, నర్రా ప్రభాకరరెడ్డినీ పట్టపగలు పబ్లిగ్గా ఖూనీ చేసినవారిని ఏల పట్టుకోజాలరు ? ఇప్పుడు బాలగోపాల్‌గార్ని చంపబోయినవారి సంగతి కూడా అంతే అవుతుంది.

“ఆ అవ్వే మరణిస్తే ఆ పాపం ఎవ్వరిదని వెర్రిగాలి ప్రశ్నిస్తూ వెళ్ళిపోయింది” అని రాసేరు మహాకవి శ్రీశ్రీగారు. వెళ్ళిపోయిన వెర్రిగాలి ఎక్కడో అక్కడ గుర్రంలా నిలబడే నిద్రపోతుందని, నిద్రలేచి పెనుతుఫానుగా మారి వచ్చి ఏ పాపం ఎవ్వరిదో చెప్పి తీరుతుందని - పాపం ! ఆ మహాకవికి కూడా ఆ వాక్యాలు రాసిన నాటికి తెలియదు.

రూపొందుతున్న చరిత్ర

మంజీర

అబ్బా...... అమ్మా...... అయ్యో
ఆ— —అయ్యో చచ్చిపోతున్నా
ఊ———ఆ———బతికించండి
అయ్యో! ఏమిటా అరుపులు
కంగారుపడకు! ఒక తల్లి
శిశువుకు జన్మనిస్తోంది
పోలీసుల సామూహిక దాడులు, చిత్రహింసలు,
మిస్సింగ్‌లు, ఎన్‌కౌంటర్లు,
హత్యలు, కిడ్నాప్‌లు, దగ్ధం, విధ్వంసం,
మందుపాతర పేలుళ్ళు, అంబుష్‌లు, రెయిడ్‌లు
అయ్యయ్యో! ఏమిటీ పరిణామం
భయపడకు! నేలతల్లి ఒడిలో
నూతన వ్యవస్థ యాతనపడుతోంది
అవును నేస్తం! విధ్వంసంలో నుండి
విధ్వంసంలోకి కాదు ప్రయాణం
విధ్వంసంలోనుండి నిర్మాణంలోకి
రూపొందినది స్పష్టంగానే వుంటుంది
కాని, మార్పు నర్థం చేసుకోవడమే కష్టం
భయంకరమైన తుఫాను
గొప్ప ప్రశాంతతకు దారి తీస్తుంది
విసుగెత్తించే గందరగోళంలోంచి
ఒక ఆలోచన ఆవిష్కృత మవుతుంది
కఠినమైన, నిర్దాక్షిణ్యమైన వర్గయుద్ధంలో
చరిత్ర రూపు దిద్దుకుంటుంది
దిశ తెలిసిన ప్రయాణమే అయినా

మార్గం మంచు కమ్మింది
అదును చూసుకున్నాడేమో
వాడు యుద్ధం ప్రకటించాడు
మార్గాంతరం లేక మనం
ప్రతిఘటిస్తూనే వున్నాం
మబ్బులు విడిపోయేనాటికి
ప్రజా యుద్ధం ఒక వాస్తవంగా
రూపు దాలుస్తుంది

నేను యుద్ధంలోనే పుట్టాను

కౌముది

నేను యుద్ధంతోనే విశ్వగర్భంలో
నా స్థాన మేర్పరచుకున్నాను
విశ్వమాత ప్రసవ వేదన మజిలీలో
ఎన్నో పొలికేకలు యుద్ధాలు....
నా పొలికేక యుద్ధ శంఖారావంగా
ఈ యుద్ధక్షేత్రంలో అడుగుపెట్టాను
ఈ విశ్వానికి సంపదనేను. సౌందర్యం నేను
ఉత్పత్తి నాది
జవసత్వాలు నావి కావు
జీవం నాది
జీవన విధానం నాదికాదు
అందుకే
సమస్త సంపదలపై
సర్వాధికారం నాదన్నందుకు
నేను యుద్ధంలోకి నెట్టబడ్డాను
యుద్ధంలో శాంతినీ
శాంతిలో యుద్ధతంత్రాన్నీ పన్నే
యుద్ధ నిపుణున్ని నేను

యుద్ధ వీరున్ని నేను
ఈ యుద్ధాన్ని నేను యాంత్రికంగా చేయడం లేదు
సర్వ సంపదలపై సర్వాధికారాన్ని పొందడం కోసం చేస్తున్నాను
ఈ యుద్ధం నా సర్వస్వం—నా సంపద
త్యాగం—విజయం రెండు భుజాలమీద
యుద్ధాన్ని నా తలమీద మోసుకుని
దిశ దిశలకు వ్యాపిస్తాను
రక్తపాతంలో హిమాలయాల్ని ఎరుపెక్కించే
ఈ యుద్ధాలకు అర్థాన్ని మార్చే సరికొత్త మానవుడినై
మళ్ళీ యుద్ధంలోనే పుడ్తాను

'చెట్లు'

ఖజర్రా

చెట్లు....చెట్లు....చెట్లు
చెట్లు పెరుగుతున్నాయి
అడవి పెద్దదవుతూంది !
కాలుష్య నిర్బంధంలో కూడా
నిటారుగా లేస్తున్నాయేం !?
అరే....అకురాల్చుతుందేగాని మరణించదే !?
నరికినచోటా చిగురిస్తుందే....
శాఖోపశాఖలై పరచుకుంటూ
అల్లుకుపోతున్న చెట్లు
మొదలకు నరికినా సరే
భూమిలోపలి వేళ్ళు పొడుచుకొస్తూ
మళ్ళీ మొక్క....చెట్టై....—
ఇక భూమిలోపలి వేళ్ళని
మట్టితో కలసి పెనవేసుకున్న వేళ్ళని
తవ్వాలని చూస్తున్నావా ?

తప్పు....మిలటరీ దళాల్ని పెట్టి
బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌తో తప్పు....
భూమి కంపిస్తుంది !
ఆ భూకంపంలో నీ ప్రయత్నం చస్తుంది
నువ్వూ తేరుకోలేనంతగా చస్తావ్
చెట్లు మాత్రం పెరుగుతూనే వుంటాయి !!

ఏకశిల

రూప

ఈ లిప్తదాకా కడుపులో తన్నుకులాడిన
వాడు
నగరాల మీదా, వూళ్ళ మీదా
పిట్టలమీదా, దీపకరాగాల మీదా
రాకాసి అంబోతుల్ని రంకెలేయిస్తున్నాడు.
బహుశా నిజమే కావచ్చు–
స్పార్టకస్ ఎప్పుడూ పురికంబమెక్కచ్చు – కానీ వెనక నడచిన
రోమన్ బానిస శిలువను జెండా కొయ్యగా సానబెట్టాడు
సహజమే కావచ్చు–
నగరాలు బ్యారక్స్‌గా
వూళ్ళు జైళ్ళుగా
రోడ్లు ఇనుపబూట్లుగా నాగరికతలోకి చొచ్చుకరావచ్చు.
ఒక అజ్ఞాత భయం
భోగమంచై చుట్టుకపోవచ్చు.
అవును – రహస్యమే కావచ్చు-
ఆకాశంలో రక్తపు చుక్కలు మెరవడాన్ని
ఎవరూ గమనించకపోవచ్చు
ప్రతి ఒకడి చెయ్యీ తుపాకీగా మారుతున్న
శబ్దాన్ని ఎవరూ వినకపోవచ్చు-

నిజం ! మృత్యువు బహిరంగమే కావచ్చు
నీ ఇంట్లో తెల్లారి వార్తల్లోకి నువ్వు తల దూర్చినపుడు
వెన్ను మీద చల్లగా చావు పాకవచ్చు
మనుషులు జ్ఞాపకాలుగా కూడా గోడలకు వేలాడకపోవచ్చు
సందేహంలేదు—ధిక్కారం నేరమైన చోట
ప్రతి ఒక్కడూ పుట్టుకతో గొలుసులు మోస్తాడు
—ఇప్పుడిక మృత్యువుతో కరచాలనం చేస్తాను
సర్రున విద్యుత్తు ప్రసరించనీ.

పారాహుషార్ ! పారాహుషార్ ! !

యార్లగడ్డ రాఘవేంద్రరావు

పారాహుషార్ పారాహుషార్
నింగీనేలా కొండా కోనా పారాహుషార్
ఆకూ అలా గాలీ గువ్వా పారాహుషార్
ఊరూ వాడా మనిషీ మనసూ పారాహుషార్
పారా హుషార్ పారా హుషార్

మళ్ళీ నెత్తుటి రుచి మరిగిన పులి
చావు సంచీ భుజాన వేసుకుని షికారు బయలుదేరింది
కంటి గూటిలో నిద్ర గువ్వ వాలాక నడిరాత్రి దాటాక
చీకటి దుప్పటి ముసుగేసుకుని
దొంగలా మెరుపుదాడి చేసి
వీధి వీధీ వాడిగోళ్ళతో రక్కుతోంది
అడవిపూల పరిమళాల్ని పీలుస్తున్న
ఊపిరుల్ని ఏరి ఏరి వేటాడుతోంది
లేడి పిల్లల రుధిరధారల్ని దోసిళ్ళతో జుర్రుకుంటోంది

మళ్ళీ పిశాచి గణాల కవాతు మొదలయింది

ఊరు ఊరు హింసా విధ్వంసాల
గాలి వానకు తలవాల్చేసిన పంట చేనవుతోంది
రాత్రి పడిన పిడుగులకు జీవజలధులింకిపోయిన
పంట కాలవల్ని చూసి
గొంతు దాటి రాని దుఃఖంతో కుమిలిపోతోంది
మళ్ళీ వేటగాడి ఆట మొదలయింది
కోన (పక్షుల) రెక్కలు విరిచే
రక్కసకేళి మొదలయింది
మళ్ళీ వేటకుక్కల దండు బయలుదేరింది
ఆశ్రయమిచ్చిన పిచ్చుకగూళ్ళపై విరుచుకుపడుతూ
ఉత్సవాలు చేసుకుంటోంది
రహస్య హత్యల సమీకరణాల్ని వల్లె వేస్తూ
జీవితాల్ని అగ్గిముద్దల్ని చేసి
అజ్ఞాతంలోకి విసిరేస్తోంది

పారాహుంషార్ పారాహుంషార్
పారాహుంషార్ పారాహుంషార్

మళ్ళీ ఐంద్ర జాలకుడి గారడీ మొదలైంది
కాలాన్ని శత్రులవంతెనగా మార్చి
క్షణాలమధ్య విరామాన్ని బుల్లెట్లతో కాలుస్తూ
విశ్వాసాన్నే మరణశాసనం చేసి
కంటతడి తుడిచే చేతుల కలల తడి తుడిచేసే
తలారి ఉరితీతల రాగాలాపన సాగుతోంది
ఛిద్రస్వరాల శిథిలాలమీద ఎగిరేందుకు
హంతకుడి విజయకేతనం పురి విప్పుకొంటోంది

మళ్ళీ ఖడ్గ సంభాషణ మొదలయింది
మళ్ళీ నరమేధయాగం సాగిపోతోంది
స్మశానాలమీద మహా సౌధ నిర్మాణం జరిగిపోతోంది

మానవత్వం ప్రేమగా కదలాడిన సన్నివేశాన్ని
బీభత్స దృశ్యంగా మార్చేసి
చూపు చూపు చివర భయం తెరలు జార్చి
గుండె గుండె కొసనా ఆర్తనాదాల్ని ఆరబోస్తోంది
సమాధులపైనుంచే శాంతి గాలులు వీస్తాయని ప్రవచిస్తూ
సమరచితులే తూర్పు జ్యోతులవుతాయంటున్న
ఆకాశాల్ని హత్య చేస్తోంది
కన్నీటి బిందువులకు మోకరిల్లిన
శిరసుల్ని తెగనరికి
జీవధాతువు నింపుతున్న ఆశల తరుణాంకురాల్ని గిల్లేసి
ఖాకీగుడ్డకు గులాంగిరీ చేయమంటోంది

చిలిపితనం గురి చూసిన బొమ్మ తుపాకీకే హడలిపోయి
లేత వేళ్ళపై లాఠీల మేకులు దిగ్గొట్టి
పసి ప్రాయాన్ని చిత్రహింసల చీకటి చెరువులోకి పడదోసి
యుద్ధం ప్రకటించిన వెర్రి నాయాళ్ళారా
చీకట్లో ఉచ్చబోసుకుంటున్న చప్పుడూ
తుడుం విరావంగా తోచి తుళ్ళిపడే ఉల్లాకాల్లారా
రేయింపవళ్ళ పేజీల మీద అవిరామంగా
నెత్తుటి సంతకాలు చేస్తున్న దౌర్భాగ్యుల్లారా
మౌనాన్ని అనుమానిస్తోంది మీరు
నినదించిన స్వరతంత్రులపై నిశ్శబ్దాన్ని కప్పిపోస్తోందీ మీరే
హింసా హింసల సరిహద్దుల్ని చెరిపేసింది మీరు
గాయాలకు వైద్యం చేయలేక
మృత్యు శైత్యాన్ని విరజిమ్ముతోందీ మీరే
శవాల కుప్పల మధ్య నిలిచి
శాంతి మంత్రోచ్చాటన చేస్తోందీ మీరే

ముళ్ళ కిరీటాన్ని క్రీస్తైనా ఎంతకాలం మోస్తాడు
నీళ్ళింకిపోయిన నీలి మాగాణం మీద
పడవ ప్రయాణం ఎంతదూరం సాగుతుంది

గడియారం ముళ్ళనుంచి ధారకట్టిన
విషాద జలపాతం ఎన్ని రుతువుల్ని లాలిస్తుంది

జీవితకాల ప్రయాసంతా
వ్యర్థమైపోయిందని తెలిసిన ఒక్క క్షణం చాలు
గుండె కదిమిపెట్టి దాచుకున్న ఇంద్ర చాపాల్ని
స్వరాలు తెగిన పాటలుగా నిర్దాక్షిణ్యంగా
దోసిళ్ళలోకి రాల్చిపోయిన ఒక్క ప్రకంపనం చాలు
నిట్టూర్పుల చెకుముకి రాళ్ళ రాపిడిలో
దృశ్యం రాజుకోవడానికి
మీరు పాతిపెట్టిన నమ్మకాలు
గాండీవాలై పునర్జన్మ లెత్తడానికి

పారాహుషార్ పారాహుషార్
పారాహుషార్ పారాహుషార్

మృత్యువు మంత్రజలాన్ని చిలకరించే మీ కమండలాలు
మీ కంఠ నాళాలు బిట్టీయం పట్టిన నేపథ్యగానాలు
ఆధునికమైనట్లే
కన్నీళ్లూ సాంకేతికమై పదునెక్కడమే పరిణామం
ఎండమావుల వెంట పరిగెత్తే జీవనశైథిల్యం
ఆగి వెనక్కిమళ్ళి నిరసన ప్రకటించడమే అనివార్యం
పొద్దుకుంకే ఆకాశమే కాదు
పొద్దుపొడిచే ఆకాశమూ అరుణారుణం కావడమూ సహజం

సంకెళ్ళ కింద నలిగిన దేహనదులు
ఆంక్షల బరువుకి వంగిన శిరస్సుల శిఖరాలు
కత్తివేటుకు తెగిపడ్డ పేగుల ప్రశ్నలు
ఖండితాలై స్వప్నాలు స్రవించిపోయిన హృదయాలు
చేయి చేయి కలిపి అలలు అలలై కదులుతాయి
ఉరికొయ్యల నీడల్ని చెరిపేస్తాయి

పారాహుషార్ పారాహుషార్
పారాహుషార్ పారాహుషార్

ఇప్పుడిక్కడ సజలగాయం కావడమంటే
దీపశిఖలుగా చిగురించడమే
ఇప్పుడిక్కడ జాము రాతిరిలో రాలిపోవడమంటే
సూర్యుళ్ళుగా వికసించడమే

మృత్యురుతువు

సుధాకిరణ్, కృపా

పావురాలూ, పక్షులూ, చెట్లూ, పూలూ లేని
నగరాన్నెలా వూహించడం ?
అక్కడ రెక్కలు టప టపలాడే ధ్వనుల్లే వే
ఆకుల గలగలల సవ్వడి వినిపించదే
రుతువుల్ని ఆకాశపు జాడల్లోనే గుర్తించాలి—
గాలి పరిమళాన్ని మోసుకొస్తేనో
చుట్టూ వూళ్ళనించి పూలవాళ్ల పూలగుత్తుల్ని మోసుకొస్తేనో
వసంతం వచ్చిందని అంగళ్ళలో అరిస్తేనో
వసంతం వచ్చినట్లు—
ఇళ్ళన్నీ ఎర్రటి ఎండలో వేగిపోయి
బూడిదరంగు ధూళి గోడల్ని కప్పేస్తే అది వేసవి—
—అల్బర్ట్ కామూ, "ద ప్లేగ్"
రుతువులన్నీ కాలం భుజమ్మీద చెయివేసి
నవ్వుతూ పలకరించి వెళ్ళిపోయినాక
మనిషి వీధుల్లో ఒంటరిగా నిలిచిపోయాడు—
నిమజ్జనాలకై విగ్రహాలు వూరేగివెళ్ళిన
నెత్తుటి చారికల వీధుల్లో మనిషిప్పుడు ఒంటరి—
ఇదేమి రుతువనే ప్రశ్న
దిక్కుల్ని తాకివచ్చి తిరిగి చెవుల్లోనే ప్రతిధ్వనించింది-
రాత్రినీ, పగటినీ
వీధి మలుపున పగిలిపోయిన లాంతరుకి పురితీసినట్లున్నది-

క్షణ క్షణమూ కత్తిపోటుకి గురయి
కాలమే క్షతగాత్రమై నెత్తురోడుతున్నట్లు—
కిటికీలోంచి కనిపించని సూర్యోదయాన్ని
ఎవరో చురకత్తులతో పొడిచినట్లు—
ఆ సందు చివర నిస్సహాయపు ఆర్తనాదాన్ని
ఒక విచ్చుకత్తి నరికేసినట్లు—
గాలినీ ఒక బల్లేనికి గుచ్చి
కసాయి మూక కేరింతలు కొడుతున్నట్లు—
గుండెల్ని ఎండుటాకుల్లో పెట్టుకొని
భయకంపితమై గాలి స్తంభించి....
పసిబిడ్డ కేరింతలో మృత్యురాగం....
పైట చెంగు కదలికలో ఆగంతకుల అడుగుల చప్పుడు....
ఏమి రుతువిది ?
ఆకురాలు కాలం కాదే
రేపటి వసంతపు సంకేతమైనా లేదు
నెత్తురు పారుతున్నది కానీ
చినుకూ లేదు - మేఘమాల జాడా కానరాదు -
మంచుబిందువులో, సాచికొట్టే చలిగాలులో
ఇలా గడ్డ కట్టించే భయాన్ని మోసుకురావు కదా
ఒలికిన నెత్తురు ఆవిరై మేఘమవ్వ
ఇది గ్రీష్మమూ కాదు
ఏమి రుతువిది ? ఎక్కడి కాలమిది ? ? ఏ దేశమిది ? ? ?
ఇది ఆధిపత్య ప్రమాదపు రుతువు -
మనుషుల భుజాలపై ఊరేగే ఏనుగుతలల విగ్రహాలు
ప్రాణాల మీదుగా నడిచే కాలం—
పగటి వెలుతురులోకి రాత్రి చీకటి నీడల వదంతులు నిండి
రాత్రి టిక్‌టిక్‌మనే క్షణాల నిండా భయం పాకిపోయిన రుతువు—
వీధి మొగల్లోకి, సందుల్లోకి
టి.విలు చూస్తున్న గదుల్లోకి
పెట్రోలు చిలకరించి భగ్గుమనే రుతువిది—

బెంగాలీ కథ :

మంత్రగత్తె

మహాశ్వేతా దేవి

భగీరథ్ వాళ్ళమ్మను 'మంత్రగత్తె'గా ప్రకటించి ఊళ్ళోంచి వెలివేసే నాటికి భగీరథ్ చాల చిన్నవాడు. ఆమె మామూలు మంత్రగత్తె కాదట. మామూలు మంత్రగత్తెను చంపినట్టుగా ఆమెను చంపేస్తే చంపిన వాళ్ళ పిల్లలకు కీడు మూడుతుందట.

కనుక చండి అస్పృశ్యురాలయిపోయింది. రైలు కట్ట పక్కన గుడిసెలో ఒంటరిగా నివసించడం మొదలుపెట్టింది. ఇక భగీరథ్‌కు సవతి తల్లి చేతుల్లో కష్టాలతో పెరగక తప్పలేదు. కన్నతల్లి అంటే ఎట్లా ఉంటుందో భగీరథ్‌కు తెలియనేలేదు. అప్పుడప్పుడూ మంత్రగత్తె చండి ఒంటరిగా జీవించే ఆ గుడిసెవైపు, బొలాలకవతలి చెట్టు కిందికి చూపు సారించేవాడు గాని, ఆమె తల్లి అనే మాటకు ప్రతిరూపమనిపించేది కాదు.

ఆ గుడిసెమీద ఎగిరే ఎర్రజెండాను కూడ చూసేవాడు. ఎండాకాలంలో

పాలిస్తోన్న తల్లుల తన్మయత్వంలోకి
మృత్యువు బాకులు విసిరిన కాలం
పసితనపు చెక్కిళ్ళపై కత్తిగాట్లను చెక్కిన కాలమిది
ఖద్దరు బట్ట కుట్రలో
వూపిరికి పహరా పడగనీడలో ప్రాణాలు పావులైన దేశమిది
"ఖూన్ ఖరాబా హోతాహై
తో హోనేదో ఏక్ బార్" నినాదం మార్మోగే రుతువిది
బోల్‌దో అబ్ ఇస్‌షహర్ మేఁ ఖూన్ బహానేకా
మౌసమ్ అగయాహై....
ఇప్పటిదాకా ఘడాలపై వూరేగిన ఏనుగు తలల విగ్రహాల్ని విసిరేసి
విగ్రహాల్ని మలిచిన చేతులే
ఆకులై, కొమ్మలై కొత్తగాలి వీస్తే....
వూపిరిని చుట్టుకొనీ ఈ విషపు కొండచిలువ రుతువుని
మనిషి వెలుతురికి వురి తీస్తాడు —

మండుటెండలో అప్పుడప్పుడు ఓ ఎర్రచీర కట్టుకున్న ఆకారం రేకు పళ్ళెంమీద శబ్దం చేస్తూ వరిపొలాల కడ్డంబడి ఎండిపోయిన చెరువు వేపు నడుస్తూ కనబడేది. ఆ ఆకారం వెంట ఓ కుక్క కూడ ఉండేది. మంత్రగత్తె ఎటన్నా కదిలినప్పుడల్లా జనానికి తెలియడానికి అట్లా శబ్దం చేస్తూ నడవాల్సి ఉండేది. ఎందుకంటే ఆమె చూపు ఓ యువకుడి మీదనో, పిల్లవాడి మీదనో పడిందంటే ఇక ఆమె వాళ్ళ రక్తం తాగాల్సిందే. అందుకే మంత్రగత్తెల్ని ఏకాకులుగా ఉంచుతారు. ఆమె కదిలిందంటే, ప్రతి ఒక్కరూ, యువకులూ, ముసలివాళ్ళూ ఆ దరిదాపుల్లోంచి తప్పుకుంటారు.

ఒక రోజు, ఆ ఒక్కరోజు మాత్రమే, భగీరథ్ తండ్రి కాళీందర్ ఆ మంత్రగత్తెతో మాట్లాడుతుండగా చూశాడు. "బిడ్డా ఇటు చూడకు" అని కాళీందర్ కొడుకును ఆదేశించాడు.

మంత్రగత్తె చెరువు ఒడ్డున మునివేళ్ళమీద నిలబడి ఉంది. ఎర్రచీర కట్టుకున్న స్త్రీ ప్రతిబింబాన్ని భగీరథ్ చెరువులో చూశాడు. అట్టకట్టిన చిక్కు వెంట్రుకల మధ్య పసుపుఛాయ ముఖం కనబడింది. ఆ కళ్ళు ఆయనను మౌనంగా పరికిస్తున్నాయి.

అంటే మంత్రగత్తె భగీరథ్ వైపు సూటిగా ఏమీ చూడలేదు. ఆ నీళ్ళలోనే తన ప్రతిబింబం చూస్తున్న భగీరథ్ ప్రతిబింబాన్ని ఆమె చూస్తోంది. తీవ్రంగా వణికిపోతోంది. భగీరథ్ కళ్ళు మూసేసుకుని గట్టిగా నాన్నను కావలించుకున్నాడు. "ఎందుకొచ్చావిక్కడికి ?" అని బుసకొట్టాడు నాయన.

"గంగపుత్రా- నా వెంట్రుకలకి చమురు లేదు. ఇంట్లో కిరోసిన్ లేదు. ఒక్కదాన్నే ఉండాలంటే భయం వేస్తోంది".

ఆమె ఏడుస్తోంది. మంత్రగత్తె ఏడుస్తోంది. చెరువు నీళ్ళలో ఆమె కళ్ళు ప్రతిఫలించాయి. గుడ్ల నిండా నీళ్ళు నిండిన కళ్ళు.

"శనివారం నాడు వాళ్ళు నీ వారం బత్తెం పంపలేదా ?"

డోమ్ (శవాల పనులు చూసే, దహనాలు నిర్వహించే అస్పృశ్య కులం) కులం వాళ్ళలోంచి ఎవరో ఒకరు ప్రతి శనివారం ఆ చెట్టు దగ్గరికి వెళ్ళి వారానికి సరిపడే బియ్యం, పప్పులు, ఉప్పు, నూనె వగైరా సామాన్లన్నీ అక్కడ పెట్టేసి వస్తారు. చెట్టును తమకు సాక్షిగా ఉండమని దండాలు పెట్టుకుంటూ పరుగెత్తు కొచ్చేస్తారు.

"కుక్కలు ఎత్తుకుపోయాయి"

"డబ్బులేమన్నా కావాలా ?"

"నాకెవరయినా అమ్ముతురా ?"

"సరే....సరే....నేనే కొనుక్కొస్తానులే. ఇక వెళ్ళిపో"

"నేను ఉండలేక పోతున్నాను. ఒక్కదాన్నే ఉండలేకపోతున్నాను".

"మరి మంత్రగత్తె వెందుకయ్యావు ? వెళ్ళిపో ఇక!"

ఆయన చెరువు పక్క నుంచి చేతినిండా బురద తీసుకున్నాడు. "గంగపుత్తా, ఈ పిల్లవాడు... ?"

బూతులు తిడుతూ ఆయన బురద ఆమె మీదికి విసిరాడు. మంత్రగత్తె పరుగెత్తి వెళ్ళిపోయింది. "నువు, నువ్వామెతో మాట్లాడినావా, అయ్యా ?"

భగీరథ్ భయంతో వణికిపోయాడు. ఎందుకంటే మంత్రగత్తెతో మాట్లాడడమంటే చావును కొనితెచ్చుకున్నట్టే. తండ్రి చచ్చిపోవచ్చుననే ఆలోచనతో భగీరథ్ వెలుగులన్నీ మాసిపోయాయి. ఒక సవతి తల్లి తనను తప్పకుండా తన్ని తగిలేస్తుందన్నమాట.

"ఆమె ఇప్పుడు మంత్రగత్తె కావచ్చు. కాని ఒకప్పుడు నిన్ను కన్నతల్లి".

నాయన గొంతు ఎన్నడూ లేనట్టుగా నిరాశగా ధ్వనించింది. భగీరథ్‌కు తన గొంతులో ఏదో ఎగసి వచ్చి అడ్డుపడుతున్నట్టనిపించింది. మంత్రగత్తె తన తల్లా?! అంటే మంత్రగత్తె మనిషేనా ? మంత్రగత్తెలు చచ్చిపోయిన పిల్లల్ని భూమిలోంచి తవ్వి తీసి, రొమ్ముకదుముకొని, పాలిస్తారని తాను వినలేదూ ? మంత్రగత్తెల చూపు పడితే పచ్చని చెట్టు నిలువునా మాడిపోతుందట కదూ ? మరి, మరి, భగీరథ్, తాను ప్రాణాలతో ఉన్న మనిషి మంత్రగత్తె కడుపున పుట్టాడా ? ఇంకేమీ ఆలోచించలేకపోయాడు ... "ఆమె ఒక ఇల్లాలుగా ఉండేది, ఆమె నిను కన్నతల్లి"....

"అంటే నీ భార్యా ?"

"ఔను. అంతే"

ఏమయిందో ఏమో కాళీందర్ నిట్టూర్చాడు. కాస్త ఆగి "నేను చచ్చిపోయేలోగా నీకు అంతా చెపుతాను. ఆందోళనపడకు" అన్నాడు.

బురద కాల్వ వెంట వెనక్కి తిరిగి వస్తుండగా భగీరథ్ తండ్రి వేపు ఆశ్చర్యంగా చూశాడు. అంతకు ముందెప్పుడూ తండ్రి ఆ గొంతుతో మాట్లాడగా విన

లేదు. వాళ్ళు మామూలు డోమ్‌లు కాదు. వాళ్ళు శ్మశానాల్లో పని చేసేవారు. మునిసిపాలిటీ ఒక్క కుటుంబానికి మాత్రమే అనుమతి ఇచ్చేది. ఆయన కుటుంబం వెదురు కర్రలతోనూ, పేముతోనూ చిన్నా చితకా వస్తువులు తయారుచేసేది. ప్రభుత్వ క్షేత్రాల్లో పశువుల్ని సంరక్షించేది. చెత్త నుంచి ఎరువులు తయారు చేసేది. మొత్తం డోమ్ కులంలో ఒక్క కాళీందర్‌కు మాత్రమే సంతకం చేయడం వచ్చు. అందువల్ల ఈ మధ్యనే ఆయనకు సబ్ డివిజనల్ శవాల గదిలో నౌకరీ దొరికింది.

ప్రభుత్వోద్యోగమంటే నెల గడిచేసరికి కాళీందర్ గంగపుత్ర అని సంతకం చేస్తే నలభై రెండు రూపాయలు చేతిలో పడేవి. అంతేగాక, ఆయన అనాథ శవాల నుంచి అస్థిపంజరాలు వేరు చేసేవాడని, అందుకు సున్నం, బ్లీచింగ్ పౌడర్ వాడేవాడని భగీరథ్‌కు తెలుసు. మొత్తం అస్థిపంజరానికి, చివరికి ఒక పుర్రెకూ, పక్క టెముకలకూ కూడ బోలెడన్ని డబ్బులొచ్చేవి.

శవాల గది అధికారి ఆ ఎముకల్ని బోలెడు లాభానికి కాబోయే డాక్టర్లకు అమ్మేవాడు. దాంట్లోంచి పదో, పదిహేనో నాయనకు దొరికితే అదే ఎక్కువ. దాన్ని ఆయన వడ్డీలకిచ్చి, ఆ వడ్డీ డబ్బులతో పందులు కొన్నాడు.

కులంలో నాయనంటే అందరికీ గౌరవం. ఆయన సబ్ డివిజనల్ ఆఫీసుకు చొక్కా వేసుకుని, బూట్లు తొడుక్కొని పోయేవాడు. ఇప్పుడు ఆయన కళ్ళలో ఎర్ర జీరలు పరచుకున్నాయి. కాషాయ రంగు క్షితిజం మీద ఎర్రటి ముద్రలా ఎగురుతున్న గుడి పైమీది ఎర్రజెండాను చాలసేపు చూస్తుండిపోయాడు.

"దానికి చీకటి పడిందంటే చాలు, ఎంత భయం వేసేదో" అని గొణిగాడు. "దేవుడు దాన్నే మంత్రగత్తెగా మార్చాలా? చచ్చిపోయినా బాగుండేది. కాని ఇప్పుడు దాని ప్రాణాలు తీసుకోగలిగింది అది మాత్రమే నీకు తెలుసా బిడ్డా?"

ఆగకుండా అంతసేపు మాట్లాడాడంటే కాళీందర్ చాల చాల విచారంగా ఉండి ఉండాలి.

"అయ్యా—మనిషిని మంత్రగత్తెగా మార్చేసేదెవరు?"

"దేవుడు"

ఆ మిట్ట మధ్యాహ్నపు ఎండలో భగీరథ్‌కు దగ్గరలో మరే నీడ అయినా ఆడుతుందేమోనన్నట్టు జాగ్రత్తగా చుట్టూ చూశాడు కాళీందర్. ఏమంటే బజార్లో పూలమ్మే వాళ్ళలా ఈ మంత్రగత్తెలు చాల జిత్తులమారి వాళ్ళు. ఏ పిల్లాడిమీదనైనా

పడదలచుకుంటే మంత్రగత్తె ఆ పిల్లాడి పక్క పక్కనే నడుస్తుంది. చుట్టూ విపరీతంగా ఎండ కాస్తున్నా తన ముఖం నీడలో ఉండేలా నడుస్తుంది. మనుషులకు కనబడకుండా, తన ముసుగు నీడ పిల్లాడి మీద పడేలా నడుస్తుంది. పిల్లాడు గనుక చచ్చిపోతే అమాయకత్వం నటిస్తూ "నాకేం తెలుసు? ఈ ఎండలో పిల్లాడి మీద నీడ ఉంచాలని ప్రయత్నించానంతే. కాని పిల్లాడేమో వెన్నలా కరిగిపోయాడు! అబ్బ ఎంత సున్నితం!" అనేది. తన కొడుకు చుట్టుపక్కల ఎక్కడా ఆ దుర్వాసన వేసే నీడగాని, ఎర్రటి మురికి కొంగు కాని కనపడకపోవడం చూసి కాళీందర్ కుదుటపడ్డాడు. "బిడ్డా, భయపడకు. అది నీకేం కీడు చెయ్యదు" అన్నాడు.

కాని భగీరథ్‌కింకా అనుమానం పోలేదు. వాడి మనసు ఎప్పుడూ ఆ గుడిసె వైపే మళ్ళుతుండేది. వరి చేన్లో ఉన్నా, ఆవులు కాస్తూ పచ్చిక బీళ్లో ఉన్నా వాడి ఆలోచనలు మాత్రం రైలుకట్ట పక్కకు వెళ్ళిపోయేవి. తన ఒంటరితనానికి మంత్రగత్తె ఎట్లా భయపడుతోందో, జుత్తుకు చమురు రాసుకుని ఎండాకాలపు గాలికి ఆరబెట్టుకుంటోందో అని మనసులో చూస్తుండేవాడు.

కాని వాడికి అక్కడికి వెళ్ళాలంటే మాత్రం భయం వేసేది.

అక్కడికి వెళ్ళిపోతే తిరిగి రాలేనేమోనని వాడి భయం. ఆమె తనను ఏ చెట్టుగానో, రాయిగానో మార్చేస్తుందేమో.

రోజుల తరబడి వాడు అట్లా చూస్తూ ఉండిపోయాడు. చెట్టుకూ మంత్రగత్తె గుడిసెకూ మధ్య ఆకాశం స్త్రీ నుదుటిలాగ అనిపించేది. ఆ ఆకాశంలో అప్పుడప్పుడు ఎగురుతుండే, అప్పుడప్పుడు నిశ్చలంగా ఉండే ఎర్ర గుడ్డపీలిక కుంకుమబొట్టులాగ ధగధగలాడుతుండేది. అక్కడికి పరుగెత్తాలని వాడికి వెర్రికోరిక చెలరేగేది. తన ఆలోచనకు తానే భయపడి గబగబా ఇంటికి నడిచేవాడు.

ఆశ్చర్యకరంగా వాణ్ణి ఎవరూ మంత్రగత్తె కొడుకని వేధించేవాళ్ళు కాదు. పైగా వాడి పట్ల చాల శ్రద్ధగా కూడ ఉండేవాళ్లు. ఎందుకంటే మంత్రగత్తె కొడుకును బాగా చూస్తే, మంత్రగత్తె మీకు అనుకూలంగా ఉంటుంది. మీ పిల్లలు భద్రంగా ఉంటారు. మీరు మంత్రగత్తె కొడుకును సరిగ్గా చూడకపోతే మీ పిల్లలు చచ్చిపోతారు.

భగీరథ్ పెంపుడు తల్లికూడ వాణ్ణి సరిగ్గా చూడకుండా ఏమీ ఉండదు. నిజానికి ఆమె వాడిపట్ల ఏ భావాన్నీ ప్రకటించదు. ముఖ్యమైన కారణమేమంటే ఆమెకు

కొడుకులు లేరు. ఆమె పిల్లలిద్దరూ సైరవి, గైరబి ఆడపిల్లలే. ఆమెకు భర్తమీద కూడ పట్టు లేదు. ఆమె కొడుకును కనకపోవడం ఒక కారణమయితే, ఆమె రూపం మరో కారణం. ఆమె పళ్ళూ చిగుళ్లూ ఎంతగా బైటికి పొడుచుకొచ్చి ఉండేవంటే, ఆమె పెదాలు ఎప్పుడూ మూసుకునేవి కావు. ఆమె ఎప్పుడూ ఇల్లొదిలి బైటికి వెళ్లేది కాదు. "ఈ ముఖం ఎవరికైనా ఎట్లా చూపించను ? నా పెదాలు అసలు మూత పడనే పడవు. దానితో నేను ఎప్పుడూ ఎగతాళిగా నవ్వుతున్నట్టుంటుంది. గంగ పుత్రా, నేను చచ్చిపోయాక నా ముఖంమీద బట్ట కప్పు. లేకపోతే అందరూ అదిగో, ఆ డోమ్ వాడి భార్య, ఎత్తుపళ్ళది వెళ్ళిపోతోంది అంటారు" అనేదామె.

జాషి రోజంతా పని చేస్తూనే ఉంటుంది. ఇల్లూడుస్తుంది. అన్నం వండుతుంది. పొయ్యిలోకి కట్టెలేరుకొస్తుంది. పొయ్యిలోకి పిడకలు చేస్తుంది. పందుల్ని కాస్తుంది. కూతుళ్ళ తలల్లో పేలు ఏరుతుంది. ఆమె భగీరథ్‌ను "అబ్బాయ్" అని పిలుస్తుంది. స్నానం చేశావా అబ్బాయ్ అంటుంది. వాళ్ళిద్దరి మధ్య చాల లాంఛనంగా ఉండేది సంబంధం. ఒకవేళ ఈ పిల్లాణ్ణి సరిగా చూడకపోతే, ఆ మంత్రగత్తె చేతబడి చేసి తన కూతుళ్ళను చంపేస్తుందేమో అనుకునేది. అంతేగాక ముసలితనంలో తాను భగీరథ్ మీదనే ఆధారపడాల్సి వస్తుందని కూడ ఆమెకు తెలుసు.

అప్పుడప్పుడు ఆమె గడ్డం చేతులకానించుకుని ఆలోచనలో పడిపోయేది. పెదాల వెనుక నుంచి చిగుళ్ల తోసుకొస్తుండేవి. ఆ క్షణాన తన కూతుళ్ళమీదనే మంత్రగత్తె చేతబడి చేస్తోందో, పట్టిబొమ్మలు తయారుచేస్తోందో అని వణికిపోయేది. అటువంటప్పుడు జాషి మామూలుకన్న అందవికారంగా కనబడేది. తాను అంతకు ముందు పెళ్ళి చేసుకున్న యువతి మంత్రగత్తెగా మారిపోయాక కాళీందర్ కావాలనే ఏరికోరి కురూపిని చేసుకున్నాడు.

కాళీందర్ మొదటి భార్యను చాల ప్రేమించేవాడని అంటారు. బహుశా ఆ ప్రేమ వల్లనేనేమో, ఒక రోజు చండి గురించి ఆయన భగీరథ్‌కు చెప్పేశాడు. వాళ్ళిద్దరూ అప్పుడు రైలుపట్టాల పక్కన నడుస్తున్నారు. కాళీందర్ చంకలో ఒక మాంసం పొట్లం ఉంది. కాళీందర్‌కు చిత్రమైన బలహీనత ఒకటుండేది. తాను పెంచిన పందులను తానెప్పుడూ చంపలేకపోయేవాడు. పందుల్ని పెంచి, తనకు మాంసం అవసరమైనప్పుడు ఆ పందుల్ని ఎవరికైనా అమ్మేసేవాడు. వాళ్ళ దగ్గరి నుంచి కొంచెం మాంసం తీసుకునేవాడు.

"ఇక్కడ ఈ చెట్టుకింద కాసేపు కూచుందామా ?" పదమూడేళ్ళ కొడుకును బతిమిలాడుతున్నట్టుగా అడిగాడు కాళీందర్. ఆ మర్రిచెట్టు కాండానికి వీపు ఆనించి కూచున్నాడు.

"అయ్యా-దొంగలిక్కడ్నించే పోతారు గదూ ?" అని అడిగాడు భగీరథ్.

భగీరథ్ ఈమధ్యే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్నాడు. ఒకసారి వాళ్ల టీచర్ ఓ పత్రికలోంచి పోస్టర్‌ను పిల్లలతో వేయించాడు. దాంట్లో అక్షరాల్ని తానే రాసి, వాటిని పిల్లలతో దిద్దించాడు. ఆ పత్రిక నుంచే భగీరథ్‌కు తెలిసిన సంగతేమంటే 1955 అస్పృశ్యతా చట్టం అనేది వచ్చింతర్వాత భారతదేశంలో ఇక అస్పృశ్యులు లేరట. భారత రాజ్యాంగం అనేది ఒకటుందనీ కూడ వాడికి అక్కడే తెలిసింది. దాంట్లో మొట్టమొదటే భారతీయులందరూ సమానం అని రాసి ఉందట.

ఆ పోస్టర్ ఇంకా గోడమీద వేలాడుతూనే ఉంది. కాని భగీరథ్, వాడిలాంటి వాళ్లు విడిగా కూచోవాలని వాళ్ల తోటివిద్యార్థులు, టీచర్లుకూడ అనేవాళ్లు. "తక్కువ" కులాలలో చాల పేదవాళ్లు, అవసరం ఉన్నవాళ్లు తప్ప మరెవరూ ఆ బడికి వచ్చేవాళ్ళు కాదు. వాళ్ళకిక అదే సరైంది. ఎక్కడపడితే అక్కడ బళ్ళుండేవి.

ఏదేమైనా, భగీరథ్ ఇప్పుడు కొంచెం తేడాగా మాట్లాడుతున్నాడనేది నిజం. వాడి యాస కొంచెం మారింది. వాడు మాట్లాడుతుంటే కాళీందర్‌కు ముచ్చటేసేది. తాను తన కొడుకుకు తగ్గవాణ్ణి కాదేమోననిపించేది కూడ.

భగీరథ్ తండ్రిని దొంగల గురించి అడిగాడు. ఈమధ్య సోనాడంగా, పలాసి, ధుబూలియాలాంటి చోట్లనుంచి రాత్రిపూట వెళ్లే రైళ్లలో దోపిడీలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ దోపిడీ దొంగలు రకరకాల రూపాల్లో, వేషాల్లో వచ్చేవాళ్ళు. పెద్దమనుషుల్లా, పేదవిద్యార్థుల్లా, శరణార్థుల్లా, గృహస్థుల్లా ఏదో ఒకరకంగా వచ్చి కంపార్ట్‌మెంట్లలో చేరేవాళ్ళు. ఆ తర్వాత, ముందే నిర్ణయించుకున్న సమయంలో, స్థలంలో గొలుసు లాగి చీకట్లో రైలు ఆపేసేవాళ్లు. ఇక అప్పుడు చుట్టూ పొలాల్లోంచి వాళ్ల సహచరులు మూకుమ్మడిగా రైల్లోకి దూసుకొచ్చేవాళ్లు. వాళ్ల దోచుకోగలిగినవన్నీ దోచుకునేవాళ్ళు. కొట్టేవాళ్ళు. చంపనైనా చంపేవాళ్లు. పని అయిపోగానే మాయమైపోయేవాళ్ళు. ముఖ్యంగా, ఈ మర్రిచెట్టు, చీకటి పడిందంటే చాలు వాళ్ల సురక్షిత స్థావరంగా ఉండేది.

అందుకే భగీరథ్ దోపిడీ దొంగల గురించి అడిగాడు. కాని కాళీందర్ ఈ

సారి వాడి మాటల్ని పట్టించుకున్నట్టు లేదు. ఆయన చూపులు ఖాళీపొలాల్ని గాలించి వదిలాయి. ఆయన దేనికోసమో వెతుకుతున్నట్టున్నాడు.

"బిడ్డా—నేను కర్కోటకంగా ఉండేవాణ్ణి. దయ అనేది ఉండేది కాదు. కాని మీ అమ్మ సుతిమెత్తనిది, ఎంత మృదువైనదో. ఊరికినే కన్నీళ్ళు పెట్టుకునేది. ఎంత చిత్రం !"

నిజమే, చిత్రమే, డోమ్ కులంలో దేవుడు దిగివచ్చి అన్నీ తలకిందులుగా మార్చేసినట్టున్నాడు. చండి మంత్రగత్తె అయిపోయింది. హృదయంలేని శిశు హంతకి అయిపోయింది. కాళిందర్ నెమ్మదస్తుడయిపోయాడు. ఆయనకిక తప్ప లేదు. ఒకరు అమానుషంగా మారిపోయి, మానవాతీత మాంత్రిక ప్రాంగణం అవతల అదృశ్యమైపోతే, మరొకరు ఇవతలే మిగిలిపోయి, తానొక మనిషిగా మారవలసి వచ్చింది.

తండ్రి తనతో ఏదో మాట్లాడదలుచుకున్నాడని భగీరథ్‌కు అర్థమైపోయింది. వాడికి కాస్త ఆశ్చర్యం వేసింది. తండ్రి ఆ మంత్రగత్తె గురించి ఇంతకు ముందు ఒకేసారి మాట్లాడాడు. మళ్ళీ ఇవాళెందుకు ?

కాళిందర్ గట్టిగా కొడుకు చెయ్యి పట్టుకున్నాడు. "భయం ఎందుకు ? మీ అమ్మ గురించి అందరికీ తెలిసిన సంగతులు నీకు ఎందుకు తెలియగూడదు ?" అన్నాడు.

శవ దహనాల పని చూసే గంగపుత్రుల వంశం వాళ్ళది. ఆ వంశంలో మగ వాళ్ళను గంగ పుత్రులనీ, ఆడవాళ్ళను గంగ దాసీలనీ అనేవాళ్ళు. వాళ్ళు గంగా తీరంలో మృత దేహాలని తగలబెడుతుండేవాళ్ళు. పవిత్ర గంగానదిని పూజించి ఆ గౌరవంతో అన్ని నదులనీ వాళ్ళు గంగా మాత పేరుతోనే పిలిచేవాళ్ళు. కాళిందర్ వెదురు కర్రలు మోసుకొచ్చి శ్మశానంలో కర్రలు కొడుతుండేవాడు. చండి చిన్న పిల్లల్ని ఖననం చేసే శ్మశానంలో కాటికాపరిగా ఉండేది. వాళ్ళిద్దరికీ ఆ పనులు వాళ్ళ తాత తండ్రుల నుంచి సంక్రమించాయి. శ్మశానం ఊరికి ఉత్తరాన ఉండేది. చెరువు ఒడ్డున మర్రి చెట్టు నుంచి శ్మశానం కనబడుతుండేది. ఆ రోజుల్లో చిన్న పిల్లలు ఐదేళ్ళలోపు చచ్చిపోతే, ఆ మృతదేహాన్ని ఖననం చేసేవాళ్ళు. దహనం చేసేవాళ్ళు కారు. చండి తండ్రి శవాలను పూడ్చి పెట్టేందుకు గోతులు తవ్వేవాడు. మాటుగాసిన నక్కలు వచ్చి శవాలను తవ్వుకుపోకుండా సమాధుల మీద ముళ్ళ

కంపలు నాపేవాడు. అహోయ్.... అహోయ్.... అరెరెరె.... చీకట్లో అతని తాగుబోతు గొంతు భయావహంగా ధ్వనించేది.

చండి తండ్రి పూర్తిగా సారా మీద, గంజాయి మీద బతికేవాడు. శనివారాలు చేతిలో ఓ పళ్ళెం పట్టుకుని ఊరంతా తిరిగేవాడు. "మీ బాంచనయ్యా.... గంగ పుత్రుణ్ణవ్వా.... బిచ్చమెయ్యండవ్వా...." అంటూ తిరిగేవాడు.

ఊరివాళ్ళందరికీ అతనంటే భయం ఉండేది. చిన్న పిల్లల్ని అతని కంట పడకుండా కాపాడేవాళ్ళు. మౌనంగా పళ్ళెంలో ఏదో వేసి వెళ్ళిపోయే వాళ్ళు.

ఒక రోజు అతని బదులు ఓ తెల్లని అమ్మాయి వచ్చింది. పాలిపోయిన కళ్ళతో, ఎర్ర జుత్తుతో ఉందా అమ్మాయి. "నా పేరు చండి. గంగపుత్రుడి కూతురుని. మా అయ్య చచ్చిపోయాడు. బిచ్చం నాకెయ్యండి" అని అడిగింది.

"మరి మీ అయ్య చేసిన పని చేస్తావా నువ్వు ?"

"చేస్తాను".

"నీకు భయం వెయ్యదా ?".

"ఉహూఁ"

"భయం" అనే మాటే చండికి కొత్తది. పిల్లలు చచ్చిపోయినప్పుడు తల్లిదండ్రులు ఎందుకు ఏడుస్తారో చండి అర్థం చేసుకోగలిగేది. కాని శవాలను పూడ్చిపెట్టాల్సిందే గదా. శవాల్ని ఇంట్లో పెట్టుకోలేం గదా. తన పనే అది. అంతే. దాంట్లో భయపడాల్సిందో, హృదయం లేకపోవడమో ఏముంది ? ఒకవేళ ఏమయినా ఉన్నా, అది భగవంతుడు కల్పించిందే అయి ఉంటుందిగదా ? దాంట్లో గంగపుత్రులు చేసేదేమీ లేదు గదా ? మరి వాళ్ళను చూస్తే జనం ఎందుకు అసహ్యించుకుంటారు, ఎందుకు భయపడతారు ?

కాళీందర్ పెళ్ళి చేసుకున్నది ఈ చండినే. ఆ రోజుల్లో కూడ కాళీందర్ శవాల గది అధికారితో కలిసి ఎముకల వ్యాపారం చేసేవాడు. శవాల గది నుంచి కొనుక్కుపోయిన ఎముకల్ని ఎరువులుగా వాడుకునేవాళ్ళు. అవి బాగా ధర పలికేవి. కాళీందర్‌కు ధైర్యమూ ఉంది, డబ్బులూ ఉన్నాయి. రాత్రివేళ ఆయన పొలాల కడ్డంబడి ఇంటికి తిరిగొస్తూ కేకలు పెడుతుండేవాడు "నాకు ఎవడన్నా భయం లేదు ! నేను నిప్పులు తింటాను ! నేనెవరికీ భయపడను" అని.

ఒక రాత్రి ఆయన తిరిగి వస్తుంటే మర్రిచెట్టు కింద లాంతరు పట్టుకొని

తిరుగుతున్న చండి కనబడింది. "ఓయ్, నువ్వా! ఈ చీకట్లో భయం వెయ్యడం లేదూ?" అన్నాడు.

"లేదు. నేను కూడ నిప్పులు తినేదాన్నే గదా!" అంటూ చండి పక పకా నవ్వింది. కాళిందర్ ఆశ్చర్యపోయాడు. ఆ వేసవికాలంలోనే ఆయన ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. మరుసటి వేసవిలో భగీరథ్ పుట్టాడు.

ఒక రోజు చండి ఏడుస్తూ, భగీరథ్‌ను చంకన వేసుకుని ఇంటికి తిరిగొచ్చింది. "గంగాపుత్రా, వాళ్ళు నన్ను రాళ్ళతో కొట్టారు. నేను కీడు తలపెడుతున్నానట".

"ఎవరు వాళ్ళు?"

"ఎవరైతే ఏం? నువ్వు వాళ్ళను కొడతావా? కొడతావా?"

"ఎన్ని గుండెలు వాళ్ళకు?"

వాకిలికి కంచె వేస్తున్న కాళిందర్ పని ఆపేసి కోపంతో చిందులు తొక్కాడు. "నా భార్యను రాళ్ళతో కొట్టేంత ధైర్యం ఎవడికుంది? వాడి కెన్ని గుండెలు?" అంటూ తిట్లూ శాపనార్థాలూ మొదలుపెట్టాడు.

చండి కూచుని, భర్తవేపే మౌనంగా చూస్తూండిపోయింది. చిట్టచివరికి "ఇంక ఆ పని చేయడానికి నాకు చేతులు రావడంలేదు. ఇంక పార చేతబట్టడానికి మనసు అంగీకరించడం లేదు. కాని దైవనిర్ణయం అది. నేనేం చెయ్యను?" అంది.

తల విదిలించుకుని, దిగ్భ్రమతో తన చేతుల వేపు చూసుకుంది. తన తండ్రికే ఒక మగ సంతానం ఉండి ఉంటే, ఈ పని వాడే చేసి ఉండేవాడు. కాని తండ్రికి తానొక్కతే సంతానం. వాళ్ళు శ్మశానాలకు చెందిన ప్రాచీన డోమ్ వంశస్థులు. హరిశ్చంద్రుడు బానిసగా మారిపోయాక, శ్మశానంలో చండాలుడిగా మారిపోయాక, ఆయనను పనిలోకి తీసుకున్నది చండి పూర్వీకులే అయి ఉంటారు. రాజు మళ్ళీ రాజ్యం సంపాదించుకున్నాక, చక్రవర్తి అయి సముద్ర పర్యంత భూమండలానికి అధిపతి అయిన తర్వాత, ఆయన విశాల క్షేత్రాలు పంచి పెట్టడం మొదలుపెట్టాడు.

"అయ్యా, మా కేమిస్తున్నావు?"

ఆ ప్రశ్న అడిగినవాడు ప్రాచీన గంగపుత్రుడు. అతడి గొంతు రాజాస్థానంలో బిగ్గరగా ప్రతిధ్వనించింది. అతని లాంటివాళ్ళు ఎప్పుడూ సన్నని గొంతుతో మాట్లాడలేరు. సన్నని గొంతుల్ని వినసూ లేరు. ఎందుకంటే చితిమంటల చిటపటలు ఎల్లవేళలా వాళ్ళ చెవుల్లో గర్జిస్తూనే ఉంటాయి.

"మీకేం కావాలి ?"

"అయ్యా-బ్రాహ్మలకు గోదానమిచ్చావు. సన్యాసులకు అన్నదానం చేశావు. మరి మాకేమి ఇవ్వబోతున్నావు ?"

"ప్రపంచంలోని దహన వాటికలన్నీ మీవే"

"మళ్ళీ చెప్పయ్య"

"ప్రపంచంలోని దహన వాటికలన్నీ మీవే"

"ఒట్టు పెట్టుకో".

"దైవ సాక్షిగా చెపుతున్నాను".

ప్రాచీన గంగపుత్రుడు చేతులెత్తి అటవికానందంతో నృత్యం చేశాడు. "హా! దహన వాటికలన్నీ మావే.... అన్ని దహన వాటికలూ మావే. ప్రపంచంలోని శ్మశానాలన్నీ మావే!" అని గొంతెత్తి అరిచాడు.

ఆ జాతికి చెందిన మనిషిగా చండి ఆ సాంప్రదాయిక వృత్తిని వదిలేస్తుందా? అంత ధైర్యం చేస్తే, దేవుడు ఆమె మీద తన ఆగ్రహం చూపడా ?

ఐనా ఆమె భయం రోజు రోజుకూ ఇనుమడించింది. బొంద తవ్వగానే ముఖం పక్కకు తిప్పుకునేది. సమాధి మీద బాగా ముళ్ళకంపలు నాటిన తర్వాత కూడ ఆమెలో భయం, కంగారు మిగిలి ఉండేవి. ఎప్పుడైనా, ఎప్పుడైనా కథల్లో చెప్పే నిప్పులు కక్కే నక్క సమాధిలోకి జొరబడుతుందని, పెద్ద పెద్ద అడుగులతో మృతదేహాన్ని తవ్వి తీస్తుందనీ ఆమెకు అనిపించేది.

దేవుడా ....దేవుడా.... దేవుడా.... చండి మూగగా రోదిస్తూ ఇంటికి తిరిగొచ్చేది. దీపం ముట్టించి, భగీరథ్ మేలు కోసం భగవంతుణ్ణి ప్రార్థిస్తూ కూచునేది. ఆ సమయాలలో ఆమె ఊళ్ళోని ప్రతి శిశువు కోసమూ ప్రార్థించేది. ప్రతి శిశువూ చిరంజీవి కావాలని కోరుకునేది. కొత్తగా ఆమెలో పెరుగుతూ వచ్చిన బల హీనత ఇది.

ఇప్పుడు తనకూ ఒక చిన్నారి శిశువు ఉన్నాడు గనుక, ఆమె హృదయంలో ప్రతి మృత శిశువు కోసమూ గాఢమైన వేదన కలిగింది. ఇప్పుడు ఆమె శ్మశానంలో ఎక్కువసేపు ఉండిపోతే రొమ్ముల నిండా పాలు నిండేవి. బొందలు తవ్వుతూ మౌనంగా తండ్రిని తప్పుపడుతూ ఉండేది. తండ్రికి తననీ పనిలోకి తీసుకు రావలసిన అవసరమేమొచ్చింది !

చివరికొక రోజు ఆమె "అయ్యా, పెద్దలూ. ఈ పని చేయడానికి ఇంకెవరి నన్నా పెట్టుకోండి. ఈ పని ఇంక నాకు చాతకావట్లేదు...." అని మొరపెట్టుకుంది కూడ.

కాని ఊళ్ళో ఆమె మాట ఎవరూ విన్నట్టు కనిపించలేదు. కాళీందర్ కూడ ఆమె మాట వినలేదు. అందరూ అసహ్యించుకునే శవాలతో, చర్మంతో, ఎముకలతో పని చేసి చేసి కాళీందర్ రాటుదేలిపోయాడు. 'అబద్ధపు నీడలను చూసి భయపడుతున్నావ్ !' అని వేళాకోళం చేశాడు.

ఆమె మరీ ఎక్కువగా ఏడిస్తే "సరే, మరి నీకోసం ఈ పని చేసిపెట్టడానికి మీ కుటుంబంలో ఇంకెవరూ లేరుగా" అనేవాడు.

దాదాపు ఆ సమయంలోనే భయానకమైన సంగతి జరిగిపోయింది. కాళీందర్ చెల్లెలు ఒకామె చుట్టపు చూపుగా వచ్చింది. ఆమె చిన్నారి కూతురు చండికి బాగా మాలిమి అయింది. ఆ రోజుల్లో ఊళ్ళో అందరికీ మశూచికం వస్తూ ఉండింది. చండిగాని, ఊళ్ళో మరెవరు గాని ఎప్పుడూ మశూచి టీకాలు వేయించుకోలేదు. ఇటువంటి పెద్ద రోగాల తల్లి శీతలమ్మకు ముడుపులు చెల్లించడ మొక్కటే మార్గమని వాళ్ళు అనుకునేవాళ్ళు. చిన్నపిల్లను ఎత్తుకుని, ఆడబిడ్డతో కలిసి చండి దేవతకు మొక్కు చెల్లించడానికి వెళ్ళింది. రైలు పట్టాలమీద పని చెయ్యడానికి బీహార్ నుంచి వచ్చిన కూలీలు ఆ దేవత గుడి కట్టి పెట్టారు. అక్కడ ఒక పూజారి కూడ ఉన్నాడు.

విధివశాత్తూ, కొన్నాళ్ళ తర్వాత ఆ చంటి పిల్ల చచ్చిపోయింది. చచ్చిపోయింది చండి ఇంట్లో కాదనుకోండి. అయినా పిల్ల తల్లిదండ్రులతో సహా ప్రతి ఒక్కరూ ఆ చావుకు చండినే తప్పుపట్టారు.

"ఏమిటీ, కారణం నేనా ?"

"ఔను. నువ్వే. నువ్వే".

"దేవుని మీద ప్రమాణం. నేను కారణం కాదు" అని ఆమె డోమ్‌లతో మొరపెట్టుకుంది.

"మరి ఇంకెవరు ?"

"నేను చచ్చినా అటువంటి పని చెయ్యను. నా వల్ల ఎవరికీ ఏ ఆపదా రాలేదు. నేను ఎవరికి వారసురాలినో తెలుసా ?"

అకస్మాత్తుగా వాళ్ళందరూ, ఆ పట్టుదల మీద ఉన్న జనం, మూఢనమ్మకాలున్న జనం తలలు వంచుకున్నారు. నేలచూపులు చూశారు. ఎవరో ఒకరు గుసగుసగా "మరి నువు తుకామ్ సమాధి మీద మట్టి నింపుతున్నప్పుడు నీ రొమ్ముల్లోంచి పాలెందుకు కురిశాయి ?" అని అడిగారు.

ఆమె నివ్వెరపోయింది. ఆవేశపడింది. వాళ్ళవేపు తేరిపార జూసి "ఎంత మూర్ఖులు మీరు !" అంది. ఒక క్షణం ఆగి "సరే, నా తాతముత్తాతలు నా మీద ఆగ్రహం ప్రకటించినా సరే. ఈ రోజు నుంచి నేనీ పని మానేస్తున్నాను" అంది.

"పని మానేస్తావా ?"

"ఔను. ఇక పిరికిపందలు మీరే వల్లకాటికి కాపలా కాయండి. నేనీ పని వదిలేద్దామని ఎన్నాళ్ళ నుంచో అనుకుంటున్నాను. మా గంగపుత్రకు తొందర్లోనే సర్కారు నౌకరీ దొరుకుతుంది. ఈ అసహ్యకరమైన పనిలో ఇంక నేను ఉండనక్కరలేదు".

అందర్నీ అవాక్కు చేసి, ఆమె ఇంటికి తిరిగొచ్చింది. కొత్తగా పనిలో చేరే దగ్గర ఇల్లు దొరుకుతుందా అని కాళిందర్‌ను అడిగింది. "మనం అక్కడికి వెళ్ళిపోదాం. వాళ్ళు నన్ను ఏమన్నారో తెలుసా ?"

ఆమెను కుదుట పరచడం కోసం, ఒక హాస్యమాడి ఆమెను చల్లబరచడం కోసం మాత్రమే కాళిందర్ బిగ్గరగా నవ్వుతూ "వాళ్ళు నిన్నేమన్నారు ? మంత్రగత్తెవన్నారా ?" అన్నాడు.

ఆ మాటతో చండి విపరీతంగా వణికిపోయింది. ఇంటికప్పుకు రక్షణగా ఉన్న కలప గుంజను గట్టిగా పట్టుకుంది. ఉద్రేకం, కోపం, దుఃఖం ఆమెలో ముప్పిరి గొన్నాయి. "ఆ మాట ఎట్లా అనగలిగావు ? నువ్వు, స్వయంగా ఒక కొడుక్కు తండ్రివి ? నేను మంత్రగత్తెనా ? నేను మృత శిశువులకు పాలు కుడుపుతానా ? అంటే వాళ్ళనే కాపాడుతాను గాని, నా కొడుకును చూసుకోనా ? నేనా, మంత్రగత్తెనా ?" అని కేకలు పెట్టింది.

"అబ్బ - నోర్ముయ్యవే"

అని అరిచాడు కాళిందర్. ఎందుకంటే అప్పటికే చీకటిపడింది. భూత ప్రేతాలు మనుషులమీద ప్రభావం వేసే సమయం అది. ఖాళీ కడుపుతో, వేడెక్కిన తలతో ఉండే ఆ సమయంలో భయంకరమైన కోపాలూ, అసూయలూ వ్యాపిస్తాయి. తన కులం వాళ్ళెట్లా ప్రవర్తిస్తారో కాళిందర్‌కు బాగా తెలుసు.

"నేను మంత్రగత్తెను కాను, ఓ, నేను మంత్రగత్తెను కాను ! !"

గ్రామంలో ప్రతి మూలా వ్యాపించిన వేడిగాలిలో మూలకాకి రెక్కలమీదుగా చండి విషాద భరితమైన ఆవేదన నలుదిశలూ వ్యాపించింది.

ఎంత హఠాత్తుగా ఏడవడం ప్రారంభించిందో అంత హఠాత్తుగానే మానేసింది. "ఇంకా చీకటి ఉండగానే ఎటయినా పారిపోదాం" అని భర్తను బతిమిలాడింది.

"ఎక్కడికి పోదాం ?"

"ఎక్కడికయినా సరే"

"అంటే ఎక్కడికి ?"

"నాకు తెలీదు".

భగీరథ్‌ను చేతుల్లోకి తీసుకుని, కాళీందర్ దగ్గరికి పాకింది. "కాళీందర్, దగ్గరికి రా" అంది. "నీ ఛాతీమీద నా తల పెట్టి పడుకుంటాను. నాకు బాగా భయం వేస్తోంది. నా తాత తండ్రుల వృత్తి వదిలేసేంతగా భయపడ్డానివాళ. ఎందుకింత భయపడ్డానో ? నాకు ఏమనిపిస్తోందంటే, నేనింక నిన్ను చూడలేనేమో, భగీరథ్‌ను చూడలేనేమో. అయ్యో భగవంతుడా ! ఎంత భయపడ్డాను !"

అక్కడిదాకా చెప్పి కాళీందర్ చెప్పడం ఆపేశాడు. కళ్ళు తుడుచుకున్నాడు. "బిడ్డా-ఇప్పుడు వెనక్కి తిరిగిచూస్తే ఏమనిపిస్తున్నదో తెలుసునా ? ఆ రోజు దాని నోట్లోంచి ఆ మాటలు భగవంతుడే పలికించాడేమో" .

"తర్వాతేమయింది ?"

తర్వాత కొన్నిరోజుల పాటు చండి నిరాశలో ఉన్నట్టుగా అట్లా కూచుండి పోయేది. ఇంటి పనులు ఏ కాసేపో చేసి, చాలసేపు భగీరథ్‌ను చంకలో వేసుకుని పాడుతూ గడిపేది. ఇంటినిండా ఎప్పుడూ ధూపం వేసి ఉంచేది. దీపాలు వెలిగించేది. ఏదో శబ్దం కోసం వింటున్నట్టుగా జాగ్రత్తగా ప్రవర్తించేది.

ఏ సంఘటనా జరగకుండానే రెండు నెలలు గడిచిపోయాయి. చండిని పని చేయమని పిలవడానికి ఎవరూ రాలేదు. పని కూడా అంతగా ఏమీ లేకపోయింది. వాళ్ళిద్దరూ ప్రశాంతంగా కాలం గడిపారు. చండి మళ్ళీ మామూలు మనిషి అయిపోయింది.

"చచ్చిపోయిన పిల్లల కోసం ఇంకేదన్నా ఏర్పాటు ఉండాలి. ఇప్పుడున్న పద్ధతి ఏమీ బాగులేదు" అంది ఒకరోజు.

"మెల్ల మెల్లగా తయారవుతుంది. ఇప్పుడిప్పుడే ఆలోచిస్తున్నారు గదా".

అప్పుడామె హఠాత్తుగా "నేను చేసింది సరైన పనేనంటావా ? ఎందుకంటే రాత్రిళ్ళు మా నాయన కేకలు వేస్తున్నట్టుగా వినిపిస్తోంది నాకు".

"నీకు వినబడుతోందా ?"

"ఆయన 'అహోయ్....అహోయ్ అరెరెరె !' అంటున్నట్టుగా వినబడుతున్నట్టుంది నాకు. శ్మశానంలోంచి నక్కల్ని తరిమేస్తున్నట్టుగా అరుస్తున్నాడాయన."

"బాలిక చండీ !" ఈ మాటలు వినేసరికి కాళీందర్‌లో భయం పెరిగింది. చండి మెల్లమెల్లగా మంత్రగత్తె అయిపోతున్నదేమోనని తానే కొన్నిసార్లు భయపడలేదూ ? రాత్రుళ్ళు ఆమె హఠాత్తుగా ఉలిక్కిపడి లేచి సమాధులలో ఏడుస్తున్న మృతశిశువుల రోదన వింటున్నట్టు కనిపించలేదూ ? బహుశా జనం అనే మాట నిజమేనేమో ? బహుశా పట్నానికి వెళ్ళిపోవడమే మంచిదేమో.

ఐతే డోమ్ కులస్తులెవరూ ఆమెను మరిచిపోలేదు. ఆమెకు ఏమాత్రం తెలియకుండా వాళ్ళు ఆమెమీద ఓ కన్నేసి ఉంచారు. లోకం తలచుకుంటే, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తన నిఘాను కొనసాగిస్తూనే ఉంటుంది. లోకం చెయ్యజాలని పనేదీ లేదు.

అట్లా ఒక తుపాను రాత్రి, కాళీందర్ తాగిన మత్తులో మునిగిపోయి ఉన్నప్పుడు, ఆయన ఇంటి వాకిటి నిండా జనం నిండారు. వాళ్ళలో ఒకరు, చండికి వరుసకు మామ అయ్యే కేతన్, కాళీందర్‌ను లేపాడు. "లే లే, చూద్దురా. స్వయంగా నువ్వే చూడు నీ భార్య మంత్రగత్తె అవునో కాదో."

ఉలిక్కిపడి కాళీందర్ లేచి కూచున్నాడు. నిద్రతో వాలిపోతున్న బరువైన కళ్ళతో వాళ్ళవేపు చూశాడు.

"బైటికి వచ్చి చూడ్రా నా కొడకా. ఓ మంత్రగత్తెను నీ పెళ్ళామని చెప్పుకుంటున్నావా ? మా పిల్లలందరి ఉసురు పోసుకోదలచుకున్నావా ?"

కాళీందర్ చూడడానికి బైటికి వచ్చాడు. మర్రిచెట్టు కింద శ్మశానం నిండా దీపాలు, కాగడాలు, మౌనంగా తిరుగాడుతున్న మనుషులు కనబడ్డారు.

"చండీ, నువ్వేనా ?"

ఆవేదనతో కాళీందర్ వేసిన కేక కత్తితో కోసినట్టుగా మధ్య గాలిలో విరిగిపోయింది. ప్రతి ఒక్కరూ నిశ్శబ్దంగా చూశారు.

"చండీ !"

ఆమె ఒక చేతిలో కొడవలితో, పక్కన భగభగ మండుతున్న లాంతరుతో, మరో పక్కన ముళ్ల కొమ్మలతో ఉంది.

"నేలలో బొరియలు మూయడానికి ప్రయత్నిస్తున్నాను."

"ఎందుకు, నువ్వెందుకు బైటికొచ్చావసలు ?"

"హఠాత్తుగా నక్కల ఊళలు ఆగిపోయాయి. అదిగో, వచ్చేశాయ్ అని నాలో ఎవరో చెప్పినట్టనిపించింది. బొరియల ముందు నిలబడి శవాల కోసం తవ్వుతున్నాయనిపించింది."

"నువ్వు మంత్రగత్తెవు" అని గ్రామస్తులు భయంతో అరిచారు.

"మరి శవాల కాపలా కాసేందుకు ఎవరూ లేరుగా."

"నువు మంత్రగత్తెవు !"

"ఇది నా తాత తండ్రుల నాటినుంచీ వస్తున్న పని. వీళ్లందరికీ ఈ పని గురించేం తెలుసు ?"

"నువు మంత్రగత్తెవు !"

"కాదు, కాదు. నేను మంత్రగత్తెను కాను. నాకూ ఓ చిన్నారి బిడ్డ ఉన్నాడు. వాడికోసం నాకు పాలచేపులొస్తుంటాయి. నేను మంత్రగత్తెను కాదు. గంగపుత్రా, నువు చెప్పు. నీకు తెలుసు గదా."

కాళీందర్ మాయ కమ్మినట్టు తేరిపార జూశాడు. మసక వెల్తురులో ఆ ఆకారం వేపు చూశాడు. వానకు తడిసిన బట్టల్లోంచి పొడుచుకొచ్చిన రొమ్ములవేపు చూశాడు. ఆయన మనసు బాధతో వణికిపోయింది. ఆయన లోలోపల ఎవరో గుసగుసలాడారు. "కాళీందర్ దగ్గరికి వెళ్లకు. కావాలంటే పాము దగ్గరికి వెళ్ళు. మంట దగ్గరికి వెళ్ళు. కాని ఇప్పుడుమాత్రం ఆమె దగ్గరికి మాత్రం వద్దు. కావాలంటే ఆమెను ప్రేమించొచ్చు. కాని వెళ్ళొద్దు. వెళ్ళావంటే పెద్ద ఆపద చుట్టుకున్నట్టే."

కాళీందర్ అడుగు ముందుకేసాడు. ఎర్రబడ్డ కళ్లతో చండి వేపు చూశాడు. పశువులాగ కేక వేశాడు. "ఓహూ ! నువు మంత్రగత్తెవే ! శ్మశానంలో ఎవరికి పాలు కుడుపుతున్నావ్ ? ఓహూ....!"

"గంగపుత్రా ! అయ్యో దేవుడా !"

ఆమెలోంచి వెలికి వచ్చిన ఆ దారుణమైన కేక భూగర్భంలోని మృతదేహాలను కూడ భయపెడుతుందనిపించింది. శాంతిలేని ఆమె తండ్రి ఆత్మనూ, ఆమె

జాతి మూలపురుషుడయిన ప్రాచీన డోమ్‌ను కూడ భయపెడుతుందనిపించింది. బహుశా ఒక సజీవ ప్రాణిని మానవలోకం నుంచి వెలివేసి, మానవాతీత ప్రపంచం లోకి తోసేసినప్పుడు ఆ మనసు భూమినీ, ఆకాశాన్ని ఇట్లాగే వణికిస్తుందేమో.

కాళిందర్ తన మామ డప్పు తీసుకురావడానికి ఇంటికి పరుగెత్తి, అది తీసు కుని శ్మశానానికి పరుగెత్తుకొచ్చాడు. ఆ డప్పు వాయిస్తూ "నేను, కాళిందర్ గంగ పుత్రను, నా పెళ్ళాం మంత్రగత్తె అని అందరికీ తెలియజేస్తున్నానొహోయ్, మంత్ర గత్తె!" అని అరిచాడు.

"ఆ తర్వాత !" అడిగాడు భగీరథ్.

"అప్పుడేమయిందంటే, బిడ్డా. మీ అమ్మను బెల్‌తాలలో ఏకాకిగా ఉండమని బలవంత పెట్టాం. ఒకప్పుడు ఒక్కతీ ఉండడానికి ఎంతగానో భయపడేది, ఇప్పుడు మొత్తంగా ఒక్కతే ఉండాల్సి వస్తోంది. ఆగాగు. ఎట్లా పాడుతుందో విను".

దూరం నుంచి ఒక వింత సంగీత స్వరం గాలిలో తేలియాడుతూ వాళ్ళదాకా వచ్చింది. ఆ స్వరానికి రేకు పళ్ళెం మీద దరువు శ్రుతి కలుపుతోంది. ఆ పాటలో మొదట ఏ మాటలూ లేనట్టనిపించింది గాని జాగ్రత్తగా వింటే మాటలన్నీ అర్థ మయ్యాయి.

"బజ్జో నా చిట్టి తండ్రీ బజ్జో బజ్జో బజ్జో....
పడుకోరా బంగారు కన్నా పడుకో....పడుకో....!"

భగీరథ్‌కు ఆ పాట తెలుసు. సవతి తల్లి కూతుళ్ళను పడుకోబెట్టడానికి పాడు తుండేది.

"బిడ్డా, ఇంటికెళ్దాం పద...."

గందరగోళంలో పడిపోయిన భగీరథ్‌ను కాళిందర్ ఇంటికి తీసుకుపోయాడు. ఆ పాట తన మనసులో ప్రవేశించిందనీ, తన రక్తంలో కలిసిపోయిందనీ, చెప్ప రాని బాధలా తన చెవుల్లో ప్రతిధ్వనిస్తోందనీ భగీరథ్‌కు అర్థమైంది.

కొన్నాళ్ళ తర్వాత ఓ రోజు మధ్యాహ్నం భగీరథ్ ఆ చెరువు దగ్గరికి నడి చాడు. ఆ రేకు డబ్బా చప్పుడు వినబడగానే పరుగెత్తుకొచ్చాడంతే.

నీళ్ళలో మంత్రగత్తె నీడ వణికిపోయింది. ఆమె వాడివేపు చూడలేదు. కళ్ళు నేలకు వాల్చి, కుండ నింపుకుంటోంది.

"నీకు కట్టుకోవడానికి వేరే చీర లేదా ?"

మంత్రగత్తె మౌనంగా ఉండిపోయింది. ముఖం మరోవైపు తిప్పుకుంది.

"మంచి బట్టలు కట్టుకోవడమంటే ఇష్టమేనా నీకు ?"

"గంగపుత్తుడి కొడుకా — ఇంటికి వెళ్ళడం మంచిది".

"నేను.... నేను ఇప్పుడు బడికి పోతున్నాను. నేను మంచి పిల్లాణ్ణి గదా".

"నాతో మాట్లాడకు. నేను మంత్రగత్తెను".

"నేను నీడతోనే మాట్లాడుతున్నాను".

"నా నీడ కూడ కీడు చేస్తుంది. గంగపుత్తుడి కొడుక్కి ఆ సంగతి తెలియదా?"

"నాకేం భయం లేదు".

"ఇది మిట్టమధ్యాహ్నం. చిన్న పిల్లాళ్ళు ఇంత ఎండలో బైట తిరగగూడదు. ఇంక ఇంటికి వెళ్ళిపోవాలి".

"నీకు ఒక్కదానివే ఉంటే భయం వెయ్యట్లేదా ?"

"భయమా ? ఏమీలేదు. నాకు ఏమన్నా భయం లేదు.... మంత్రగత్తెకు ఒంటరిగా ఉండడానికి భయం ఏమిటి ?"

"మరి ఎందుకు ఏడుస్తావ్?"

"నేనా, ఏడుస్తానా?"

"నేను విన్నాను".

"ఈ పిల్లాడు విన్నాడట? నేను ఏడుస్తుంటే?"

ఆమె ఎర్రని నీడ నీళ్ళలో అటూ ఇటూ కదిలింది. ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి. కన్నీళ్ళు తుడుచుకుని "గంగపుత్తుడి కొడుకు ఇంక ఇంటికి వెళ్ళిపోవాలి. మళ్ళీ ఎప్పుడూ, ఎప్పుడూ మంత్రగత్తె దగ్గరికి రానని ప్రమాణం చెయ్యాలి. లేదంటే.... లేదంటే.... నేను గంగపుత్తకు చెపుతాను".

ఆమె వెనక్కి తిరిగి, బురద కాల్వ పక్కనుంచి వెళ్ళిపోతుంటే, ఆమె వెంట్రుకలు ముఖం మీద ఉంగరాలు తిరుగుతుంటే, ఆమె ఎర్ర చీర కొంగు గాలిలో ఎగురుతుంటే భగీరథ్ చూస్తుండిపోయాడు. అట్లా చెరువు పక్క ఒంటరిగా చాల

పేపు కూచుండిపోయాడు. నీళ్ళు మళ్ళీ నిశ్చలంగా మారిపోయే దాకా అట్లా కూచునే ఉన్నాడు. కాని మళ్ళీ వాడికి ఆ పాట వినబడలేదు.

మరోవేపు మంత్రగత్తె తన గుడిసెలో నిశ్శబ్దంగా కూచుని ఏమేమి ఆలోచించిందో ఆమెకే తెలియదు. చాలసేపటి తర్వాత బలవంతాన లేచి ఓ పగిలిన అద్దం ముక్క చేతుల్లోకి తీసుకుంది.

"నేను నా నీడగా మిగిలిపోయాను!" అని తనలో తానే గొణుక్కుంది. దువ్వెన తీసుకుని దువ్వుకోవడానికి ప్రయత్నించింది. వెంట్రుకలు ఎంత చిక్కబడ్డాయంటే దువ్వెన నడవలేదు.

"నా కొడుకు మంచి బట్టల గురించి ఎందుకు మాట్లాడాడు? వాడికి గుర్తుండి ఉంటుందా? అప్పటికింకా పసిపాప గదా. నాకు మంచి, అందమైన బట్టలుంటే వాడికేం?" తన ఆలోచనలు స్థిరం చేసుకోవడానికి ఆమె చాల కష్టపడాల్సి వచ్చింది. మామూలుగా ఆలోచించే అలవాటు తప్పిపోయి చాల కాలమయింది గదా. ఇప్పుడిక మిగిలిందల్లా ఆకుల గలగల, గాలి ఈలలు, రైళ్ళ శబ్దాలు—అంతే ఈ శబ్దాలు ఆమె ఆలోచనలన్నిటినీ ?లగా పులగం చేసేశాయి.

ఏదో ఒక రకంగా ఇవాళ మాత్రం ఆమెకు ఒక స్పష్టమైన ఆలోచన వచ్చింది : పిల్లాడికేదో పెద్ద ప్రమాదం ముందుకు రాబోతోంది. కాశీందర్ తెలివి తక్కువతనం మీద సరిగ్గా భార్యలాగే కోపమొచ్చిందామెకు హఠాత్తుగా. ఇప్పుడు పిల్లాణ్ని సరిగ్గా చూసే బాధ్యత ఎవరిది? మంత్రగత్తె బారినుంచి వాణ్ని కాపాడవలసిన వాళ్ళెవరు?

ఆమె లేచింది. లాంతరు వెలిగించింది. బైటికి నడిచింది. రైలు పట్టాల వెంట గబగబా నడిచింది. కాస్తదూరం పోతే లెవెల్ క్రాసింగ్ ఉంది. లైన్‌మాన్ కాబిన్ ఉంది. పని నుంచి తిరిగొస్తూ కాశీందర్ ఇక్కడే మలుపు తిరిగి బురదకాల్వ వైపు నడుస్తాడు. అటు వైపు నడుస్తుండగా ఆమెకు వాళ్ళు కనబడ్డారు. అక్కడ వాళ్ళెవరో పట్టాలమీద ఏమో చేస్తున్నారు.

అరెరె, వాళ్ళు పట్టాలమీద వెదురు బొంగులు పేరుస్తున్నారు. ఈ సాయంత్రం ఫైవ్ అప్ లాల్‌గోలా పాసింజర్ వస్తుంది. బుధవారం టపా సంచీ తీసుకొస్తుంది.

దాంట్లో చాల డబ్బుంటుంది. అది లూటీ చేయడానికి వాళ్ళు చాల రోజులుగా ఎదురు చూస్తున్నారు.

"ఎవరు మీరు ?"

ఆమె లాంతరు ఎత్తి తన ముఖం పక్కకు తెచ్చింది. వాళ్ళు తలెత్తి చూశారు. ఉలిక్కిపడ్డారు. భయంతో వాళ్ళ కళ్ళు విప్పారాయి, ముఖాలు పాలిపోయాయి. తన కులం వాళ్ళు అంత భయపడి ఉండగా ఆమె ఎప్పుడూ చూడలేదు. "అయ్యో, మంత్రగత్తెరో!"

"అయితే మీరు వెదురు బొంగులు పేరుస్తున్నారా ? ఆ రైలు దోపిడీ చేస్తారా, అంతేనా ? నేనంటే భయపడి పరుగెత్తుతున్నారా ? ఈ కుప్ప ఇక్కడ్నించి తీసేయండి మొదలు. లేదా మీ పని పడతాను".

వాళ్ళేం చేశారో దాన్ని మార్చలేకపోయారు. పట్టాలు ఖాళీ చేసి, ప్రమాదాన్ని తప్పించలేకపోయారు. సమాజం ఇట్లాగే ఉంటుంది. సమాజం ఇట్లాగే పని చేస్తుంది. ఒక రోజు వాళ్ళే బోలెడంత అర్భాటంగా డప్పులు వాయించి ఆమెను మంత్రగత్తెగా మార్చారు. వాన మొదలయింది. ఆమె లాంతరు చేతుల్లోకి తీసుకుంది. ఆమె నిస్సహాయ. ఏం చేయగలుగుతుంది ? తానే గనుక మంత్రగత్తె అయితే, మానవాతీత శక్తులుంటే, తన సేవకులు, చీకటి దయ్యాలు తన మాట ఎందుకు వినవు ? రైలును ఎందుకు ఆపెయ్యవు ? మరి ఇప్పుడు నిస్సహాయంగా ఏం చెయ్యగలుగుతుంది ?

ఆమె రైలు వచ్చే వైపు పట్టాలమీద పరుగెత్తడం మొదలెట్టింది. చేతు లూపుతూ దాన్ని ఆపాలని విఫల ప్రయత్నం మొదలెట్టింది. "ఇంకా ముందుకు రాకు. రాకు. అక్కడ పెద్ద బొంగుల కుప్ప ఉంది".

రైలు పరుగెత్తుకొచ్చే పసిపాపలా దూసుకొచ్చింది. ఆమెను గుద్దేసింది.

చండి పేరు చుట్టుపక్కలంతా మార్మోగిపోయింది. పెద్ద రైలు ప్రమాదాన్ని తప్పించిన ఆమె వీరోచితత్యాగాన్ని అందరూ మెచ్చుకున్నారు. చివరికి ప్రభుత్వం కూడ ఆ విషయం ఒప్పుకుంది.

ఆమె శవాన్ని శవాల గది నుంచి తీసుకొచ్చేటప్పుడు ఒ.సి., బిడిఓ కాళీందర్ ఇంటికి తరలివచ్చారు.

"కాళీందర్, రైల్వే వాళ్ళు చండి గంగదాసికి ఒక పతకం ఇస్తారు. నాకు నీ గురించి అంతా తెలుసు. ఆమె ఒక్కతే ఉండేదని తెలుసు. కాని ఆమె తరఫున ఆ పతకం తీసుకునే వాళ్ళెవరయినా ఉండాలి. కనుకనే నేను బిడిఓను తీసుకొచ్చాను" అన్నాడు ఓ.సి.

"అది చాల సాహస కృత్యం. నిజంగా గొప్పపని. ప్రతి ఒక్కరూ మెచ్చుకుంటున్నారు. ఆమె నీ భార్యేనా ?"

అందరూ మౌనంగా ఉండిపోయారు. జనం ఒకరి వేపు ఒకరు చూసుకున్నారు. సిగ్గుతో మెడలు గోక్కున్నారు. నేల చూపులు చూశారు. ఎవరో గుసగుసగా "ఔను సార్, ఆమె మా మనిషే" అన్నారు.

ఈ మాటతో భగీరథ్‌కు ఎంత ఆశ్చర్యం వేసిందంటే వాడు ఒక్కొక్కరి ముఖంలోకీ చూశాడు. ఐతే ఆమెను వాళ్ళిప్పటికి గుర్తిస్తున్నారన్నమాట.

"సరే, ప్రభుత్వం ఆ పతకాన్ని మీ అందరికీ ఒక్కసారే ఇవ్వలేదు గదా"

"నాకివ్వండి సార్"

భగీరథ్ ముందుకొచ్చాడు.

"నువ్వెవరు ?"

"ఆమె మా అమ్మ"

"ఔనా? నీ పేరేంటి ? నువు ఏం చేస్తుంటావు ?"

బిడిఓ రాసుకోవడం మొదలుపెట్టాడు. గొంతు సవరించుకుంటుంటే భగీరథ్ చెంపల మీద కన్నీళ్ళు కాల్వ కట్టాయి. "సార్. నా పేరు భగీరథ్ గంగపుత్ర. మా నాయన పేరు కాళీందర్. ఊరు డోమ్‌పారా. చచ్చిపోయిన చండి గంగదాసి మా అమ్మ....చచ్చిపోయిన చండి గంగదాసి....మా అమ్మ సార్, మంత్రగత్తె కాదు సార్.....ఎప్పుడూ మంత్రగత్తె కాదు సార్ ....ఎప్పుడూ కాదు సార్...."

బిడిఓ రాసుకోవడం ఆపేసి భగీరథ్ వైపే చూశాడు. తర్వాత గుంపు వైపు చూశాడు. తప్పు చేసినవాళ్ళలా, పశ్చాత్తాపంతో డోమ్‌లు మౌనంగా తలలు వంచి నిలబడ్డారు. ఒక దుర్భర, దుస్సహ నిశ్శబ్దం వ్యాపించింది.

నవల – సీరియల్ :

రాగో
సాధన

(గత సంచిక తరువాయి)

13

ఆకాశంలో చుక్కలు వెలిగాయి. మబ్బులు తేలిపోయి గాలి కూడా పొడిగా వస్తుంది. ఇక వర్షం తేలిపోయినట్టే.

నక్షత్రాల మసక వెలుతురు చెట్ల ఆకులను దాటి కిందికి దిగడంలేదు. అల వాటయిన వారికి తప్ప అడవిలో ఆ చీకట్లో దారి కనిపించడమే కష్టం. మిణుగురు పురుగుల మెరుపులు ఉండి ఉండి జిగేలుమని కళ్ళు చెదరగొడుతున్నాయి. ఆ చీకటికి జీమ్, జీమ్ అనే నిశ్శబ్దానికి భయాన్ని జోడిస్తున్నట్లు చిమ్మెట్లు రొద చేస్తున్నాయ్. సగం కాలిన మోడులు చీకట్లో ఎవరో నిలబడినట్లు గతుక్కుమనిపిస్తాయి.

'తాండవాయి' చేరాలంటే కనీసం ఇంకో రెండు గంటలు నడవాలి. బయల్దేరిన మొదటి రోజునే ఇలాంటి ప్రయాణం చేయించాల్సి వచ్చినందుకు గిరిజ మనసు పీకుతుంది. పైలట్‌గా నడుస్తున్న జైనికి ఈ దారి క్షుణ్ణంగానే తెలుసుననీ, తొణుకు బెణుకు లేకుండా, ఆమె నిబ్బరంగానే తీసుక పోగలదనీ తనకు నమ్మకం ఉన్నప్పటికీ ఈ అర్ధరాత్రి నడకతో ఈ కొత్తక్కలు ఏమి ఇబ్బంది పడతారో, ఇది క్యాంపెయిన్‌కు ఏమి ఇబ్బంది కలిగిస్తుందో అని గిరిజ మనసు కొట్టుకోసాగింది.

పిల్లణ్ని చంకల వేసుకొని నడుస్తున్న పిల్లీబాయి ఏమనుకుంటుందో. బ్యాక్ పైలట్ మిన్కో నిబ్బరంగా వస్తా ఉందా ! ఇంతకీ జైనికి ఇవేమీ పట్టడం లేదా ? అంటూ తనలో తాను తర్కించుకుంటూ గిరిజ ఒర్రెలో నుంచి గట్టెక్కింది

అదే సమయానికి జైని "అక్కా ! రాత్రికి ఇక్కడ పడుకొని ఉదయాన్నే పోతే ఏడు గంటలకల్లా చేరగలుగుతాం. ఈ పక్కనే జాగ బాగుంటుంది. ఏం చేద్దాం !" అంటూ అడిగింది.

"ఇంగో" (అవును) అంటూ గిరిజ ఒప్పుకోవడంతో అక్కల దళం పక్కకు నడిచింది.

బట్టకడిమి చెట్టు క్రింద దళం అక్కలు కిట్లు దింపుకోగా సంగం అక్కలు జబ్బ సంచులతో అట్లే నిల్చుండిపోయారు. జైని, సీదో, మిన్కోలు వరకులు తీసి పరుస్తూనే "పడుకుందాం రండి అక్కలు" అనడంతో గిరిజ సెంట్రీ డ్యూటీలు చెప్పింది.

చంటి పిల్లాడితో తెల్లార్లు తిప్పలే ఉంటాయి గనుక పిల్లిబాయికి సెంట్రీ మాఫీ చేశారు.

వరకులో నడుం వాల్చిన గిరిజ ఆలోచనలు తన కొత్త బాధ్యతల వైపు పోయాయి. స్త్రీలని బాధ్యతల్లోకి ప్రోత్సహించటం లేదనీ, ఏ రంగంలోనైనా స్త్రీలని వెనక్కి నెట్టేస్తుంటారనీ అవకాశం దొరికితే చాలు చురకలు వేసే తనకే తీరా తొమ్మిదిమంది బాధ్యత నెత్తిన పడేసరికి కాస్త జంకు అనిపించింది. ఎందుకు? అనుకుంటూ పక్కనున్న వెపన్ సరిగా సర్ది ఒత్తిగిల్లి పడుకుంది.

పక్కలో పిల్లాడు కదలి రాగం పట్టడంతో పిల్లిబాయి పిల్లాడి నోటిలో రొమ్ము పెట్టి జోకొట్టడం ప్రారంభించింది. దీనితో గిరిజ ఆలోచనలు ఇంకోవైపు మళ్ళాయి. గతమంతా బుర్రలో సినిమా రీళ్ళలా తిరగడం ప్రారంభించింది.

ఇంట్లో అల్లారు ముద్దుగా పెరగడం, కాలేజీలో రాడికల్ రాజకీయాలు, పార్టీ క్యాంపెయిన్‌లలో తల మునకలుగా కొట్టులాడడం కామ్రేడ్‌తో పెళ్ళి, పిల్లల్ని కనే సమస్య, అది పార్టీ జీవితానికే ప్రతిబంధకం అవుతుంది గనుక మాను కొమ్మని సలహాలు, అన్నీ వరుసగా రంగుల రాట్నంలా బుర్రలో గిర్రున తిరిగాయి.

మాతృత్వం దగ్గర ఆగిపోయిన ఆలోచనలు మనసులో మథన రేపుతుంటే ఇక లాభం లేదనుకొని ఆ ఆలోచనలు విదిలించుకుంటూ లేచి డబ్బాలో నీళ్ళు తాగి సెంట్రీ వరకు పోయి వచ్చింది.

సెంట్రీని చెక్ చేసి వచ్చి పడుకున్న గిరిజకు ఎంత ప్రయత్నించినా నిద్ర రావడంలేదు. అన్నిటికి సిద్ధపడి అన్నీ వదులుకొని అడవికి వచ్చిన ఈ రెండేళ్ళలో తన కళ్ళముందే జరుగుతున్న ఎన్నో సంఘటనలు, ఎన్నో అనుభవాలు ఎంత వద్దన్నా ఉసిళ్ళ పుట్టలా తలలో జుమ్మని రేగుతున్నాయి.

సాంస్కృతికంగా వెనుకబడ్డ వాళ్ళనుకుంటున్న ఆదివాసీ అమ్మాయిలు దళంలోకి వచ్చి పార్టీలోకి ఎదిగి పెళ్ళి పిల్లలు వంటి వ్యక్తిగత విషయాలను పోరాట అవసరాల కోసం, మంది ప్రయోజనాల కోసం ఎంత తేలిగ్గా వదులుకో

గలుగుతున్నారో చూస్తూ ఉంటే తన కళ్ళను తానే నమ్మలేక పోతుంది. నిజంగా ఎవరు సాంస్కృతికంగా వెనుకబడ్డది ? వాళ్ళ భాషలో 'లోకుర' (ప్రజల) గురించే ఆలోచించి సొంత లాభాన్ని వదులుకోగలిగే ఆ పెద్ద బుద్ధి ఎప్పుడందుకో గలుగుతాం ?!

అలా ఆలోచిస్తున్న గిరిజకి జైని చెప్పిన విషయం గుర్తుకొచ్చి నవ్వొచ్చింది. ఇష్టం లేని పెళ్లి తప్పించుకోడానికి ఇల్లును, తల్లిని వదలి ప్రమాదాలు లెక్క చేయకుండా తిరిగిన పిల్ల దళంలోకి వచ్చాక ఎంత మారిపోయింది ! వలచిన వాడి కోసం అంతకు తెగించిన రాగో నాన్నను మరిచిపోగలగటమే తనకిప్పటికీ వింత అనిపిస్తుంది. "వయసొచ్చిన కొత్తలో అందరిలాగే వెర్రిగా జోడికోసం పాకులాడాను గానీ దళంలో బుద్ధులు నేర్చుకున్నాక ఇప్పుడు ఆ ధ్యాసే రావడంలేద"న్న జైని మాట నిజంగా మనసులో మాటేనా అనిపిస్తుంది.

సెంట్రీ డ్యూటీ అయిపోయి తిరిగొచ్చిన జైని "నువు నిద్ర పోయినట్టు లేదు కద అక్కా-నువ్వే చేసి వస్తావా! మిన్కోను లేపనా ?" అని కదిలించేసరికి "లేదు, లేదు మిన్కోనే లేపు" అంటూ బలవంతంగా నిద్రపోవడానికి ముసుగు కప్పుకుంది.

చివరి సెంట్రీలో ఉన్న సీదో అక్కల్ని లేపుతుంటే లేచి కూచుని టైం చూసుకుంది గిరిజ. "5.30 అయిపోయింది. తొందరగా తయారవుదాం!" అని అందరిని హెచ్చరించింది. పదినిముషాల్లో అందరూ టక టక తయారయ్యారు. కిట్లు వేసుకుందామనేసరికి మెంతెక్క, మిన్కోలు ఇంకా రాలేదని ఎక్కడివారు అక్కడే చతికిలబడ్డారు.

గిరిజ పక్కనే కూచున్న జైని చుట్టుచూసి "కమాండర్ ఏమన్నాడక్కా" అని చెవులో మాట్లాడుతున్నట్లు నెమ్మదిగా కదిపింది.

అకస్మాత్తుగా వచ్చిన ఈ ప్రశ్నకి సందర్భం ఏమిటో తెలియక గిరిజ అయోమయంగా చూస్తుంటే "అది కాదక్కా ! రాత్రి మీరు ముగ్గురు మాట్లాడుకున్నారు గదా! పోలీసు ఫైరింగ్ గురించి ఏమన్నాడు దాద" అని తన ప్రశ్న వివరించింది జైని.

పోలీసులను గట్టిగా తిప్పికొట్టామని అందరి ముందే చెప్పాడు కదా అంతే. మళ్ళీ ఆ విషయం రాలేదు అంటూ అంతలోనే గిరిజకు సెల్ మీటింగ్ చప్పున గుర్తురావడంతో జైని దాని గురించే అడుగుతున్నదనుకుంది.

"ఓహో ! నిన్న మీరు గోటుల్ దగ్గరికి ఎగరడానికి పోయినపుడు మేం ముగ్గురం మాట్లాడుకున్నాం అని కదా ! అది సెల్ మీటింగ్ జైని. ఇదివరకే నీకు ఒకసారి చెప్పాను కదా. పార్టీ సభ్యత్వం ఉన్నవాళ్ళే సెల్ మీటింగ్‌లో కూచుం టారు".

గాలి పోయిన సైకిలు టైర్‌లా జైని ఒక్కసారి చప్పబడిపోయింది. "నిజం గానే రుషికి తన సంగతేం పట్టలేదా. లేక తనని అక్కే అట పట్టిస్తుందా. పోనీ అలాగే వుండనీ నేను అడగను" అనుకుంటూ తన ఆలోచన్లు మొగం మీద కనపడ నివ్వకుండా, "డుంగ, కర్ప, మిన్కో అందరూ నాకంటే ముందు చేరినవాళ్ళేకదక్కా. వాళ్ళకు కూడ పార్టీ సభ్యత్వం ఇవ్వలేదా" అంటూ గుట్టుగా మాట నింకో వేపు తిప్పేసింది.

"సీనియారిటీ ఒక్కటే కాదు జైని, పోరాటంలో పట్టుదల, పనుల్లో చొరవ, రాజకీయాల్లో చురుకుతనం, మొత్తంగా మన అభివృద్ధి అన్నీ పరిశీలించి పార్టీ సభ్యత్వం ఇస్తారు. పార్టీ సభ్యత్వం కావాలనీ ఆరాటం పెరగడం కూడ ఆ చైతన్యం పెరుగుతున్నదనటానికి సూచనే" అంటూ ఇంకా ఏమో చెప్పబోయేసరికి "కిట్లు వేసుకోండోహోయ్" అని అరుస్తూ మిన్కో రావడంతో అందరూ లేచారు.

పొద్దు కర కర పొడుస్తుంటే, దళం బాటన నడుస్తుంది.

నడుస్తూ నడుస్తూ జైని హఠాత్తుగా ఆగి "రోడ్డొచ్చింది దగ్గరిగా రండి" అంది. గిరిజ లైన్‌లో నుండి ముందుకొచ్చి "జైనీ అందరూ దాటేవరకు కవర్లో సెంట్రీ ఉండు. సీదో, మిన్కో మీరు అలర్ట్‌లో రండి" అంటూ "రండక్కా— ఎవరూ వెనుకపడకుండా అందరు తొందరగా రోడ్డు దాటాలి" అంటూ మొత్తం దళాన్ని రోడ్డు దాటించి 40-50 గజాల వరకు అడవి లోపలికి చర చర లాక్కు పోయింది.

"రోడ్డు దాటడానికి ఇంత హడావుడి ఎందుకో"- అని నవురి ఆశ్చర్య పోతుంటే, దళాన్ని రోడ్డు దాటించేపుడు రుషి, గాండోలు ఎలా చేసేవారో తాను కూడా సరిగ్గా అలాగే నిర్వహించానన్న సంతృప్తితో కమాండర్ గిరిజ ముందు కెళ్ళుతుంది.

కొంచెం దూరం వెళ్ళేసరికి బాట పక్కనే ఓ పెద్ద నల్ల బోర్డు మైలురాయి కనపడేసరికి మెంతక్క "రండి, రండి అందరు దగ్గరిగా రండి", అంటూ రోడ్డు దాటే సన్నాహం ప్రారంభించింది.

వెనక్కి తిరిగిన జైనితో పాటు గిరిజ, సీదోలు కూడ ఆ హడావుడి చూసి పకాల్న నవ్వారు.

"ఇది రోడ్డు కాదక్కా. జీకం కండి" (కండి అంటే డాం)

"ప్రాజెక్టుకు సంబంధించిన బోర్డు, పునాదిరాళ్ళు అవి. ఇంద్రావతి మీద పెద్ద డాం కట్టి భూపాలపట్నం వరకు నీటి సౌలత్‌కి, బిజిలి [కరెంటు] తీయడానికి కోట్ల రూపాయల ఖర్చుతో సర్కార్ ప్లాన్ చేసింది. ఆ డాం పూర్తయితే 150 ఊర్లతో పాటు ఈ అడివంతా నీటిలో మునిగిపోతుందట ఇవి దాని బోర్డులు" అంటూ గిరిజ వివరించింది.

"అబ్బో. ఇంత అడవి ఇన్ని ఊర్లు పోతే ఎట్లక్కా? మన అందరం ఏం అపుడు. దున్నుకోను భూమే లేకపోతే నీటి సౌలత్‌లు, బిజిలీలు ఏం చేసుకోను" అని మాట కలిపింది రేఖ.

"బిజిలి అంటే పట్నంల మిల్లుల కోసం కదా. మన అడవి ముంచేసి షావుకార్లకు సౌలత్‌లు చేస్తారన్నమాట" అంటూ చర్చను పొడిగించింది ఇర్పి.

"ఔనక్కా బాగ చెప్పారు. ఈ పెద్ద పెద్ద ప్రాజెక్టులన్ని మనల్ని ముంచి వాళ్ళ బంగ్లాలు లేపుకునే బాపతే తప్పా నిజంగా జనానికి పనికొచ్చేవి గావు. అందుకే మనం దున్నేవాడికే భూమి గావాలని కొట్లాడుతున్నాం. ఈ ప్రాజెక్టులు కూడ ఖిలాఫ్ చేస్తున్నాం" అంటూ చెప్పుతున్న గిరిజ మాటకు జైని అడ్డు తగిలింది.

"అక్కా గవి పొలాలు, అవుతల ఊరు. ఈ వాగులో మొఖం కడుక్కొని పోదాం" అని ఆగింది జైని.

"ఊళ్ళోకి ఇద్దరక్కల్ని పంపి కబురు పెడతాం. మనకు ఆలస్యం అయినా ఊరి వాళ్ళు ఉంటారు" అంది గిరిజ.

"మనమెందుకక్కా ఊర్లో కబురుకి. ఆ ఖేతుల్లో పొగ వస్తుంది. ఎవరన్న ఉండచ్చు" అని అంది సీదొ.

"వానకాలం కద అక్కా. దాదలు ఎవరో బట్టిపెట్టి ఉంటరు" అని తేల్చేసింది మెంతక్క.

"అరే! చూద్దామా! నేను ఎపుడు కల్లు దించంగ చూడలేదు-మెంతక్కా. తర్వాత మొఖాలు" అంటూ అందర్ని అటు మళ్ళించింది గిరిజ. వారందరికి ఆ కల్లు వ్యవహారం లోతుపాతులు తెలిసినా గిరిజ కోసం 'పదక్కా' అంటూ నడిచారు.

కల్లు తీస్తున్న దాదతో ఊళ్ళోకి కబురు పంపించి వచ్చిన అక్కలంతా నీళ్ళ ల్లోకి దిగారు. దళం అక్కలు బట్టలు ఉతుక్కుంటుంటే ఊరి అక్కలు స్నానాల కుపక్రమించారు. పిల్లీబాయి బాబును ఒడ్డుమీద పడుకోబెట్టి వచ్చి వారితో కలసింది.

గబగబా స్నానం చేసిన ఊరి అక్కలు ఒడ్డెక్కసాగారు.

"ఏయ్. మెంతక్క ఇక్కడ చూడు ఆ రొండిపుండ్లు పొక్కులుతీసి మంచిగ స్నానంచెయ్యి. లేకుంటే ఆ సొనకారి జన్మల పోవు పుండ్లు. ఇదిగో సబ్బు" అంటూ అందించింది గిరిజ.

చెడ్డీలపై స్నానం చేస్తున్న దళం అక్కలను చూస్తున్న రేఖ. నవురులు గుస గుసల్లోకి దిగారు.

"రేఖ – చూడవే – అక్కలు ఎంత సేపు అయ్యిందో స్నానం చేయబట్టి !" అంది నవురి.

"పాపం. ఎన్ని రోజులయ్యిందో" – అంది రేఖ.

"కాదే. ఆ రానుకు చూడు. సబ్బులేక ఓసారి, సబ్బుతో ఓసారి. అటు తర్వాత ఓసారి. లేకుంటే చిటిరెల చెయ్యొచ్చు" అంది నవురి.

"అక్కలూ! ఇక అయిపోయినట్టే. వస్తున్నం!" అంటూ కిట్లోనుండి మరో డ్రెస్సు తీసి ఎక్కుస్తూ గిరిజ తేతేసింది.

దళం వచ్చిందన్న వార్త తెలిసిన తాండవాయి ఊరి దాదలందరు గోటుల్ ముందు హాజరై ఉన్నారు.

"లాల్‌సలాం దాదలు" అంటూ అక్కడికి చేరుకున్న దళాన్ని చూస్తున్న దాదల కళ్ళు మరెవరి కోసమో వెతుకుతున్నాయి.

"దాదలెవరు లేరు బాయి" అన్నాడొక దాద.

"ఈసారి రాలేదు దాద. మేమే వచ్చినం" అంటూనే గిరిజ "అందరు రండి. మీటింగ్ చేద్దాం దాద" అంది.

"రెండు పాటలు పాడుదాం అక్కా! ఊరోళ్లందరు జమయితరు" అంది జైని.

'ఇంగో-"మన ఇర్పి" 'కమలక్కపాట' బాగపాడుతుంది. కానీయ్ ఇర్పక్క" అంది సీదు. ఆ పాట ముగిశాక మిన్కో కోరికపై రేఖ "కోనిలే" పాట పాడింది.

వచ్చిన వాళ్లందరు అక్కడే చోటు చేసుకొని కూచుంటున్నారు. గోటుల్

ముందున్న చింతచెట్టు వీరందరికి నీడనిస్తుంది, పిల్లగాండ్లు దడులమీద కూచుంటే మగాళ్లకు కొద్దిగ దూరంలో అడవాళ్లు జమయింద్రు. సీదో సెంట్రీ పోయింది.

కరపత్రాల గురించి మాట్లాడిన గిరిజ తామనుకున్నట్టు రివాజులపై జరుగ నున్న మీటింగ్, రివాజుల విషయం చెప్పమంటూ జైని వైపు చూసింది.

మెల్ల మెల్లగా అలవాటు అవుతున్న ఉపన్యాసాలు జైనిలో బెరుకును పోగొడు తున్నాయి. జైని ఉపన్యాసం జోరుగా నడుస్తుంది. అడవాళ్ల మధ్యలో కూచున్న బూదు ఏమో అడగడానికై అవకాశంకై ఎదురుచూస్తుంది.

ఛాయ్ తెచ్చిచ్చిన లామదే అక్కలందరికి అందిచ్చాడు. అన్నలెవరు రాలేదని అర్థమైనా 'సెంట్రీ దగ్గర ఎవరన్న ఉన్నరేమో' అన్న ఆశతో 'సెంట్రీ దాదకు ఛాయ్ ఇచ్చిరావాల్నా బాయి' అంటూ అడుగుతున్న లామదే రైనుతో పరధ్యానంలో ఉండిపోయిన గిరిజ "ఇంగో" అంది.

ఛాయ్ గిలాసతో నడుస్తున్న లామదేకు అక్కడ అన్న ఉన్నడన్న నమ్మ కంతో కొండంత ఆశ పెరిగింది. తన సమస్య వివరంగా చెప్పొచ్చుననుకుంటూ నడుస్తున్నాడు. "బూది ముచ్చట అక్కల్తో ఆ దాదే చెప్పుకుంటాడు. అయినె చెపుల ఊదుతె అయిపోయె"-ననుకుంటూ సెంట్రీ పోస్టు చేరుకున్న లామదె కళ్ళు కలియ జూస్తున్నవి.

"ఏయ్ దాద ఇక్కె"-(ఇక్కడ) అన్న అడగొంతు విని విస్తుపోయి అటు నడిచి నిరాశతో గ్లాసందించాడు.

"దాదల్ హిల్లోర్" - రైను
(అన్నలేడా)
"ఇంగో"-సీదు.

ఖాళీగ్లాసుతో వస్తున్న రైనులో నైట్‌స్కూలు గురూజి మెదులుతున్నాడు. బూదికి తను లామదె ఉన్నాడు. రెండేండ్లు నిండినయి. నాలుగేండ్లు బాకీ ఉన్నాయి. బూదీ వానికి అలవాటు అయ్యి తన దగ్గరికి వస్తులేదు. మాటలేదు ముద్దు ముచ్చట లేదు. ఎవరికి చెప్పొద్దంటే వాళ్ల వ్యవహారం ముదురుతుంది. చెప్పుదామంటే 'అయింత నాలుగేండ్లు నిండనీ. నీకు పిల్లనిచ్చి పెళ్ళిచేయనా' ? అంటడు మామ. కానున్న పెండ్లాం కళ్లముందు పరాయి మగాడితో సంసారం చేస్తుంటే ఏమి చేయ లేక బాధను దిగమింగుతున్న రైను గోటుల్ వద్దకు చేరుకునాడ్ను.

"లామడే! హల్లే! గాటోల్ విచార్ కీమ్డా"(అన్నం సంగతి చూడు) అంటూ పటేల్ పని పురమాయించాడు.

ఎదురు చెప్పడం ఏనాడో లామ్ (ఇల్లరికం) కుదిరిన్నాడే మరిచిపోయిన లామడే "ఇంగో" అంటానే గుండెలు కోస్తున్న బాధతో వెళ్ళిపోయాడు.

ఛాయ్ తాగి మళ్లీ ఉపన్యాసంలోనికి పోబోతున్న జైనికి బూది అడ్డుతగిలింది.

"అక్కా. ఒంది పొల్లు" (ఒక్కమాట)

"వెహ (చెప్పు)-బాయి" అంది జైని.

ఊరిజనాలు గుడ్లప్పగించి నిల్చున్న బూదివైపే చూస్తున్నారు. అమ్మలక్కలు బూదిని నిలువెల్లా చూస్తున్నారు. దడులమీద కూచున్న పోరగాండ్లు నవ్వుతున్నారు. పటేల్ దిక్కులు చూస్తుంటే బూది తండ్రి మాత్రం 'ఈ పోరికి ఏమైంది'? అన్నట్లు చూస్తున్నాడు.

"లామడేను మర్మి ఆమోన్" (ఇల్లరికం ఉన్న అల్లుడ్ని పెళ్ళి చేసుకోను.) అంటూ బూది నేలచూపులు చూస్తూ చీర చివర వేళ్ల సందున ఇరికించుకొని ముని పళ్లతో చిన్నగా కొరుకుతుంది.

నైట్‌స్కూలు గురూజి గొంతు సవరించుకొని లుంగి పైకి జరుపుకొని ముని కాళ్లపై కూచున్నడు.

"లామడె ఎవరక్కా"-అంది గిరిజ.

అంతా నిశ్శబ్దం.

నిముషం తర్వాత పటేల్ "ఇప్పుడు పోయినోడే" అన్నాడు.

"ఏం సంగతి నువు చెప్పు దాదా" అంటూ పటేల్‌ను కోరడంతో అసలు విషయంలోనికి పటేల్ దిగాడు.

"ఆరేండ్లు లామ్ (ఇల్లరికం) ఉంటే బిడ్డనిచ్చి పెండ్లి చేస్తానని 'బూదుర్ తప్పే' బూదు తండ్రి రైనుగాన్ని తెచ్చిండు. ఇదే పెద్ద బిడ్డ. ఇంకోతి చిన్న పోరి, కొడుకులు లేరు. భీమారిపడ్డ పెండ్లాం ఎప్పుడు పూజారి దగ్గరే నేనాయె. రెండేండ్లా యింది లామడే పెట్టి. అంత మంచిదే గానీ గీ పోరి గట్ల ఎందుకంటుందో నేను గిప్పుడే వింటున్న బాయి"- అని తెల్సినకాడికి చెప్పి పటేల్ ఊరుకున్నాడు.

"ఇంగో, అంతే బాయి. పని వెళ్ళక లామడే పెటుకున్న. పెద్దల ముందరనే

అనాడు పోరిని అడిగితే 'ఇంగో' అన్నది. ఇయ్యాల గిట్లయింది" అని బూదురు తప్పే పటేల్ చెప్పిందే మరోసారి నొక్కి చెప్పాడు.

కేసు అర్థంగాని గిరిజ జైని వైపు చూసింది. జైని నవ్వుతుంది.

"గాటో అయ్యింది" లామడే పిలుపు.

"తిన్నాంక చేయింద్రక్క పంచాయితీ. అకలైతుండచ్చు" అంటూ పటేల్ తొందరచేస్తూ గోటుల్ వెనుకకు దారి తీశాడు.

"ఇంగో" అంటూనే గిరిజ కాసేపట్లో వస్తాం. ఉండమని జనాలను కోరుతూ తన దళం వారితో పటేల్ వెనుక నడిచింది. బూది సెంట్రీ వైపు నడిచింది.

వడ్డన చేస్తున్న లామడే ముఖం మీద నెత్తురు చుక్క లేదు. బూది దక్కుతుందన్న ఆశ లేదు. అమాయకంగా అక్కల వంక చూస్తున్నాడు. తన బాధ అంతా చెప్పుకొని న్యాయంగా బూదిని తనకే ఉండేట్లు చేయమని అడగాలని నోరు దాక వచ్చినా పటేల్ అక్కడే ఉండడంతో ఆ మాట పెకలడం లేదు. కడుపులున్న బాధ వెళ్లబోసుకోడానికై అవస్థ పడుతున్నాడు.

"నీళ్ళివ్వు దాద" అన్న మెంతక్క పిలుపు విని బకెట్‌లోకి చూసిన పటేల్ నీళ్ళు లేవని లామడేను నాలుగు తిడుతూ నీళ్లకు గెదిమాడు.

"ఏ లామడేకైనా ఇదంతా మామూలే" అన్న ధోరణిలో చెప్పిన ప్రతి పనిని చేస్తున్న రైనును చూసి గిరిజలో తెలియకుండానే సానుభూతి పెరుగుతుంది.

సెంట్రీ చేస్తున్న మినొక్కను మెల్లగా కబుర్లలోకి దింపింది బూది. క్రమంగా తన విషయంలోనికి తెచ్చింది.

"నేను అయ్యా బెదిరిస్తే పెద్దల ముందు ఔనన్నమాట నిజమే. కానీ నాకు ఆ లామడే ఇష్టంలేదు. నేను మా ఊళ్ళె గురూజి పని చేస్తున్న 'పద్దా సైతుకే' పోతా. సైతుకూడ వరుసైన వాడే" అంటూ ఈ విషయం మీటింగ్ చెప్పే అక్కలకు చేరవేయమన్నట్టు చెప్పి ముగించింది బూది.

మీటింగ్ దగ్గరికి భోజనాలు ముగించుకొని అక్కలు చేరినారు. బూది తన స్థానంలో తను కూచుంది. మిగిలిన అన్నం తిని చేయి కడుక్కొని పటేల్, తిన్నాక గంజులు కడుగుమని లామడేకు డ్యూటీ అప్పచెప్పి వచ్చి తన స్థానంలో కూచున్నాడు.

బావి దగ్గర మసి గంజులను మట్టిపెట్టి రాకుతున్నాడు లామడే రైను. అన్నం గంజు అడుగు మాడిపోయి కర్రెబడి గట్టిగ తోముతే గాని పోయేట్టు లేదు.

బూదు బుద్ధి తెలిసిన గురూజి ఏ చింత లేకుండా కూచున్నడు.

"బూది లామదే ఎందుకొద్దు ? ఇంకెవరైనా నచ్చినోళ్లున్నరా" అంది జైని.

నేల చూపులు చూస్తూ బూది గురూజి కూచున్నవైపు ఒక్కసారి తలెత్తి చూసేసరికి తోమిన గిన్నెలతో అటు వస్తున్న లామదే కంటపడ్డాడు.

"నాకు ఈ లామదే వద్దు అక్కా ! నేనూ మీతోనే పార్టీలోకి వస్తా"నంది బూది.

బేఫికరుగా కూచున్న గురూజి గతుక్కుమన్నాడు.

భోజనం ముగించి వస్తున్న మిన్కో జైని చెవిలో గుసగుసలాడుతుంటే జైని తల తిప్పకుండానే "ఇంగో, ఇంగో" అంది.

"లామదే దాదా ! నువు ఏమంటావు" అంది గిరిజ.

"బూది కోసమే లామ్ (ఇల్లరికం) ఉన్న, గరీబోణ్ణి" అంటూ మరో మాట మాట్లాడకుండా ముగించాడు.

"దాదా ! నీ బిడ్డకోసం లామదే ఉన్నడు. బూదేమో లామదేను వద్దంటుంది. రెండేండ్ల నుండి గొడ్డు చాకిరి చేస్తున్న లామదేకు పెండ్లి చేసి ఇస్తాననే మాటిచ్చినవు. దాన్ని అమ్మినంత పని చేసినవ్. వెల్లుప్పాను లేకనే లామదే ఉన్నడు. మరో పిల్లను తెచ్చుకునే శక్తిలేదు. ఏం చేస్తవో చెప్పు" అంది జైని బూదుర్ తప్పె వంక చూస్తూ.

"బూదినిచ్చే పెళ్లి చేస్త !" బూది తండ్రి.

"నీ యిష్టమా. ఆమె యిష్టమా. కాపురం చేసేదెవరు దాద" అంది గిరిజ పౌరుషంగా.

మరోమాట మాట్లాడక బూదురు తప్పె గమ్మునుండగ, లామదే రైను "ఇంతటితో కథ ముగిసింది" అని ఆశ వదలుకోవాలనుకున్నా ఆశ చావడం లేదు.

గురూజి ముఖంపై చిరునవ్వు తొంగి చూసింది.

"లామదే దాద. నువ్వేమంటావు". అంది గిరిజ.

"పిల్లనిస్తానని లామ్ పెట్టుకున్నాడు. బూదు గాకుంటే బూదు చెల్లె అయినా మంచిదే" ఆడదిక్కు అన్న ధోరణిలో మాట ముగించాడు రైను.

"ఇంగో ! హీకన్" (ఇస్తాను) అంటూ ధీమాగా పలికాడు బూదురు తప్పె.

"అబ్బ. గొప్ప పనే చేస్తవు దాద ! మన మాడియా కులంలనే అంత దాద.

బర్రెనా, గొడ్డా దాద ఆడది. నచ్చిన రేటుకు కుదిరినోనికి ఇచ్చినట్టు. ఇదే ఉండనో దేవా! అంటే ఇంకా పెద్దదే కాని ఆ పోరిని పట్టుకొని ఇమ్మని లామడె, ఇస్తానని నీవు. బాగుంది దాద. మీ వ్యవహారం"— అంది జైని.

"అబ్బ ఎంత ఘోరం" అన్నట్టుంది గిరిజకి. 'ఆడదాన్ని ఎర చూపి ఎంత ఆడుకుంటున్నరు. ఆడదాన్ని అమ్ముకుంటున్నరు. పిల్ల కడుపుల బుట్టిందంటేనే పెళ్ళి జంజాట్ మొదలైనట్టు. ఆడదానికో అభిప్రాయం ఉంటుందనీ, దానికో మనసు ఉంటుందనీ చూడనే చూడరు. వీళ్ళుకూడ ధైర్యంగా మాట్లాడి చావరు. ఇప్పుడన్న మాటే అనాడు అని ఉంటే ఇంత గలాటా జరిగేదా. జీవసారే ఇచ్చుకోలేని వాళ్ళు ఆరేండ్లు చాకిరి అంతా చేశాక పీటలమీద పెళ్ళి ఎత్తిపోయినట్టు అయితే ఆ దుర దృష్టవంతుడి గతి ఏం గావాలి' అని ఆలోచనల మధ్య మునిగిపోయిన గిరిజ 'అక్కా' అన్న జైని పిలుపుతో బయటపడింది.

జైని. గిరిజలు పక్కకొచ్చింద్రు.

"అక్కా ఇందులో బూదు తప్పేమీ లేదు. కాకపోతే తిట్టినా, కొట్టినా ధైర్యం చేసి లామడేకు ఉండననాల్సింది. కానీ ఆ దెబ్బలకు ఆగలేక ఒప్పుకోవచ్చు పాడై. బలవంతాన పెళ్ళి చేసినా ఆమె ఈయన దగ్గర ఉండదు. ఏనాడో టొక్క లేపుతుంది. అయినా మనసుకు నచ్చినవాడితో కాపురం చేయాలని కోరుకోవడం సహజమే గదక్క" అంటూ చెప్పుతున్న జైని వంక బిరిపోయి చూస్తుంది గిరిజ.

"ఇక లామడెకు వస్తే లామడే పద్దతే మంచిది గాదక్కా! పెళ్ళి చేసి లామ్ ఉండమంటే ఈ పేచి తగ్గుతుంది. గోపగూడలో రుషి దాద ఇదే చెప్పిండు. రెండేండ్లు పని చేసినందుకు ఈ లామడే రైనుకు జీతం లెక్క కట్టి ఇప్పిస్తేనే బాగుంటుంది తప్ప బూదిని ఉండమనడమైనా, బూది చెల్లెల్ని ఆశపెట్టడమైనా మంచిది గాదక్కా".

"బూది ఎవరికి పోతుందో, ఎప్పుడు పోతుందో తెలియదు. దానితో ముడి పెట్టకుండ బూదురు తప్పేను రెండేండ్ల జీతం ఇమ్మనాలె, ఇట్ల చేస్తే ఎట్లుంటుం దక్క" అని అడుగుతున్న జైనినే చూస్తూ మరోసారి "ఇంగో" (అవును) అంది గిరిజ తనకు తెలియకుండానే.

"విషయం అంతా విన్నారు దాద మీరు. మన బాయిలు కూడ విన్నారు. మీరే మనుకుంటున్నారు ?" అంటూ జైని మొదలుపెట్టింది. ఎవరు మాట్లాడక పోయే సరికి మళ్ళీ తానే మొదలుపెట్టింది.

"లామడే పెట్టుకోవడం రివాజేగదా. భయపడో, ఇష్టపడో పోరి 'ఇంగో' అన్నాకనే లామడే పెట్టుకున్నాను అంటాడు బూదుర్ తప్పే. చేతికెదిగిన కొడుకు లేక లామడే పెట్టుకోక నేనేం గావాలంటడు? 'జీవపారె' ఇచ్చి ముత్తి (భార్య)ని తెచ్చుకోలేకే కదా లామడే ఉన్నాను. మద్దకు నిండేదాక గొడ్డువాకిరి చేసినాక ఆ పిల్ల రానంటే నా గతేం కావాలంటడు లామడే. తండ్రేమో పనికెళ్ళ దీసుకుంటాడు. లామడే తన సుఖం తాను చూసుకుంటాడు – నేను మాత్రం బతికినన్నాళ్ళు ఇష్టం లేనివాడితో కాపురం చేయాలి. ఇదేం న్యాయం. నేను చచ్చినా చేయనంటుంది బూది. తన్ని, గుద్ది, కాపురం చేయించే అధికారం మీకుంది కాబట్టి నేను కాకపోతే నా చెల్లితో బలవంతంగా కాపురం చేయిస్తానంటరు. మేమేం గొడ్లమా అన్నదే బూది బాధ. మరి ఎవరిది తప్పు లేకపోతే ఈ తగువులు ఎందుకు జరుగుతున్నాయి. ఇన్ని బాధలు ఎందుకు వస్తున్నాయి. ఈ పంచాయితీలు ఏంటి. మీరే విచారం చేయాలి".

"మనం అన్నమాట చెల్లకపోతే తన్నుడు, గుద్దుడే మంత్రం అనుకున్నంత కాలం మనకీ బాధలు తప్పవు. ఫారెస్టు గార్డో, పోలీసోడో తుపాకి చూపించి బూతులు తిడితే ఇన్నాళ్ళు మనం దండం పెట్టి పడుండ లేదా! ఇవ్వాల మనం గట్టిగా నిలబడితే వాళ్ళ పనేమైంది"?

"ఈ పట్టిలో రివాజులు (ఆచారాలు) గట్టిగా జరిపించాలనీ పటేళ్ళ, పేన్యల్లు మీటింగులు కూడ పెడుతున్నారు. మంచిదే. కాదన్నవాళ్ళను ఎందరిని తన్ని కాపురాలు చేయిస్తారో! రవికలు తీయని బాయిలను ఎంతమందిని కాలుస్తరో; బాయి లందరికి ఒకేసారి అగ్గిపెట్టేసుకుందామా మీరే ఆలోచించండి". అంటూ జేబు రుమాలు తీసి మొఖం తుడుచుకుంది.

పక్కనున్న గిరిజ రెప్ప వాల్చకుండా జైని మొహం లోనికి చూస్తుంది.

జైని మళ్ళ ఎత్తుకుంది.

"దొంగచాటుగా ఇల్లు చొరడమో, కేర్డైలై ఊళ్ళు పట్టుక తిరగడమో, ఏడుస్తూ బలవంతంగా కాపురాలు చేయడమో తప్ప ఇష్టంలేని పెళ్ళి నాకొద్దని మొదట్లోనే నోరిడిసి చెప్పకుండా, పడుచులు నోరు మూసుక పడి ఉంటే చివరకు ఈ పంచాయితీలు తప్పవు. తన్నులు, గుద్దులు తప్పించుకోడానికి 'జీవపార' ఎగ్గొట్ట డానికి మాకు పెళ్ళి వద్దు. అన్నల్లో కలసిపోతమంటే బూదుకు కాకపోయినా బూదు

చెల్లెకి ఈ బాధలు తప్పవు. ఎన్నేళ్ళయినా మన మాడియాల బ్రతుకు లిలాగే ఉంటాయి.

ఒంటిగాళ్ళు పని వెళ్ళలేదనుకుంటే ఊళ్ళేవాళ్ళ సహాయం తీసుకొని పని తీసుకోవాలి గానీ, పూటకు గడవకపోతే గొడ్డో, గోదో అమ్ముకొని నూకలు తెచ్చుకున్నట్టు బిడ్డల్ని చూపెట్టి లామడే పెట్టుకోవడం, ఇష్టం లేదంటే బలవంతంగా కాపురానికి తోలడం ఇది పద్దతి కాదు. లామడే పెట్టుకోవాలనుకుంటే ముందే పెళ్ళి చేసి ఇంట్లో పెట్టుకోవడం వేరు.

బూది తన ఇష్టం అయినవాడికి పోతే ఆ దారికే జీవపార లామడేకే ఇవ్వాలి. అది ఎవరికి పోతుందో, వారు జీవపార ఇస్తాడో లేదో అది తర్వాత ముచ్చట. ఈ రెండేళ్ళ చాకిరి చేసినందుకు లామడేకి బూదుర్ తప్పె జీతం కట్టివ్వాలి. పనికోసం మనిషిని పెట్టుకుంటే పైసలో, గింజలో ఇవ్వాలి తప్ప బిడ్డల్ని ఆశ చూపే పద్దతి రద్దుగావాలి.

మన బ్రతుకులు చాలా మారుతున్నాయి. రివాజులు కూడా మారాలి" అంటూ ముగించి "ఏమంటావు పటేల్ దాద. లామడే జీతం మాట" అంది జైని.

జనాలందరు 'ఇంగో' 'ఇంగో' అంటూ తలోమాట అంటున్నారు.

బూదుర్ తప్పే "లోకులందరి మాట అదే అయితే అలాగే కానివ్వండి. ఈ పంట రాగానే జీతం కొలుస్తా. నాకు ఇగ లామడే వద్దు" అనేసరికి జనాలు మళ్ళీ 'ఇంగో' అన్నారు.

పంచాయితీ ముగిసిందని చెప్పడంతో అందరు లేచారు. చేతులు కలుపుతూ అక్కల నుండి సెలవు తీసుకొంటున్నారు. ఆ ఊరి సంఘం ముఖ్యులు ముగ్గు రక్కలు అక్కడే నిలబడి ఉన్నారు.

లామడే వెనక్కి చూడకుండా చర చరా వెళ్ళిపోతున్నాడు.

"అక్కా ఈ లొల్లి మొదటినుండి మేం చూస్తున్నాం ముందర పడనిది మనం వేలు పెట్టుడు ఎందుకని జోలికి పోలేదు. ఏమైనా ఇట్ల మేం చెప్పుడు కూడ నేర్చుకోవాలి" అంటూ ఆ ముఖ్యుల్లో నుండి ఒకామె అంది.

"మొత్తానికి పట్టి పెద్దల మీటింగ్ చెప్పి మంచి పని చేసినావ్ అక్కా. మా పటేల్ కూడ అంద్ల షరీకైనోడే. ఇగ ఏమంటడో చూడాలి" అంటూ మరో అక్క నవ్వుతూ చెప్పింది.

"ఏమక్కా ఇటు పోలీసుల కదలిక ఎట్లుంది. మొన్నటి కరువు దాడి ప్రభావం ఎట్లుంది. మన దళం ఇటు రాక చాలా రోజులైంది, ఈ నడుమ" అంటూ గిరిజ ఎంక్వయిరీ చేయసాగింది.

"ఒక్కటి, రెండు రోజులు కుక్కల తీరే తిరిగింద్రక్కా మాకు కూడ ఏమంటరో అన్నట్టే ఉండే అక్కా. కానీ ఇపుడేం కనపడుత లేరు" అంటూ జవాబు ఇచ్చింది.

వారందరు ఊరు పొలిమేర దాటారు. "ఇక మేం పోతాం అక్కా. మీరుం డండి. ఏమైనా ధైర్యంగ ఉండండి. ఊళ్ళో శేడోలందరికి మన పాటలు, మాటలు నేర్పండి" అంటూ గిరిజ వారికి వీడ్కోలు పలికింది.

క్యాంపెయిన్ నడుస్తుంది. అందరూ హుషారుగానే ఉన్నారు. ఊళ్ళల్లో అందరూ మీటింగ్‌లకు వస్తున్నారు. పంచాయితీలు మంచి—చెడ్డ అన్ని దళంలో చెప్పుకున్నట్టే జరుగుతుండడంతో దళం అక్కల్లో నమ్మకం పెరుగుతుంది.

దార్లు తప్పి అడవిలో సర్వే చేస్తూ తిరిగిందెన్నడూ లేదు. జైని పైలట్‌గా బాగానే నిర్వహిస్తుంది. ఊరక్కలు కూడా పాటలు నేర్చుకోవడమే గాకుండా మెల్ల మెల్లగా ఉపన్యాసాలిస్తున్నారు. ఆదివాసీ మహిళా సంఘాలు లేని దగ్గర ఆదివాసీ మహిళా సంఘాలు పెడుతున్నారు.

అదే చివరి రాత్రి. ఆ సాయంకాలం క్యాంపెయన్ దళం జువ్వి చేరుకుంది. జైని ఇంటినుండి పోయాక రావడం అదే మొదలు.

కరువు దాడిలో పాల్గొన్న ఆ వూరి వారందరూ ఉత్సాహంగానే ఉన్నారు. జైని తండ్రి, కాక, తల్లీ, కూచీలు అందరు ఇపుడు ఆ ఊరి సంఘంవారికింద లెక్కే. పాండు తిరగడంలోనే ఆ పట్టీలో సంఘాలు గట్టిపడుతున్నాయనీ అందరికి తెలుసు.

జువ్వి చేరిన క్యాంపెయిన్ దళం దల్సు ఇంట్లోనే ఆగింది. హడావుడిగా వసారాలోకి వస్తూ రామ ! 'రాగో, రాగో' అని వెతుక్కుంటూ వుంటే పిల్లీబాయి, 'జైనీ' అని కేకేస్తూ, ఆమెను లాగి కాక ముందుకు తోసింది. అలవాటుగా చేయి ముందుకు చాపిన జైని రెండు చేతుల్నీ పట్టుకొని బలవంతంగా గొంతు పెగిలించు కొని "బేష్మంత?" (బాగున్నవా) అన్నాడు రామ.

దళంలో కూతురిని చూసుకుంటున్న ఇంటి వారందరూ మన 'రాగోయే అనుకుంటూ' కొత్తమనిషిని చూస్తున్నట్టే అబ్బురంతో ఆనందంతో తబ్బిబ్బయి

పోతున్నారు. ఊరి శేడోలంతా వచ్చి దళం వారిని ప్రత్యేకంగా జైనిని పలకరిస్తున్నారు. దాదలు వచ్చి సావడి (వాసరా)లో కూచున్నారు.

బిడ్డ వచ్చిందన్న సంతోషంలో రాగో కూచి (రాగో చిన్నమ్మ) పోంగ మిగిలిన కోడిపోరిని కోసింది. ఇంటివారందరూ, జైనీ గతాన్ని మరిచి పోయినట్టే ఉన్నారు.

మీటింగ్ ప్రారంభమైంది. ఊరివాళ్ళు పొల్లు పోకుండా కరువు దాడిని వర్ణిస్తూ పోటీపడుతూ దళంతో చెప్పుతున్నారు. ఆ వూరి మహిళా సంఘం ముఖ్యులను ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఉందని గిరిజ ఆ విషయాన్ని ప్రస్తావించింది.

అంతే!

దల్సు - ఆ ఊరి శేడో (పెళ్ళి అయిన స్త్రీ)ల్లో నుండి తన మరదల్ని, సుశీల్ని, మరొకర్ని సూచించాడు.

అక్కడ కూచున్న వారందరు సంతోషంగా 'ఇంగో' అన్నారు.

ఇదీ జరుగుతున్నంతసేపు ఇల్లంతా తల్లితో కలసి కలియ తిరిగి వచ్చిన జైనికి పంజరంలో రాగో లేకపోయేసరికి అనుమానం వచ్చింది. తల్లిని వాకబు చేసింది.

"నువు పోయిన తెల్లారే దాన్ని ఒదిలిండు" అన్న తల్లి జవాబుతో జైనికి తండ్రి బాధ అర్థమై గుండెలవిసిపోయాయి.

మీటింగ్ దగ్గరికి వచ్చిన జైనిని చూస్తునే సుశీల ఆప్యాయంగా మట్టలు ముద్దు పెట్టుకుంది. మట్టలు ముద్దెట్టుకోవడం మాడియాల్లో ప్రేమకు నిదర్శనం.

"బాగున్నావే"-సుశీల.

"ఇంగో"-జైని.

"పెళ్ళి అయ్యిందా?"-సుశీల.

పగలబడి నవ్వి ఊరుకుంది జైని.

"పోదామా జైని! మనతో వచ్చిన అక్కలు ఇక్కడే ఉంటారు. రేపు దల్సు దాద వారికి తోడిచ్చి ఊరిదాక దిగబెడుతారు" అంది గిరిజ.

"ఇంగో"-అంటూనే దళం బయల్దేరింది.

పున్నమి చంద్రుని వెన్నెల్లో ఇంటినుండి, తల్లి-తండ్రినుండి, ఊరినుండి సెలవు తీసుకొన్న జైని ఠీవిగా ముందు నడుస్తుంది.

తోకాడిస్తూనే ఇంటి కుక్క జైనిని ఊరి పొలిమేరలు దాటించింది.

14

వాగులో చువ్వ (చెలిమె) తవ్వి డబ్బాలో నీళ్ల నింపి గడ్డకెక్కుతున్న కర్ర నికి దూరం నుండి వస్తూన్న జైని కంటపడగానే "లాల్‌సలాం అక్కలా" అని అక్కడినుండే ఓ పొలికేక పెట్టాడు.

"లాల్‌సలాం" అంటూ అటునుండి నాలుగు స్త్రీ కంఠాలు ఒకేసారి నినదించాయి.

మొహాలు కడుగుతున్న రుషి, గాండోలు తొందర తొందరగా ముగించి పైకెక్కారు. ఉగ్లే, టుగ్గిలు తెస్తున్న కట్టెలు దబ్బున కింద పడేసి "లాల్‌సలాం అక్కా!" అంటూ పిడికిళ్ళెత్తి గట్టిగా అరిచారు.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటున్నట్లున్న ఉదయం వాతావరణం ఒక్కసారిగా సందడితో కిలకిలలాడింది.

అక్కలా, అన్నలా అందరూ చేతులు కలిపి లాల్‌సలాంలు చెప్పుకున్నారు.

"అం అం కిట్లు దించుకోండి, కేంపేయిన్ ఎలా వుంది. అంతా లావెక్కినట్టున్నారు కదా" అంటూ రుషి యోగక్షేమాల్లోకి దిగాడు.

మొహాలు కడిగేవారు కడుగుతూ వుంటే కర్ర, డుంగాలు టీ తయారుచేస్తున్నారు. ఈలోగా రుషి, గాండో, గిరిజ, జైనిలతో ఓ పక్కగా కుచ్చట్లు పెడుతూ కేంపేయిన్ వార్తలు తెలుసుకొంటూ కబుర్లు చెబుతున్నాడు.

అందరూ టీ తాగడం పూర్తికాగానే దళం సమావేశం అయింది. రుషి గొంతు సవరించుకొని "కామ్రేడ్స్! ముందు అర్జంటు విషయాలు మాట్లాడుకుందాం" అనేసరికి అక్కడ సీరియస్ వాతావరణం నెలకొంది.

"మన డివిసి వారు అర్జంటుగా రమ్మని కబురుచేస్తే, అక్కలు అటు కేంపేయిన్‌కి వెళ్ళిన తర్వాత మేం ఆ కాంటాక్టుకు పోయి వచ్చాం. అక్కల కేంపేయిన్ జయప్రదంగానే జరిగింది. ఆ వివరాలు తర్వాత తెలుసుకుందాం. ముందుగా మన డివిసి వార్తలు మాట్లాడుకుందాం", అంటూ రుషి జేబులోనుండి డైరీ తీసి ముందు పెట్టుకొని మళ్ళీ ప్రారంభించాడు.

"ముఖ్యంగా మన డివిజన్‌లో యీమధ్య పెరుగుతున్న నిర్బంధం గురించి మాట్లాడ్డానికే పిలిపించింది డివిసి. పోలీసులు తిరగడం ఎక్కువైందనీ, వర్షాకాలం మొదలయినా యీసారి నిర్బంధంలో సడలింపు ఏమీ లేదనీ మనందరికీ తెలుసు.

పోలీసులు తిరిగే పద్ధతుల్లో మార్పు వచ్చింది. అడవి అంతా కూంబింగ్ చేస్తున్నారు. పిచ్చిగా ఫైరింగ్‌లు చేస్తున్నారు. జనాలను ఫైరింగుల్లో కాల్చేస్తామని బెదిరిస్తున్నారు. ఆంధ్ర పద్ధతులన్నీ అమలుచేసి అన్నల అడ్రస్ లేకుండా చేస్తామంటున్నారు. మన జిల్లా, రేంజి ప్రజా సంఘాల నాయకులు ఎవరు ఇళ్లలో ఉంటూ లేరు. మన మహిళా నాయకుల కోసం కూడ వాడు తిరుగుతున్నాడు. మనం ఈమధ్య ప్రవేశపెట్టిన మహిళా ఆర్గనైజర్లు - ఎకెఎస్ఎస్ ఆర్గనైజర్లు వాడికి ఎక్స్‌పోజు అయ్యారు. వారు దొరికినా చంపాలనేది వాడి ప్లాను. టెర్రర్ సృష్టించడానికి వాడు చేసే కుట్రలన్నీ చేస్తున్నాడు. ఆయుధాలు, వాహనాలు, వైర్‌లెస్ సెట్లు విపరీతంగా దిగుమతి చేసుకుంటున్నాడు. సివిల్ దుస్తుల్లో తిరగడం పెరిగిపోయింది. అనేక సందర్భాల్లో మన దళాలు తృటిలో తప్పుకున్నాయి. మన కొరియరింగ్ వ్యవస్థను దెబ్బ తీయాలన్నది వాడి ప్లాను. మన దంపుల కోసం వాడి గాలింపు మరింత తీవ్రమౌతుంది. ప్రజల్లో పెద్ద భయ సంచలనాన్ని సృష్టించి మన ఉనికి లేకుండా చేయాలనుకుంటున్న వాడి కుట్రలను ఓడించాలి. మన తాహత్తు కూడ వాడికి చూపించాలి. ఎక్కడో దగ్గర వాడికి బ్రేక్ వేయక తప్పదు. ప్రజల నుండి కూడ ఈ డిమాండ్ వస్తుంది. ప్రధానంగా ఈమధ్య ట్రైబ్స్ నుండి రిక్రూట్ అయినవారు పోలీస్ టీంలను లీడ్ చేయడం దురదృష్టం. అయితే వాళ్లు మాడియా అన్న ఫీలింగ్ సానుభూతి జనాల్లో ఎక్కడా లేదు. మన క్యాంపులో కూడ పోలీసులకు గట్టి బుద్ధి చెప్పాలనీ మొత్తం కామ్రేడ్స్‌ల్లో ఉంది. మనకు ఆయుధాల అవసరమూ వుంది".

రుషి మధ్యలో ఆగేసరికి "మీటింగ్ ఆలస్యం అవుతుందేమో వంట డ్యూటీ చెప్పుతారా కామ్రేడ్స్" అని మధ్యలో కలిగించుకుంది జైని.

"అవసరం లేదు జైనక్కా! మేం దారిలో చెప్పే వచ్చాం. అన్నం వస్తుంటుంది" అన్నాడు గాండో.

రుషి మళ్లీ ప్రారంభించాడు.

"కామ్రేడ్స్,

విన్నారుకదా. మొత్తం డివిజన్ పరిస్థితిని డివిసి సీరియస్‌గా ఆలోచించింది. ప్రతి ఏరియాలోనూ కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు ఇచ్చారు. మనకీసారి ఓ అంబూష్ అప్పచెప్పారు. కనీసం కొన్ని ఆయుధాలైనా పట్టుకోవాలి. టైం కూడ ఎక్కువ లేదు, మీరేమంటారు?" అని ఆపాడు.

డుంగ, కర్పలు చటుక్కున లేచి మోకాళ్ళపై కూచున్నారు. టుగ్గి విజిల్ వేశాడు. సీదో, మీనోక్కలు ఒకేసారి "ఇక చేసుడే మళ్ళీ అభిప్రాయం లేదు" అని లేచి కూచున్నరు.

రుషి నవ్వుతూ "కూచోండి కామ్రేడ్స్! కాసేపాగండి. ఇంకా మాట్లాడేదీ ఉంది కదా"—అన్నాడు.

"మన డివిజన్‌లో కూడ షురూ చేసుడన్నట్టే ఇగ" అన్నాడు ఫకీర.

"నిజమే కామ్రేడ్స్. కానీ ఒక్క విషయం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఒక్క అంబుష్ ప్లాను చేసుకున్నామంటే ఇక వరుసగా దాడులే చేస్తూ ఉంటామనీ, సర్కార్ మీద మన అఫెన్స్ ప్రారంభమైందనీ అనుకోకూడదు. అలాంటి అవగాహనతో పోతే తప్పులు చేసి దెబ్బతింటాం. మనం చేసేది ఇప్పటికీ ఆత్మరక్షణ యుద్ధమే. మన బలం పెరగకముందే మనల్ని నాశనం చేయాలని విరుచుకుపడే శత్రువుకి ఆ చొరవ మిగలనివ్వకుండా దెబ్బతీయడానికీ, వాన్ని చెక్ చేయడానికీ, అంటే మన ఆత్మరక్షణ కోసమే ఇవన్నీ చేస్తాం. ఆ దృష్టితోనే మనం ఈ ఆక్షన్ ప్లాన్ చేసుకోవాలి. ఇందులో మనం ఏ మాత్రం నష్టపోకూడదు. శత్రువు చొరవను దెబ్బతీయడం, కనీసం కొన్ని ఆయుధాలు సంపాదించుకోవడం ఈ దాడి లక్ష్యం. అందులో మనం పూర్తిగా విజయం సాధించాలి. అలా చిన్న చిన్న విజయాలు ఖచ్చితంగా సాధిస్తూ పోతే క్రమంగా మన బలం పెరిగి శత్రువును దెబ్బతీసి ఓడించే స్థితికి మనం పెరుగుతాం. ఇది ఎప్పుడూ మనం గుర్తుపెట్టుకోవాలి" అని రుషి వివరించాడు.

అందరూ ఒక్కసారే "అలాగే చేద్దాం—చేద్దాం" అన్నారు.

"కామ్రేడు నీవు వివరాలు చెప్పు" అంటూ గాండో వైపు తిరిగాడు రుషి.

"కామ్రేడ్స్,

అపాయింట్‌మెంటు నుండి తిరిగి వస్తూ మేము స్థలం చూసి కొంత సర్వే కూడ చేసి వచ్చాం. అక్కడికి వెళ్ళాక ప్లాను వివరాలు మాట్లాడుకుందాం. అక్కడ పెట్రోలింగ్ రెగ్యులర్‌గా ఉంది. భోజనం చేయగానే బయల్దేరి డుంగ, ఉల్గేలు జెలిటిన్, ఎక్స్‌ప్లోడార్స్ తేవాలి. కర్పు, ఫకీరలు వెళ్ళి మన సంఘం దాదలను కొందరిని తెస్తరు. డెన్ సామానులు, గంజులు కూడ తేవాలి. మిగతావాళ్ళు పగటికి బయల్దేరి ఆ స్థలానికి పోదాం. సామానులు/మనుషులు వచ్చాక మళ్ళీ కూచొని ప్లాను మాట్లాడుకుందాం" అని వివరిస్తుండగా అన్నం గంజులతో ఊరి దాదలు వచ్చారు.

"టిఫిన్ తొందరగా తయారవుదాం. మరి లేద్దామా" అన్నాడు రుషి.

అందరూ ఉత్సాహంగా భోజనాలపై బడ్డారు.

× × × ×

'ఇర్కా కస' దగ్గరికి దళం చేరేసరికి ఉదయం తొమ్మిదైంది. దారిలో ఊర్లు తగలకుండా అడవిలో అడ్డంపడి నడుస్తూ వెంట తెచ్చుకున్న సద్ది ఆ రాత్రికి తిని పుంజులు కూసే వేళకు బయల్దేరి ఏకధాటిగా నడవడంతో దళం అక్కడికి చేరుకుంది. కిట్లు దించుకొని ముఖాలు కడుక్కొని దళం అలసట తీర్చుకునేసరికి కర్వ, ఫకీరలు దాదలను, సామానులను వెంటపెట్టుకొని చేరుకున్నారు. వెంటనే పొయి రాళ్ళు పెట్టి వంట ప్రయత్నాలు ప్రారంభమైనాయి.

వంటయ్యేలోపు రుషి, గాండోలు గ్రామ రక్షక దళం వారిని పక్కకు తీసుకెళ్ళి సర్వే వివరాలు మరింత లోతుగా తెలుసుకోసాగారు.

ఈలోగా డుంగ, ఊర్గేలు సామానులతో దిగారు. రుషి, గాండోలు వచ్చిన వారు తెచ్చిన సామానులు చూసుకోవడంలో మునిగిపోగా మిగిలిన కామ్రేడ్స్ అందరూ తిండ్లు కానిచ్చారు.

వార్తలు విని రేడియో బంద్ చేసి, దళాన్ని సమావేశపరిచాడు రుషి. గ్రామ రక్షక దళం వారు కూడ కూచున్నారు.

"కామ్రేడ్స్,

లంగరు గూడెం నుండి కొత్తూరు పోయే బళ్ళ బాట ఇక్కడికి ఓ కోసు ఉండవచ్చు. మన అందరం చూసిందే అది. లంగరు గూడెం క్యాంపు వాళ్ళు ఈ ఏరియాలో చురుగ్గానే పెట్రోలింగ్ చేస్తూ కూంబింగ్ కూడా చేస్తున్నారు. ఇక్కడ 3, 4 గ్రామాల్లోని సంఘం దాదలు వాళ్ళ రాకపోకల్ని రోజు చూస్తూనే వున్నారు. ఇపుడు మన ఆక్షన్ ప్లేస్ అదే. ఆ జాగ మనం అనేక మార్లు చూసించే. అయినా ఆక్షన్ కోసం ఆ జాగ ప్రతి అంగుళం మనం క్షుణ్ణంగా సర్వే చేసి అర్థం చేసుకోవాలి. అయితే ఇపుడు అక్కడికి పోను సాధ్యం గాదు. ఇక్కడ నక్ష వేసుకొని వివరాలు అర్థం చేసుకుందాం రేపు మబ్బులో లేచి ఆ గ్రౌండు అంతా పరిశీలించుకొని పొద్దెక్కేసరికల్లా ఎవరి పొజిషన్స్ వారు తీసుకోవచ్చు" అంటూ రుషి లేచి నిలబడ్డాడు. నేలపై కర్రతో గీస్తూ

"కామ్రేడ్స్,

పెద్దవాగు గడ్డెక్కి కొద్దిగ నడిస్తే 'ఊడలమర్రి' చెట్టుంది కదా. అక్కడి

నుండి 100-120 గజాల దూరం పోతే కన్నూరుకు పోయె కాలిబాట ఉంది చూడండి. అగో ఆ మధ్య జాగా మనం అంబుష్‌కు సెలెక్ట్ చేసుకుంటున్నాం. ఆ తోవకు కుడివైపు బండలున్నాయి గదా. అగో. అక్కడ మనం ఉండాలి. అయితే ఇదే వాగు కొద్దిగ వంక తిరిగి బాగా కోసి పెద్ద కయ్య అయింది. ఆ తోవకు వచ్చేటోడు ఎడమ దిక్కు ఉరికితే కయ్యల పడుడు ఖాయం.

గత నెల రోజుల నుండి లంగరు గూడెం క్యాంపు వాళ్ళు ఆ బాట వెంబడే ఒక్కోసారి జీపులో, ఒక్కోసారి నడిచి పెట్రోలింగ్‌కు తిరుగుతున్నట్టు మనకు ఖచ్చితమైన సమాచారం ఉంది. కనుక ఆ బండల వెనుక మనం 'అస్సాల్టు పార్టీ' మాటుగాసి కనీసం 70 గజాలు కిల్లింగ్ గ్రౌండ్‌ను కవర్ చేసినా కూడ వాళ్ల రెండు జీపుల్లో వచ్చినా, లేదా 15, 20 మంది కాలినడకన వచ్చినా ఆ కిల్లింగ్ గ్రౌండ్ నుండి బయట పడడం వాళ్ళ తరంగాదు.

మన అస్సాల్టు పార్టీకి అవతలి వైపు, బాటకు ఎడమ ప్రక్కన మన 'స్టాప్ పార్టీ' కవర్లో వుంటే శత్రువు 'కిల్లింగ్ గ్రౌండు' నుండి బయటపడి అటువైపు 'నాచురల్ డెడ్ గ్రౌండు'లో అంటే ఆ కయ్య వైపు పరుగెట్టినా మన స్టాప్ పార్టీ వారిని ఖతం చేయగలుగుతుంది.

మర్రిచెట్టుకు అవుతల బోరుమీద మన స్కౌట్ పార్టీ ఉంటే శత్రువు బాట వెంట వచ్చి వాగులోకి దిగేటపుడే వీళ్ళకి స్పష్టంగా కనపడుతుంది. ఎందరొస్తున్నరో, ఎట్లా వస్తున్నారో వివరాలతో సహా ఖచ్చితంగా అంచనా వేసుకోవచ్చు. స్కౌట్స్ నుండి అస్సాల్ట్ పార్టీ కమాండర్ వరకు సులభంగానే కనెక్షన్ పెట్టుకోవచ్చు. కనుక శత్రువు ఎంటరయిన 'సిగ్నల్' వెంటనే అందుతుంది.

అలాగే సెకండ్ స్కౌట్ పార్టీ కన్నూరు కాలిబాటను కవర్ చేస్తూ ఉంటే, ఊహించని శత్రువు ఎదురైనా వాళ్ల మనల్ని అలర్ట్ చేయగలుగుతారు. ఇటు 'ప్రైమరీ పోస్టుకి' అంటే బోరు మీది స్కౌట్లకి, అటు 'సెకండరీ పోస్టు' అంటే కన్నూరు బాట దగ్గర మన వాళ్లుండే స్థలానికి మధ్య కనీసం 120 గజాలుంటుంది.

బండల కవరులో కూచుని ఉండే అస్సాల్టు పార్టీ కమాండర్‌కు మొత్తం గ్రౌండు, దారి స్పష్టంగా కనపడుతుంది. అస్సాల్టు పార్టీలోని వారు అందరికి బండల కవరు చాలా సహజంగా ఉండడం వలన ఎవరి 'ఫైరింగ్ ఆర్క్'లో వారు శత్రువును స్పష్టంగా చూడగలుగుతారు. అలాగే ఆ ప్రదేశం బాట కంటే ఎత్తులో ఉండటము

వల్ల ఆ బాటలో వచ్చే శత్రువు దూరంలో ఉండగానే ఇన్‌ఫ్లేటెడ్ పొజిషన్‌లోనూ, దగ్గరగా వచ్చినపుడు డిఫ్లేటెడ్ పొజిషన్‌లో కూడ స్పష్టంగా కనిపిస్తూ మన దృష్టి నుండి తప్పించుకుపోలేడు.

అంతేగాక బండల వెనుక నుండి ఇటు బాటలోకి రావలసిన అవసరం లేకుండా, అటు మర్రి వైపు పోవలసిన పని లేకుండా అటునుంచి అటే అడవిలోకి తప్పుకోడం చాలా తేలిక. అందువల్ల ఏ క్షణంలోనైనా కాషన్ (సిగ్నల్) వస్తే 'విత్‌డ్రా' కావడానికి గానీ, అత్యవసర పరిస్థితుల్లో 'రిట్రీట్' కావడానికి కూడ ఆ ప్రదేశం చాలా అనువుగా ఉంటుంది.

ఇపుడు గ్రౌండు పొజిషన్ గూర్చి అనుమానాలు లేవనుకుంటా" అంటూనే, "కామ్రేడ్స్

అందరు తుపాకులు క్లీన్ (శుభ్రం) చేసుకొండి. తూటాలు చూసుకొండి. గ్రెనేడ్స్ అన్నీ దొంగ దాదకు ఇస్తే ఇగ్నిషన్ సెట్స్ చెక్ చేసి ఇస్తాడు.

ఉదయాన్నే మనం పోంగ నేను ఆర్‌వి పోస్ట్ చూయిస్తాను అందరు గుర్తు పెట్టుకొండి. ఏమైనా అందరం అక్కడ కలుసుకోవాలి. ఎవరైనా తప్పితే ఇక్కడికి వచ్చి ఇక్కడుండే కామ్రేడ్‌ను కలవాలి. మీ వెంట కాగితాలు, ఇతర సామానులేమి పెట్టుకోకండి. కిట్టు ఇక్కడే పెట్టాలి''.

"అట్లే మరో రెండు గంటల్లో వంట అయిపోతే తిని రెస్టు తీసుకొండి. ఉదయాన్నే 4 గంటలకు లేస్తేగానీ తెల్లారే వరకు పోయి వివరంగా అన్నీ చూసుకొని సిద్ధంగా ఉండలేము'' అంటూ రుషి మైన్స్ నింపడానికి పోయాడు.

× × ×

ఉదయం ఆరు కావస్తుంది. అప్పుడే ఎండ పెచ్చబడడం ప్రారంభమైంది. దళం అంతా గ్రౌండు, పొజిషన్స్ చూసుకొని ఎవరి స్థలాల్లో వారు ఫిక్స్ అయ్యారు. రుషి చివరిసారిగా అన్ని పొజిషన్స్‌ను చెక్ చేసుకొని వచ్చి ఎస్సాల్టింగ్ పార్టీ కమాండరింగ్ పొజిషన్‌లో సర్దుకొని కూచున్నాడు. తనకు కుడిప్రక్కన ఉన్న స్విచ్ బోర్డు కనెక్షన్స్ ఫైనల్‌గా సరిచూసుకొని సిగ్నల్ కోసం పెట్టుకున్న నైలాన్ తాడు ముడిని ఎడమ చేతికి తగిలించుకొని స్థిరంగా కూచున్నాడు.

అడివంతా నిశ్శబ్దం. ఎగిరే పక్షులు, పారే నీళ్ళ సవ్వడితో పాటు ఎవరి ఊపిరి వారికి స్పష్టంగా వినపడుతుంది.

అందరి చూపులు ఎదురుగా ఉన్న టార్గెట్స్ మీద, అందరి మనసులు తమ చేతుల్లో పడనున్న శత్రువుమీద లగ్నమై ఉన్నాయి.

ఎన్నాళ్ళనుండో కలలు కంటున్నట్టు ఈ రోజు శత్రువుమీద గట్టి దెబ్బ తీయడానికి అవకాశం వచ్చినందుకు ఉత్సాహం అందరిలో ఉరకలేస్తుంది.

క్రమంగా ఎండ వేడి పెరుగుతుంది. శత్రువు కోసం నిరీక్షణలో టెన్షన్ పెరుగుతుంది. వాడి జాడ, సవ్వడి ఎక్కడ వినబడటం లేదు.

అప్పుడే మూడు గంటలు దాటిపోయింది. రుషి అప్రయత్నంగా వాచివైపు చూసుకున్నాడు. 9.15 కావస్తుంది. "క్రిందటిసారి ట్రైనింగ్ క్యాంపుకు పోయి వచ్చినప్పటి నుండి బీడీలు మానుకోవడం ఎంత మంచి పని అయ్యింది" అని తనను తనే అభినందించుకుంటున్నాడు.

ఉన్నట్టుండి ఎడమ చేయి తాడు లాగినట్టయ్యింది.

"ఎక్కడా వెహికల్ శబ్దం వచ్చినట్టు కాలేదే" అనుకుంటూ చెవులు రిక్కించేంతలో ఈసారి మరింత స్పష్టంగానే తాడు చేయిని లాగింది.

తక్షణమే రుషి లోగొంతుకతో ఇష్....ఇష్ మని శబ్దం చేస్తూ తన వెనుక నున్న బాడీగార్డుకి 'రిలే సిగ్నల్' అందించాడు. వెను వెంటనే బాడీగార్డు రిలే సిగ్నల్‌ను 'రిపీట్' చేయడం రుషికి వినపడింది. చూపు తిప్పకుండా రుషి బాటనే పరిశీలిస్తున్నాడు. 'అంటే ఇవాళ జీపు రావడం లేదన్నమాట' అనుకుంటుండగానే పోలీసు పార్టీ పైలట్స్ కంటపడ్డారు. కొన్ని సెకండ్ల అంతరంలో మూడోవాడు కంట పడ్డాడు.

మూడు, నాలుగు, ఐదు, ఆరు స్విచ్ బోర్డుపై చేయి ఆనించి రుషి కన్నార్పకుండా చూస్తూ లెక్కపెడుతున్నాడు.

మొదటివాడి పొజిషన్ అంచనా వేస్తున్నాడు. పోలీసు పైలట్స్, సెకండరీ స్కౌట్స్ ఎదుటికి రావడానికి ఇంక కొద్ది సెకండ్సే ఉండవచ్చు.

రుషి మైన్స్ స్విచ్ నొక్కేసాడు. ఒక్కసారి చెవులు చిల్లులు పడ్డాయి. బాట మధ్యలో గ్రౌండ్ మైన్ పెద్ద శబ్దంతో పేలింది. ప్రతిధ్వనితో పెనవేసుకుంటూనే క్లైమోర్ చార్జ్ పెద్ద శబ్దంతో పేలిపోయింది. వచ్చే పోలీసులకు ఎదురుగా బాట కుడి ప్రక్కన ఉన్న మద్దిచెట్టు మాను నుండి రాళ్ళు, నిప్పులు వర్షం కురిసినట్టు క్లైమోర్ చార్జి నుండి పోలీసులపై ఇనుప మేకుల వర్షం కురిసింది.

దబ దబ దబ మని నేలమీద పడిపోయిన పోలీసులు కొద్ది సెకనులు ఆగి తల లెత్తారు. ఒకరిద్దరు కవరు కోసమన్నట్టు బండలవైపు కదలబోయేసరికి బండల్లోనుండి ఒక్క పెట్టున ఫైరింగ్ స్టార్టయ్యింది. రెండు నిముషాలపాటు ఊపిరి సలుపకుండా శత్రువుమీద గుళ్ళ వర్షం కురిసింది. 'స్ప్రింగ్ ఫైరింగ్' జరుగుతుండగానే శత్రువు వైపునుండి మూడు, నాలుగు రౌండ్లు కాల్పులు వచ్చాయి. కానీ అంతటితోనే అటు ఫైరింగ్ ఆగిపోయింది.

మరో నిముషంలో కమాండర్ 'లాంగ్ విజిల్' వినవచ్చింది. బండల్లో నుండి జరుగుతున్న ఫైరింగ్ వెంటనే ఆగిపోయింది.

అంతా నిశ్శబ్దం. ఎవరి గుండె చప్పుడు వారికి వినబడుతుంది.

1-2-3 నిముషాలు గడిచిపోతున్నాయి. రుషి వాచి చూసుకున్నాడు. ఫైరింగ్ ఆగిపోయి 10 నిముషాలు దాటుతుంది.

'సీజింగ్ పార్టీ'కి కాషన్ ఇవ్వబోతూ కిల్లింగ్ గ్రౌండ్ వెరిఫికేషన్‌కై అడ్వాన్స్ అయ్యేముందు అరగంట లేట్ చేసినా నష్టం లేదంటూ డి.వి.సి.ఎస్ పదే పదే చెప్పిన జాగ్రత్తలు గుర్తుకు రాగా వెంటనే 'గ్రెనేడ్ చార్జ్' అంటూ డుంగకు కేక పెట్టాడు.

కాషన్ వెను వెంటనే నిమిషం తేడాతో రెండు గ్రైనేడ్లు పేలి అడివంతా దద్దరిల్లింది.

మరో ఐదు నిముషాలు నిశ్శబ్దం.

ఉన్నట్టుండి 'సీజింగ్ పార్టీ అడ్వాన్స్' అనే కాషన్ మారుమోగింది.

గాండో, డుంగ, గిరిజ, జైని, కర్పలు బండల మాటునుంచి లేచి ముందుకు కదిలారు.

కవర్ టు కవర్ అని రుషి మళ్ళీ కాషన్ ఇచ్చేసరికి వారంతా బెండింగ్ పొజిషన్‌లో అలర్ట్‌గా రాళ్ల మధ్యనుండి చెట్ల వెనుక నుండి అడ్వాన్స్ అయి పోయారు.

మరో ఐదునిముషాల్లో 'గ్రౌండ్ క్లియర్' అంటూ గాండో విజయోత్సాహంలో పెట్టిన గావు కేకతో కయ్యవైపు నుండి స్టాప్ పార్టీ, బండలవైపు నుండి మిగతా ఎస్సాల్ట్ పార్టీ ఒకేసారి గ్రౌండులోకి పరుగుతీశారు.

కమాండర్ రుషి, బాడిగార్డు ఉర్గె తమ పొజిషన్స్‌లోనే నిలబడి గ్రౌండ్‌లో కోలాహలాన్ని ఆత్రుతగా చూస్తున్నారు.

మరణం కూడ అపహరించబడిన చోట...

ఎన్. వేణుగోపాల్

నిత్యం కలిసి తిరిగే మనిషి హఠాత్తుగా అదృశ్యమైపోవడం ఎంత దారుణం? ఆ మనిషి కుటుంబ సభ్యుడు కావచ్చు. స్నేహితుడు కావచ్చు. పోరాటంలో తోడు నిలిచిన వ్యక్తి కావచ్చు. పోరాటంలోకి నడిపి నాయకత్వం వహించిన వ్యక్తి కావచ్చు. కేవలం పరిచయస్తుడే కావచ్చు. ఆడో, మగో ఎవరయినా సరే. ఒక స్నేహం లోంచి, ఒక అనుబంధం లోంచి, ఒక పరిచయం లోంచి అవతలి మనిషి అకస్మాత్తుగా మాయమై పోవడం గుండెలు పిండేసే అనుభవం.

మనిషి మరణించి అదృశ్యమయితే ఎక్కడో ఒక సమాధి ఉంటుంది. ఏవో కొన్ని స్మృతులు మిగిలి ఉంటాయి. కనీసం ఒక మరణించిన రోజు ఉంటుంది తలచుకోవడానికి. మనిషి తనకు తానే తెలిసి తెలిసీ అజ్ఞాతంలోకి పోతే ఎక్కడో ఒక చోట కలుస్తాడు. ఏదో ఒక సంబంధం కొనసాగుతుంది. మనిషి కనబడకపోయినా ఆ సృజనాత్మక శక్తి వికాసం కనబడుతుంటుంది.

కాని ఆత్మీయులను శత్రువు ఎత్తుకుపోతే, మాయం చేస్తే, వాళ్ళ కోసం వెతికే దెక్కడ? చట్ట బద్ధపాలన అనేదానికి అర్థం లేకుండా పోయి, ఏలిన వాళ్ళు తమ

గ్రౌండ్ నుండి "రిట్రీట్" అనే గాండో కాషన్‌తో కోలాహలం సద్దుమణిగింది.

కామ్రేడ్స్ అందరూ రెండేసి, మూడేసి తుపాకులు అదనంగా భుజాలకేసుకొని, బ్యాగులు, బెల్ట్‌లు, టోపీలు చంకన పెట్టుకొని హడావిడిగా కమాండర్ వద్దకు చేరుకున్నారు.

షైట్స్‌ను విత్‌డ్రా కమ్మని కాషన్ యిస్తూనే 'సీజింగ్ పార్టీ'ని వెంటేసుకొని కమాండర్ రిజర్వు పార్టీ వైపు దారి తీశాడు.

క్షణాల్లో ఆక్షన్ ప్లేస్ అంతా నిర్మానుష్యం అయింది.

మొత్తం దళాన్ని వెంటేసుకొని రుషి ఇర్సు కసకి అడ్మినిస్ట్రేటివ్ పాయింట్ కి చకచక సాగిపోయాడు.

(ఇంకా ఉంది)

అదుపులోకి తీసుకున్న వ్యక్తుల గురించి మౌనం వహిస్తే అడగవలసిందెవరిని? ఏ చట్టం ప్రకారం, ఏ నేరారోపణతో అరెస్టు చేశారో చెప్పవలసిన యంత్రాంగం మనుషుల అస్తిత్వం గురించే మూగనోము పడితే ఫిర్యాదు చేయవలసిందెవరికి? అదుపులోకి తీసుకున్న మనుషులను చంపివేసి ఉంటే, ఏ రోజు, ఎక్కడ, ఎట్లా చంపారో, ఎక్కడ ఖననం చేశారో, ఎక్కడ దహనం చేశారో ఆత్మీయులకైనా చెప్పని దుర్మార్గ పాలన సజావుగా సాగుతుంటే మానవత్వానికి అర్థం ఏమిటి?

బతికి ఉన్న మనిషికే కాదు, చనిపోయిన మనిషికీ, మృతదేహానికీ హక్కులుంటాయి. శవాన్ని గౌరవంగా చూడాలి. శవాన్ని జంతువుల పాలు గాకుండా చూడాలి. కుళ్ళిపోయి అనారోగ్యం వ్యాపించకుండా మట్టిలో కలిసిపోయేలా చూడాలి. అగ్నిలో దగ్ధమయ్యేలా చూడాలి. ఆత్మీయులకు చివరి చూపు అందనివ్వాలి. ఇదంతా మతాచారాలు బోధించే కర్మకాండ కాదు. మానవ సంబంధాల కనీస కర్తవ్యం.

కాని మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేయదలచిన రాజ్యహింస అమలయ్యే చోట ఇవేవీ ఉండవు. నలుగురితో మాట్లాడే మనిషిని, గల గల నవ్వే మనిషిని, ఆరుగాలం శ్రమించే మనిషిని, అన్యాయాన్ని ధిక్కరించే మనిషిని రాజ్యరక్షకులు హఠాత్తుగా ఒక రోజు ఎత్తుకుపోతారు. ఆ ఎత్తుకు పోయేటప్పుడు చూసిన చూపే చివరి చూపవుతుంది. ఆ తర్వాత ఆ మనిషి బతికి ఉన్నాడా చనిపోయాడా చెప్పే వాళ్లుండరు. ఏ నేరారోపణ కింద ఏ చెరసాలలో మగ్గుతున్నాడో చెప్పే వాళ్లుండరు. ఒక 'అబద్ధపు' ఎన్‌కౌంటర్‌లో చచ్చిపోయాడనే ప్రకటనైనా రాదు. ఆయన మృత దేహం ఎక్కడ జంతువులకు ఆహారం అయిపోయిందో, ఏ నేలలో కలిసి ఆత్మీయుల కోసం ఎదురు చూస్తోందో, ఏ నిప్పులో దగ్ధమైపోయి ఆశయ సాఫల్యం కోసం గాలిలో వ్యాపిస్తోందో ఎవరికీ తెలియదు.

ఇటువంటి 'అదృశ్యాల' కథ తెలుగు నేలలో 1984లో కొడవటి సుదర్శన్‌తో ప్రారంభమై 1988లో ఐలయ్య, రాజమల్లుల ఉదంతంతో పెద్ద ఎత్తున ప్రచారంలోకి వచ్చింది. ఐలయ్య, రాజమల్లుల పోలీసు కస్టడీ నుంచి 'మాయం' కావడంపై విచారణ ప్రారంభించిన టి. ఎల్. ఎన్. రెడ్డి కమీషన్ విచారణ క్రమంలో ఇంకా కనీసం 45 మంది ఇట్లాగే మాయమయ్యారని గుర్తించింది. ఇంకా లెక్కకు రాని అదృశ్యాల సంఘటనలు ఎన్ని ఉన్నాయో తెలియదు.

లాటిన్ అమెరికా దేశాల్లో, నియంతల పాలన కింద ఇటువంటి అదృశ్యాలు

లెక్కలేనన్ని జరుగుతూ ఉన్నాయి. ఇటువంటి పద్ధతి 1966 తర్వాత గౌటిమాలాలో మొదలయింది. 1973 చివరిలో అలెండీని కూలదోసి సైనిక నియంత పినోచెట్ చిలీలో అధికారానికి వచ్చిన తర్వాత అక్కడ విపరీతంగా అమలయింది. 1976 మార్చి నుంచి కనీసం ఒక దశాబ్దం పాటు అర్జెంటీనాలో అమలయింది. లాటిన్ అమెరికన్ దేశాలన్నిటిలోనూ ఏదో ఒక స్థాయిలో ఈ పద్ధతి కొనసాగుతూనే ఉంది. చిలీలో 1973 సెప్టెంబర్ 11న సైనికకుట్ర జరిగితే ఆ నెలాఖరు నాటికే మూడువేల మంది అదృశ్యం చేయబడ్డారు. ఆ తర్వాత కనీసం నెలకు నాలుగువందల మందిని పట్టుకు పోయి అదృశ్యం చేశారని తెలుస్తోంది. 1986 నాటికే ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వేసిన అంచనాల ప్రకారం అప్పటికి గడిచిన పది–పదిహేను సంవత్సరాలలో లాటిన్ అమెరికన్ దేశాల లోని సైనిక ప్రభుత్వాలు 90 వేల మందిని అదృశ్యం చేశాయి.

అదృశ్యం చేయడమంటే పోలీసులో, సైనికులో, మఫ్టీలో ఉన్న వ్యక్తులో ఒక వ్యక్తిని వీధిలో నుంచో, ఇంట్లో నుంచో, సినిమాహాలు నుంచో, హోటల్ నుంచో ఎత్తుకుపోవడం. ఆ క్షణం నుంచి ఇక ఆ వ్యక్తి భూమి మీది నుంచి అదృశ్యమై పోతాడు. చిన్న మెత్తు జాడ కూడ ఉండదు. అంటే అదృశ్యమైన వ్యక్తి గురించి సమాచారమంతా మాయమైపోతుంది. అటువంటివాళ్ళ గురించేమీ తెలియదు. వాళ్ళకు ఏమైంది ? బతికుంటే, వాళ్ళెక్కడున్నారు ? ఏ బాధలు అనుభవిస్తున్నారు ? చనిపోయి ఉంటే, కనీసం వాళ్ళ ఎముకలు ఎక్కడున్నాయి ?

మనుషుల అదృశ్యాల ఘటనల మీద మొట్టమొదటి విస్తృతమైన విచారణ అర్జెంటీనాలో జరిగింది. అక్కడ సైనిక పాలన అంతమైపోయి, ప్రజాస్వామికంగా అధ్యక్షుడు అల్ఫోన్సిన్ అధికారంలోకి వచ్చిన తర్వాత, నవలా రచయిత ఎర్నెస్టో సాబటో నాయకత్వాన ఒక విచారణ సంఘాన్ని నియమించాడు. సాబటో కమిషన్ రెండు సంవత్సరాల విచారణ తర్వాత ఒక వివరమైన నివేదిక ప్రకటించింది. ఈ నివేదిక ఆధారంగా బాధ్యులైన సైనిక అధికారుల మీద కోర్టులలో విచారణలు జరిగి, యావజ్జీవ శిక్షలు కూడ పడ్డాయి. ఎత్తుకుపోయిన వ్యక్తులను చచ్చిపోయేలా చిత్ర హింసలు పెట్టారని, ఆ మృతదేహాలనో, కొన ఊపిరితో వున్న మనుషులనో కనబడ కుండా మాయం చేశారని సాబటో కమిషన్ తేల్చింది. మృతదేహాలన్నిటినీ ఒకే చోట సామూహికంగా గోతుల్లో పడేశారని, అటువంటి కొన్ని సామూహిక ఖనన

స్థలాలను తవ్వి తీసి, కమిషన్ ప్రకటించింది. లేదా, హెలికాప్టర్ల లోంచి మృత దేహాలను నదులలోనో, సముద్రంలోనో పడేశారని కూడ కమిషన్ చెప్పింది.

నిజానికి సాబటో కమిషన్‌ను నియమించడానికన్న చాలముందే అర్జెంటీని యన్ మహిళలు అదృశ్యాల గురించి ఆందోళన చేయడం ప్రారంభించారు. 1979లో కొందరు మహిళలు తమ కొడుకులను సైనికులు మాయం చేశారన్న విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకురావడం మొదలెట్టారు. వాళ్ళు ప్రతి గురువారం మధ్యాహ్నం తలలకు తెల్ల రుమాళ్ళు చుట్టుకునో, చేతుల్లో వెలుగుతున్న కొవ్వొత్తులు పట్టుకునో అధ్యక్షుని భవనం ముందర ప్రదర్శన చేసేవారు. వాళ్ళ చేతుల్లో తప్పనిసరిగా సైనికులు మాయం చేసిన తమ కొడుకుల, మనవల ఫొటోలు పట్టుకునేవారు. మొదట ప్రభుత్వం ఎవరూ అదృశ్యం కాలేదనీ, ఈ స్త్రీలు పిచ్చివాళ్ళనీ ప్రకటిం చింది. కాని ఆ పిచ్చి స్త్రీలు అధ్యక్షభవనం ముందర ప్రదర్శన విరమించుకోలేదు. అదృశ్యమైన ప్రతి వ్యక్తి గురించీ వివరాలు బయటపడేదాకా, బాధ్యుడైన ప్రతి సైనికుడూ శిక్షించబడేదాకా అక్కడ్నించి కదిలేది లేదని ప్రకటించారు.

అదృశ్యమైన తమ కొడుకుల గురించీ, కుటుంబ సభ్యుల గురించీ చిలీ మహిళలు చేసిన ఆందోళనలు, వాళ్ళు చేపట్టిన నిరసన రూపాలు వినూత్నమైనవి. అగస్టినో పినోచెట్ సైనిక నియంతృత్వం కింద ఏ ఆందోళనకూ అవకాశం లేనప్పుడు, ప్రతి ప్రతిఘటనా స్వరాన్నీ ప్రభుత్వం కర్కశంగా అణచివేస్తూ ఉన్నప్పుడు చిలీ మహిళలు అసాధారణమైన వ్యక్తీకరణలను ఎంచుకున్నారు. భయాన్ని ధిక్కరిం చారు. నియంతృత్వపు కోరల్లో చిక్కిన తమ ఆప్తుల్ని వెదికే ధైర్యం తెచ్చుకు న్నారు. మాట్లాడారు, ఆలోచించారు, సంఘటితమయ్యారు. సామూహికంగా కొన్ని పనులు చేశారు. "ఇక నేరస్తుల మీద తీర్పు చెప్పాలి. నిర్దాక్షిణ్యంగా తీర్పులు చెప్పాలి. ఆ రకంగా బాధ్యులైనవాళ్ల శిక్షించబడాలి. ఇప్పటిదాకా జరిగిన మారణ కాండ ఇక జరగకుండా ఉండాలి. కొన్ని సంవత్సరాల కింద ఉన్నట్టుగా మేం మళ్ళీ ప్రజాస్వామ్య దేశంగా మారిపోయాక ఇది జరుగుతుంది. చంపని, చిత్రహింసలు పెట్టని, మారణకాండలు జరపని ఒక ప్రభుత్వం రావాలి. ఆ దేశంలో సోదరత్వం వెల్లివిరుస్తుంది" అని ఆ స్త్రీలు ప్రకటించారు.

వేలాదిమంది వ్యక్తులు అదృశ్యమైపోయిన చిలీలో ఈ విషాదం దాదాపు ప్రతి కుటుంబానిదీ. అదృశ్యమైపోయినవాళ్ళ సైనికుల చేతుల్లో ఎన్ని హింసలు

అనుభవించి, ఎంత దారుణంగా హతమైపోయారో గాని, మిగిలి ఉన్న కుటుంబ సభ్యులు అనుభవించే వేదనా అంతటిదే. కుటుంబంలో ఒక సభ్యుడు మాయమైన తర్వాత మనుగడ సాగించడమంటే అది భయంకరమైన వేదనను అనుభవించడమే. తోటి మనిషి అదృశ్యమయ్యాడనే వాస్తవంతో జీవించడమంటే శాశ్వతంగా ఒక ఖాళీతో, ఒక శూన్యంతో, ఒక అనిశ్చితతతో జీవించడమే. ఊగిసలాటలో జీవించడమే. మేజోళ్లు అల్లుతూనే ఆ మేజోళ్లు ఉద్దేశించబడిన మనిషి తిరిగి రాకపోవచ్చునని గుర్తించడం లాంటిదది. వాళ్లు వీధిలో లేకపోయినా చుట్టు పక్కలెక్కడా లేకపోయినా, వాళ్ళ ఉనికి ప్రతిచోటా గుర్తించబడడం లాంటిదది. వాళ్లు స్పృశించిన వస్తువుల్లో వాళ్ళ ఉనికి ఉంటోంది. వాళ్ళు చదువుతూ చదువుతూ తెరిచి పెట్టిపోయిన పుస్తకం ఎదురుచూపులో వాళ్ళ ఉనికి ఉంటుంది. వాళ్ళ గురించి తెలిసిన ఇరుగు పొరుగు వాళ్ళు, ఇదిగో ఈ ఇంట్లోనే వాళ్ళుండేవాళ్లు, అదిగో ఆ మూల మీది నుంచే వాళ్ళను పట్టుకుపోయారు అంటారు. సజీవంగానో, నిర్జీవంగానో వాళ్ళు ఎక్కడో ఒక చోట ఉండి ఉంటారని అందరికీ తెలుసు.

అయితే ఈ ఒంటరితనం, నిస్సహాయత, శూన్యం, అనిశ్చితత, అన్యాయం నిండిన గాథను వాళ్లు లోలోపల మింగుకోలేదు. సకల ప్రపంచానికీ చెప్పదలచుకున్నారు. గొంతెత్తదలచుకున్నారు. సత్యంకోసంఅన్వేషించదలచుకున్నారు. సత్యాన్ని ఎట్లాగైనా సరే కనిపెట్టాలని నిర్ణయించుకున్నారు. అతి క్రూరమైన నియంతృత్వం అమలయ్యేచోట ఒక అసాధ్యమనిపించే కర్తవ్యాన్ని వాళ్ళు ఇష్టంగా, సాహసికంగా స్వీకరించారు. ఈ క్రమంలో వాళ్ళు చేపట్టిన కొన్ని పనులు మత పరమైనవో, అమాయకమైనవో అనిపించవచ్చు. కాని ఆ పనులే, ఆ ఆందోళనలే చిలీ రాజకీయ సాంఘిక చరిత్ర పైనా, అంతర్జాతీయ మానవ హక్కుల ఉద్యమం పైనా గాఢమైన ప్రభావం వేశాయి. వేస్తున్నాయి.

1978 నుంచి చిలీ రాజధాని శాంటియాగోలో ఈ మహిళల ప్రతీకాత్మక చర్యలు మొదలయ్యాయి. సమాజంలోంచి కొందరు వ్యక్తుల్ని రాజ్యం అదృశ్యం చేసిందని సమాజానికి తెలియజెప్పడం, అదృశ్యమైనవాళ్ళకు బహిరంగంగా నివాళులర్పించడం, వాళ్ళ స్మృతిని సజీవంగా ఉంచడం ఈ చర్యల లక్ష్యాలు. 1979లో ఈ మహిళలు సుదీర్ఘ కాలంపాటు నిరాహారదీక్షలకు పూనుకున్నారు. శాంటియాగోలో

నేషనల్ కాంగ్రెస్ భవనం (పార్లమెంటు భవనం లాంటిది, పినోచెట్ అధికారానికొచ్చాక పార్లమెంటు-నేషనల్ కాంగ్రెస్-ను రద్దుచేశాడు.) చుట్టూ ముళ్ళకంచెకు తమను తాము కట్టేసుకున్నారు. మాయమైపోయిన తమ పిల్లల ఫొటోలు తమ దుస్తులకు తగిలించుకున్నారు. ఆ సంకెళ్ళ తన వేదనకు చిహ్నమనీ, తమకు తాము సంకెళ్ళ వేసుకోవడంద్వారా తమ పిల్లలు అనుభవించిన వేదనలో భాగం పంచుకుంటున్నామనీ వాళ్ళన్నారు. పిల్లల ఫొటో ఛాతీమీద తగిలించుకుంటే, సామీప్యాన్ని అనుభవిస్తున్నట్టు ఉందని వాళ్ళన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలను అరెస్టు చేసి జైలుకు పంపారు. జైల్లో బట్టలూడదీశారు. ఫొటోలు తీశారు. అనేక రకాల అవమానాల పాలుజేశారు. ఈ అన్ని చిత్రహింసలతోనూ మహిళల నిర్ణయం మరింత దృఢంగా మారింది. అదృశ్యమైన వ్యక్తుల కుటుంబాల ఆందోళన మరింత సంఘటితంగా సాగింది.

దీనికన్న ముందే ఈ మహిళల సంఘటితత్వానికి వేదిక కల్పించే ఉదంతం ఒకటి జరిగింది. శాంటియాగో సమీపంలో ఒక వట్టిపోయిన గని ఉండేది. లొంక్వేన్ అనే ఆ గనిలో ఎంతోమంది శవాలు పడేశారని 1978 నవంబర్‌లో బైటపడింది. ఈ వార్తతో 1500 మంది ప్రజలు శాంటియాగోనుంచి లొంక్వేన్ గని ముఖద్వారం దాకా మానవహారం నిర్మించారు. లొంక్వేన్ యాత్ర చిలీ మానవహక్కుల ఉద్యమ చరిత్రలో ఒక మైలురాయి అయింది.

"సజావుగా సాగుతున్నదని చెప్పుకునే సమాజంలో నా కన్నకొడుకు కోసం అన్వేషణ ఇంత కష్టంగా ఉంటుందని ఎవరైనా ఊహించగలరా ? సమాజం హఠాత్తుగా ఒక అభేద్య దుర్గంలాగ మారిపోయిందనిపిస్తుంది. దానికి ఎక్కడ చూసినా పెద్ద పెద్ద మూసిన ద్వారాలున్నట్టనిపిస్తుంది. ఆ ద్వారాల దగ్గర భటులు ఎప్పుడూ విసుగ్గా, యదాలాపంగా "ఆయనను మేం అరెస్టే చెయ్యలేదు. మాదగ్గర ఫైల్లో ఆ పేరే లేదు అంటూ ఉంటారు" అన్నది ఒక చిలీ తల్లి. విడివిడిగా చూస్తే చాల మంది మహిళలు ఆశోపహతులై ఉన్నట్టే కనిపిస్తారు. అలసిపోయినట్టు కనిపిస్తారు. 1973, 74 ల్లోనైతే ఇంకా తమ కొడుకులు, భర్తలు తిరిగి వస్తారనే ఆశ ఉండేదేమో గాని, ఇప్పుడు ఒక దశాబ్దం పైగా గడిచిపోయాక ఇక ఆ ఆశ లేదు. కనీసం ఎక్కడ ఖననం చేశారో తెలిస్తే బాగుండునని వాళ్ళ కోరిక. వ్యక్తులుగా ఇట్లా

నిస్పృహకు లోనైనా, చిలీ మహిళలు సంఘటితంగా మాత్రం ఇంకా ఆశావహంగా, సాహసికంగా ఉన్నారు.

'అసోసియేషన్ ఆఫ్ ఫామిలీస్ ఆఫ్ ది డిటెయిన్డ్-డిజప్పియర్డ్' (అరెస్టయి అదృశ్యమైనవాళ్ళ కుటుంబాల సంఘం) అనేది చిలీ మహిళలు రూపొందించుకున్న సంఘం. "సజీవంగానైనా, ఆత్మశాంతితోనైనా, వాళ్ళెక్కడున్నారో చెప్పండి" అనేది ఈ సంఘం నినాదం. ఈ సంఘంలో దాదాపు అందరూ మహిళలే ఉండడానికి కారణాలేమిటని కూడ ఆలోచించవలసి ఉంది. అదృశ్యమైంది ఎక్కువమంది పురుషులే గనుక వాళ్ళ భార్యలు, తల్లులు ఈ సంఘంలో ఉన్నారు. కొడుకులు అదృశ్యమైన చోట కూడ తండ్రులు ఈ సంఘంలో చేరినా చేరకపోయినా తల్లులు మాత్రం తప్పనిసరిగా చేరారు. పినోచెట్ ప్రభుత్వం ప్రజా ప్రతిఘటనకు, నిరసనకు అన్ని అవకాశాలనూ అణచివేసినప్పుడు ఇక స్త్రీలే తమ సాంప్రదాయిక స్థానాలను వదిలి వీధుల్లోకొచ్చారు. గృహిణిగా, ఇంటి పనిమనిషిగా ఉండిన స్త్రీ పౌర గెరిల్లాగా మారిపోయింది.

నిజానికి చిలీ మహిళలు రాజకీయ ఉద్యమాల్లో ఎక్కువగా పాల్గొన్నవాళ్లు కారు. చివరికి 1971-73 మధ్య సాల్వడార్ అలెండీ ప్రభుత్వం కూడ మహిళలపట్ల పురుషాధిక్యత వైఖరినే తీసుకుంది. ఈ వైఖరిని చూసి ప్రగతి నిరోధక శక్తులు అలెండీకి వ్యతిరేకంగా మహిళలను సంఘటితం చేశారు. అలెండీకి వ్యతిరేకంగా స్త్రీలు చాల పెద్ద ఎత్తున ప్రదర్శనలు చేశారు. ఒక రకంగా పినోచెట్ సైనిక కుట్రకు వాతావరణం అనుకూలంగా మార్చినవాళ్లు స్త్రీలే.

కాని పినోచెట్ అధికారానికి రాగానే పేద ప్రజానీకం మీద దారుణమైన అణచివేత ప్రారంభమైంది. సెప్టెంబర్ 11న సైనిక కుట్ర జరిగితే, సెప్టెంబర్, అక్టోబర్‌లలోనే 7000 మంది ప్రజల్ని సైనికులు అరెస్టు చేశారు. వారిలో చాలమంది ఏమయిపోయారో ఇప్పటికీ తెలియదు. ప్రజలమీద ఆ కాలంలో ఎంత దారుణమైన దమనకాండ జరిగిందంటే, సైనిక అధికార ముఠా సాగిస్తున్న అకృత్యాలను ఆపివేయడానికి, మానవ హక్కులను రక్షించడానికి క్రైస్తవ మతాధిపతులు ముందుకొచ్చారు. ప్రోపాజ్ కమిటీ (శాంతికోసం కమిటీ) అనేది ఏర్పడి చర్చిల ఆవరణల నుంచి మానవ హక్కుల పరిరక్షణ కార్యక్రమం చేపట్టింది. రాజ్య హింసకు గురైన

వాళ్లకు రక్షణ కల్పించడం, మనుగడ చూపించడం తన బాధ్యతగా ప్రొపాజ్ కమిటీ స్వీకరించింది. రెండు సంవత్సరాల్లోనే ప్రొపాజ్ కమిటీ కూడ ఏలినవారి ఆగ్రహానికి గురైంది. ప్రొపాజ్ కమిటీ రోజుకు కనీసం 54 మందికి ఏదో ఒక సహాయాన్ని అందించవలసి వచ్చిందని దాని రికార్డ్స్ తెలుపుతున్నాయి. 1975లో "ప్రొపాజ్ కమిటీని దేశంలో శాంతిని భగ్నం చేయడానికి, ప్రజల భద్రతను భంగపరచడానికి మార్క్సిస్టు-లెనినిస్టులు వాడుకుంటున్నారు. కమిటీని రద్దు చేయడం అవసరమని ప్రభుత్వం భావిస్తోంది" అని పినోచెట్ ఒక ఆదేశం జారీచేశాడు. ప్రొపాజ్ కమిటీ కార్యక్రమాల్లో భాగంగానే మాయమైన వ్యక్తుల కుటుంబాల సంఘం ఏర్పడింది. ఆ కుటుంబాలకు జీవిక కల్పించడం కోసం కమిటీ రూపొందించిన వర్క్‌షాపుల్లో పని చేసే స్త్రీలు ఇరవైమంది ఈ సంఘాన్ని 1973లో స్థాపించారు. ఆ సంవత్సరం ముగిసేనాటికి సంఘ సభ్యత్వం 75కు పెరిగింది.

సంఘాన్ని ఏర్పరచినవాళ్ళు, సంఘంలో క్రియాశీల సభ్యులు కుట్టుపని చేసే మహిళలు. 'చిలీ చేతి వృత్తుల వాళ్ళ దేశం' అని పాబ్లో నెరూడా ఎన్నోసార్లు చెప్పినట్టు, చిలీలో చాల రకాల అద్భుతమైన చేతి వృత్తులున్నాయి. అ చేతి వృత్తులలో అల్లకం పనులు, కుట్టుపనులు, రంగు రంగుల ఎంబ్రాయిడరీలు, కర్ర వస్తువులు, మట్టి పాత్రలు, చిన్న చిన్న శిల్పాలు మొదలయినవెన్నో ఉన్నాయి. స్త్రీలు చిన్న చిన్న గుడ్డ ముక్కలతో, సూది దారాలతో ఇంద్రజాలం చేసే వృత్తులున్నాయి. ఇవాళ చిలీలో ఇటువంటి కుట్టు, ఎంబ్రాయిడరీ పనులతోనే మహిళలు పినోచెట్ నిరంకుశ ప్రభుత్వాన్ని ఎదిరించే మార్గాలు కనిపెట్టారు. తర తరాలుగా సున్నితంగా, లలితంగా ఉంటూ వస్తున్న కుట్టుకుని ఇవాళ శత్రువుకు వ్యతిరేకంగా బలమైన ఆయుధంగా మారింది.

చిలీలో ఇటువంటి చేతి వృత్తులలో ముఖ్యమైనది అర్పిల్లరా అనేది. అర్పిల్లరా అంటే (స్పానిష్‌లో) ముతక కాన్వాస్ గుడ్డ. అటువంటి కాన్వాస్ గుడ్డ మీదనో, బస్తా సంచుల మీదనో బొమ్మలు, దృశ్యాలు కుట్టడమే ఈ కళ. ఈ మొత్తం దృశ్యాన్ని ఇళ్ళలో అలంకరణగా గోడకు తగిలించుకునేట్టుగా తయారు చేస్తారు. దృశ్యాన్ని వెనుక ఉండే అర్పిల్లరా పేరు మీదనే మొత్తం దృశ్యాన్నీ, పటాన్నీ అర్పిల్లరా అని పిలుస్తారు. చిన్న చిన్న గుడ్డ ముక్కలతో, రంగుల దారాలతో దృశ్యాల్ని, మనుషుల్ని, ప్రకృతిని తయారుచేసి అర్పిల్లరాలో కుడతారు.

1974లో అసోసియేషన్ ఆఫ్ ఫామిలీస్ ఆఫ్ డిటెయిన్డ్ - డిజప్పియర్డ్ ఈ అర్పిల్లరాలను తయారు చెయ్యడం ప్రారంభించింది. ప్రొపాజ్ కమిటీని నిషేధించిన తర్వాత, కొత్తగా రూపొందిన వికారేట్ ఆఫ్ సాలిడారిటీ అనే చర్చి సంస్థ ఈ వర్క్ షాపులను నిర్వహిస్తోంది. ముడి సరుకులు ఇవ్వడం, పూర్తయిన అర్పిల్లరాలను కొని విదేశాల్లలో అమ్మి అర్పిల్లరాలు అల్లిన స్త్రీలకు డబ్బివ్వడం ఈ సంస్థ పనులు. చిలీలో ఈ అర్పిల్లరాలను కొనడంగాని, అమ్మడం గాని, ఉంచుకోవడం గాని నిషిద్ధ చర్యలు. కనుక అర్పిల్లరాల వ్యాపారమంతా రహస్యంగానే జరుగుతుంది.

ఈ స్త్రీలు మొదట అర్పిల్లరాలు తయారుచేయడం ప్రారంభించినప్పుడు, కుటుంబం మనుగడకు డబ్బు సంపాదించడం కోసం, ఏదో ఒక తెలిసిన పని చేయాలని ప్రారంభించారు. క్రమ క్రమంగా ఏ దృశ్యాల్ని తయారు చెయ్యాలనే ప్రశ్నలోంచి తమ జీవితాల్నే చిత్రించే కళ ఎదిగి వచ్చింది. తమ జీవితాల్లో ఉన్న అరెస్టులు, చిత్రహింసలు, రాత్రుళ్ళలో రహస్యంగా ఖననం చేసే మృతదేహాలు, ఖాళీ కుండలు, ఖాళీ కుర్చీలు మొదలయినవి అర్పిల్లరాల మీదికి ఎక్కడం ప్రారంభించాయి. వ్యక్తిగత విషాదాల్లో నుంచి సామూహిక చర్యలు, సామూహిక చైతన్యం వికసించింది. తమకు తమ, కుటుంబానికీ ఏం జరిగిందో చిత్రించే క్రమంలో తమ దేశానికేం జరిగిందో వాళ్ళు చిత్రించారు. తమ దేశానికి ఆ దుస్థితి కల్పించిన దుర్మార్గ పాలకుల పట్ల ద్వేషంతో ఆ బొమ్మలకు రంగులు దిద్దారు. జీవం తొణికిసలాడేలా మార్చారు.

ప్రతి అర్పిల్లరా కూడ అది తయారుచేసే స్త్రీ జీవితం నుంచి ఒక దృశ్యమే. వాళ్ళ జీవితం ముక్కలు ముక్కలుగా చిన్నాభిన్నమై పోయింది. వాళ్ళిప్పుడు ముక్కలు ముక్కలుగా ఉండే గుడ్డ పీలికల్ని మెల్ల మెల్లగా, విచారంగా కలిపి కుడుతున్నారు. మిరెయా తన కొడుకు అరెస్టును అర్పిల్లరాగా అల్లదలచింది. ఆ అర్పిల్లరా తయారు కావడానికి చాల రోజులు పట్టింది. ఎందరో స్నేహితులు సాయం పడవలసి వచ్చింది. అట్లా అర్పిల్లరా వర్క్‌షాప్ వాళ్ళ జీవితంగా, వాళ్ళ జీవనాధారంగా, విషాదంలో తోడు నీడగా నిలుస్తోంది. అర్పిల్లరా ఒక సృజనాత్మక పోటీ పని ఏమీ కాదు. నిత్య జీవిత కార్యక్రమాలనూ కడగండ్లనూ పంచుకునే ఒక సాధనం.

అర్పిల్లరాలకు పాశ్చాత్య దేశాలలో చాల ఆదరణ ఉంది. శాంటియాగో పరిసరాల్లో పని చేస్తున్న ముప్పై ఒక్క వర్క్‌షాపుల్లో తయారయిన అర్పిల్లరాలు విదేశాలకు వెళ్ళి, వాటి సృష్టికర్తలకు జీవనాధారాన్ని కల్పిస్తున్నాయి. అంతకన్న ముఖ్యంగా, అర్పిల్లరాల ఆదరణ కేవలం ఒక మార్కెట్ దృష్టితో కాక, చిలీలో జరుగుతున్న అమానుష పాలన పట్ల ప్రపంచ నిరసనను సంఘటితం చేసే ఒక సాధనంగా ఈ స్త్రీలు చూస్తూ ఉన్నారు.

ఒక రచయిత ఒక్కొక్క మాటనూ ఏరి రచన చేసినట్టుగా ఈ స్త్రీలు ఒక్కొక్క గుడ్డ పీలికను జాగ్రత్తగా, శ్రద్ధగా, ప్రేమతో ఏరుతారు. ఒకళ్ళ పని ఒకళ్ళు చూస్తూ వ్యాఖ్యానిస్తూ ఉంటారు. ఇర్మా తన కొడుకు, కోడలూ అరెస్టయిన ఉదంతాన్ని అర్పిల్లరాగా పూర్తిచేసి, ఆ అనుభవాన్ని పునర్జీవించినప్పుడు చుట్టూ ఉన్నవాళ్ళు అవాక్కయిపోయారు. ముగ్గురు మనుషులు నిండా నల్ల దుస్తులు వేసుకుని, సబ్ మెషిన్‌గన్‌లు పట్టుకుని ఆ భార్యాభర్తల మీద దూకుతున్నారు. ఆ అర్పిల్లరా ఏ పుస్తకం కన్న, పత్రికా వార్త కన్న శక్తివంతంగా ఆ సంఘటనను చిత్రించింది.

మరొక స్త్రీ, మెర్సిడిస్, కుట్టిన అర్పిల్లరాలో ఒక ఖాళీ కుర్చీ, ఒక ఖాళీ టేబుల్ మాత్రం ఉన్నాయి. ఆ అర్పిల్లరా వెనుక కుట్టిన ఒక చిన్న సంచీలో ఆమె ఒక కాగితం రాసి పెట్టింది. "ఈ అర్పిల్లరా నా కొడుకు అరెస్టుకు ప్రతీక. వాణ్ని పది సంవత్సరాల కింద అరెస్టు చేశారు. అప్పటినుంచీ మాయమైపోయాడు. ఎవరూ ఏమీ జవాబివ్వడం లేదు. నేను ముసలిదాన్నయి పోతున్నాను. వాణ్ణి వెతకడంలో నాకు సాయం చెయ్యండి. నేనొక విషాదాన్ని అనుభవిస్తున్న తల్లిని, వితంతువును. నా కొడుకు దొరికేదాకా నాకు ధైర్యమూ శక్తీ ఇమ్మని భగవంతుణ్నీ, పవిత్ర కన్యనూ ప్రార్థిస్తున్నాను. ఆమెన్".

మరొక అర్పిల్లరా మీద ఒక యువకుడి ఫొటో మాత్రం ఉంది. 'అరెస్టయి-అదృశ్యం చేయబడ్డవాళ్ళకు న్యాయం జరగాలి. సత్యం బైటికి రావాలి' అని నినాదం ఎంబ్రాయిడరీ చేసి ఉంది. ఇంకొక అర్పిల్లరా మీద ఒకే ఒక్క ప్రశ్న : "కెయిన్, మీ అన్న ఎక్కడ ?"

ఈ అర్పిల్లరాలు వేదనను మాత్రమే పలకవు. ఆశను కూడ చిత్రిస్తాయి.

స్వీకారం

* కథ '90-ఉత్తమ కథల సంకలనం. సంకలన కర్తలు : వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్. కథాసాహితి ప్రచురణ, 152+8 పేజీలు, 1/8 డెమ్మీ, సాదాప్రతి రూ. 17, మేలుప్రతి రూ. 30. ప్రతులకు : నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ మందిర్ ఎదురుగా, కాచిగూడ, హైదరాబాద్.

* ఆవాహన-కవితా సంకలనం-గౌతమ్ - విరసం, తూర్పుగోదావరి జిల్లా యూనిట్ ప్రచురణ, 38+12 పేజీలు, 1/8 డెమ్మీ, ఐదు రూపాయలు. ప్రతులకు : డా॥ కొటా నారాయణరావు, తులసీ నర్సింగ్ హోమ్, దోసకాయల పల్లి, కోరుకొండ మండలం, 533292.

* జ్ఞాపకాల చిత్తడి—మిస్సింగ్‌పై రచనల సంకలనం. శ్యాం ప్రచురణలు, కర్నూలు, 32 పేజీలు, 1/8 డెమ్మీ, మూడు రూపాయలు.

దాదాపు ప్రతి అర్పిల్లరాలోను ఎర్రగా వెలిగే పెద్ద సూర్యుడుంటాడు. నల్లగా పరచుకున్న ఆండిస్ పర్వత శ్రేణి ఉంటుంది. ఆండిస్ చిలీకి సూచన. సూర్యుడు వెలుగుకూ, విశ్వవ్యాపిత ఆశకూ సూచన. గొంతు నొక్కబడిన వాళ్ళకోసం ప్రపంచమంతా వినిపించే ఆశాగానం అర్పిల్లరా.

దారుణ దమననీతిని ఎదిరించేందుకు తమలేత వేళ్ళనే పదునైన ఆయుధాలుగా, సాంప్రదాయిక కళనే ప్రతిఘటనా పోరాట రూపంగా మార్చిన చిలీ మహిళల అనుభవం నుంచి దేశ దేశాలలో నిర్బంధం పాలవుతున్న ప్రజలందరూ నేర్చుకోవలసింది ఎంతో ఉంది. అణచివేతను స్త్రీలు ఎదిరించడం, సైనిక నియంతృత్వం కింద కూడ ప్రతిఘటనా మార్గాలు అన్వేషించడం, వ్యక్తిగత విషాదాన్ని సామూహిక చైతన్యంగా మార్చడం, కళారూపాన్ని అద్భుత నిరసన సాధనంగా వాడడం వంటి ఎన్నో రంగాలలో చిలీ మహిళలు ఆదర్శంగా నిలుస్తారు.

[మార్జొరీ ఎగోసిన్ రాసిన 'స్క్రాప్స్ ఆఫ్ లైఫ్ : చిలియన్ అర్పిల్లరాస్-చిలియన్ విమెన్ అండ్ ది పినోచెట్ డిక్టేటర్‌షిప్' ఆధారంగా.]

* సమాచార సామ్రాజ్యవాదం – ప్రసంగ వ్యాసం – ఎస్. వేణుగోపాల్. విరసం విశాఖ యూనిట్ ప్రచురణ, 12 పేజీలు, 1/8 డెమ్మీ, ఒక రూపాయి ఈ రెండు పుస్తకాలు ప్రతులకు : వి. వెంకయ్య, 6-5-13, కావలి, 524201

* మట్టికాళ్ళ మహారాక్షసి – నవల – గూగీ వా థియోంగో, స్వేచ్ఛా సాహితి ప్రచురణ, 326+18 పేజీలు, 1/8 డెమ్మీ, 20 రూపాయలు. ప్రతులకు : ప్రగతి బుక్ హౌస్, మ్యూజియం రోడ్, ఏలూరు రోడ్, విజయవాడ 520002.

* జర్నలిస్టు రసూల్ అమర్ రహే – ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల సంఘం, కరీంనగర్ జిల్లాశాఖ, 16 పేజీలు, 1/4 డెమ్మీ, వెల లేదు. చిరునామా లేదు.

* స్వేచ్ఛ – విపశ్యన, 5 కవితలు. 12 పేజీలు, 1/8 డెమ్మీ, వెల లేదు. చిరునామా లేదు.

* భారత వ్యవసాయరంగపు అర్థ భూస్వామిక స్వభావం – విమోచన ప్రచురణలు, 58 పేజీలు, 1/8 డెమ్మీ, మూడు రూపాయలు. ప్రతులకు : విమోచన, నల్లకుంట, హైదరాబాద్ 500044.

* 'Suppression of Naxalism-What it really Means'- APCLC & OPDR. 24 pages, 1/4 demmy, Rs 3 : For Copies : SSC Bose, Dr. Ramanadham Chamber of Law, Peddibhotlavari Veedhi, Vijayawada-520002.

వెలువడింది !

విప్లవ రచయితల సంఘం

తూర్పు గోదావరి జిల్లా యూనిట్ ప్రచురణ

గౌతమ్

ఆవాహన

(కవితలు)

వెల రూ. 5/-

ప్రతులకు : డా॥ కాటా నారాయణరావు
తులసీ నర్సింగ్ హోమ్
దోసకాయలపల్లి
కోరుకొండ మండలం-533 292

వెలువడింది !

సృజన ప్రచురణ

కె. వి. ఆర్.

కవిత్వంలో నిబద్ధత

(వ్యాస సంకలనం)

వెల రూ. 10/-

ప్రతులకు : సృజన
ఫ్లాట్ 3, ఫ్లోర్ 2
లక్ష్మి అపార్ట్ మెంట్స్
నల్గొండ చౌరస్తా, మలక్ పేట
హైదరాబాద్-500 036

వెలువడింది !

స్వేచ్ఛాసాహితి ప్రచురణ

గూగీ వా థియోంగో

మట్టికాళ్ళ మహారాక్షసి

(నవల)

వెల రూ. 20/-

సోల్ డిస్ట్రిబ్యూషన్ : ప్రగతి బుక్ హౌస్
గాంధీ కో-ఆప్, అర్బన్ బ్యాంకు ఎదుట
మ్యూజియం రోడ్, గవర్నరుపేట
విజయవాడ-520 002

SRJANA Telugu Monthly Feb-Mar 1992
Regd. No. with the Registrar of Newspapers for India 10953/67

నా రుద్రాక్షమాలలో ప్రతి గింజ మీదా
నీ పేరే కనిపిస్తుందని
కన్నా, నీకు చెప్పాలని...
ఇరవై రెండేళ్ళ నిండకముందే నిన్ను
ఇంకెన్నడూ కనబడకుండా చేశారు వాళ్ళు
బిడ్డా నీకు తెలుసా
ఆనాటి నుంచీ పొద్దస్తమానమూ
నీ కోసం వెతుకుతూనే ఉన్నా
ప్రజలకోసం జీవించడమే నీ ఆశయం
ఇవాళ ప్రజల హక్కులన్నీ తొక్కేయబడ్డాయి
ఇప్పుడు నువు నీ ప్రజల మధ్య లేవు
నీ స్థానాన్ని నేను తీసుకున్నాను
ఒకానొక రోజు మన ప్రజలు
విముక్తమవుతారని నాకు తెలుసు
ఎంతమంది మన మిత్రులు ఖైదీలు, మృతజీవులు, ప్రవాసులు
ఐనా మిగిలినవాళ్ళం పోరాడుతూనే ఉంటాం
యువస్వరాల మధ్య, ఆగ్రహ ప్రకటనల మధ్య,
దృఢమైన పాదాల మధ్య, ఉద్విగ్నహృదయాల మధ్య
ఎల్లవేళలా ముందడుగే వేస్తాం
ఈ దీర్ఘకాలిక పోరాటంలో
దైవన్యాయం మీద నమ్మకముంచిన సోదరుల వలె
ఇంతమంది తల్లుల వేదనలనూ ప్రార్థనలనూ
సకల లోకం వింటూనే ఉంది
అణచివేత ఎంతసాగనీ, నిర్భయంగా
నేనిక్కడ, ఇక్కడే నిలబడతాను
పోగొట్టుకున్న పిల్లల రాక కోసం నిరీక్షిస్తూ
న్యాయం కోసం, సత్యం కోసం
అశేష ప్రజల హక్కు కోసం
స్వేచ్ఛ అనే హక్కు కోసం.

– కొడుకును పోగొట్టుకున్న ఒక చిలియన్ తల్లి.

SRJANA, Flat 3, Floor 2, Lakshmi Apartments, Nalgonda X Roads,
Malakpet, Hyderabad-500 036. Rs. 5/-